ninadam.in

తెలుగు దినపత్రిక

# నినాదం

నిఖార్సైన జర్నలిజం

బుధవారం, జనవరి 14, 2026 | సంపుటి - 22 | సంచిక 113 | వెల - 7 | పేజీలు - 12 - 8

Published from Hyderabad, Vijayawada Circulated from TS and AP.. Hyderabad, Karimnagar, Khammam, Mahabubnagar, Nalgonda, Nizamabad, Warangal, Vijayawada, Guntur, Ongole, Nellore, Tirupathi, Kadapa, Ananthapur, Kurnool, Tadepalligudem, Rajahmundry, Visakhapatnam, Srikakulam



## నాలుగోసారి వాత తప్పదు!

**ఒళ్లంతా విషం నింపుకొని బీఆర్ఎస్ నేతలు కారుకూతలు కూస్తున్నారు**

**అసెంబ్లీ, పార్లమెంట్, పంచాయతీ ఎన్నికల్లో ప్రజలు ఇప్పటికే కర్రుకాల్చి వాత పెట్టినా.. గత పాలకులకు ఇంకా జ్ఞానం రాలేదు. ఒళ్లంతా విషం నింపుకొని రోడ్ల మీద కారు కూతలు కూస్తున్న ఆనాటి 'ప్రభువుల'కు రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో నాలుగోసారి వాత తప్పదని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి పేర్కొన్నారు.**

- అప్పటి 'ప్రభువుల'కు ప్రజలే బుద్ధి చెబుతారు
- ఓటమిని జీర్ణించుకోలేక పిచ్చి ప్రేలాపనలు
- ప్రజలు మిమ్మల్ని అగ్నిగుండంలోకి నెట్టెస్తారు
- బీఆర్ఎస్‌పై మంత్రి పొంగులేటి ధ్వజం
- కాంగ్రెస్ సర్పంచులకు సన్మాన సభలు

2

## సీపీ సజ్జన్నార్‌కు సిట్ బాధ్యతలు

- సీఎం ఫోటోల మార్ఫింగ్ వ్యవహారంలో
- ఐఎఎస్ మహిళా అధికారిని కించపరచేలా వార్తలు
- రెండు ఘటనలపై సిట్ ఏర్పాటు చేస్తూ డిజిపి ఉత్తర్వులు

2





## రైతు అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యం

- **ఆయిల్ పామ్ సాగులో తెలంగాణ అగ్రస్థానం**
- 66 కోట్లతో 2400 ఎకరాలకు సాగునీరు
- మంచుకొండ ఎత్తిపోతల పథకం జాతికి అంకితం
- రైతుల సాగునీటి కల నెరవేరింది
- మంచుకొండ ఎత్తిపోతల పథకం ప్రారంభించిన మంత్రి తుమ్మల నాగేశ్వర రావు

**ఖమ్మం ప్రతినిధి, జనవరి 13 (నినాదం):**

2

రాష్ట్ర రైతాంగ అభ్యున్నతే లక్ష్యం గా ప్రభుత్వం పనిచేస్తోందని, రానున్న మూడేళ్లలో ఆయిల్ పామ్ సాగులో తెలంగాణను దేశంలోనే అగ్ర స్థానంలో నిలబెట్టడమే తమ సంకల్పమని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వర రావు స్పష్టం చేశారు.మంగళవా రం రఘునాథపాలెం మండ లం వి.వెంకటాయపాలెం గ్రామంలో నిర్మించిన 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్, మంచుకొండ ఎత్తిపోతల పథకంను మంత్రి తుమ్మల నాగేశ్వర రావు పోలీస్ కమిషనర్ సునీల్ దత్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ, అదనపు కలెక్టర్ పి.శ్రీనివాస రెడ్డిలతో కలిసి ప్రారంభించి జాతికి అంకితం చేశారు.

# 52.4 లక్షలు..




### మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో 52,43,023 మంది ఓటర్లు

- మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ఓటర్ల తుదిజాబితా ప్రకటన
- 26,80,014 మంది మహిళా ఓటర్లతో వారిదే అగ్రస్థానం
- నిజామాబాద్ కార్పొరేషన్‌లో అత్యధికంగా 3,48,051 మంది ఓటర్లు

2

**హైదరాబాద్,జనవరి 13(నినాదం):**

తెలంగాణలో త్వరలో మున్సిపల్ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో రాష్ట్ర ఎన్నికల సంఘం తుది ఓటర్ల జాబితాను ప్రకటించింది. ఎన్నికలు జరగనున్న మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో 52,43,023 మంది ఓటర్లు ఉన్నట్లు వెల్లడించింది.



## ఇరాన్‌తో వ్యాపార దేశాలపై ట్రంప్ అక్కసు

- 25శాతం సుంకాల విధిస్తామని తాజాగా హెచ్చరిక
- ట్రంప్ బెదిరింపులకు లొంగబోమన్న ఖమేనీ

**వాషింగ్టన్, నినాదం:**


ఆర్థిక సంక్షోభం, అంతర్గత తిరుగుబాటు సమస్యలతో సతమతమవుతున్న ఇరాన్‌పై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరో పిడుగు వేశారు. ఇరాన్‌తో వాణిజ్యం చేసే దేశాలపై 25 శాతం సుంకాలను విధిస్తామని హెచ్చరించారు.

2

# కుంభమేళాకు మించి సమ్మక్క సారలమ్మ జాతర

- రూ.250 కోట్లకుపైగా నిధులతో పనులు సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక పర్యవేక్షణ
- మేడారం జాతర ఏర్పాట్లపై మంత్రులు అడ్లూరి లక్ష్మణ్ కుమార్, సీతక్క

**ఈనెల 28వ తేదీ నుండి 31 వ తేదీ వరకు జరిగే మేడారం సమ్మక్క, సారలమ్మ జాతరకు ఈసారి గతంకన్నా రెట్టింపు సంఖ్యలో భక్తులు హాజరయ్యే అవకాశం ఉన్నందున ప్రభుత్వంలోని వివిధ శాఖలు సమన్వయంతో పనిచేసి భక్తులకు ఏవిధమైన ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని రాష్ట్ర మంత్రులు అడ్లూరి లక్ష్మణ్ కుమార్, దనసరి అనసూయలు అన్నారు. సమ్మక్క?సారలమ్మ జాతరను కుంభమేళాకు మించి అద్భుతంగా నిర్వహించి, రాష్ట్ర ప్రభుత్వానికి జాతీయ స్థాయిలో మంచి పేరు తీసుకురావాలని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అధికారులకు పిలుపునిచ్చారు.**




**హైదరాబాద్, జనవరి 13(నినాదం):**

మేడారం జాతరపై డా. బీ.ఆర్ అంబేడ్కర్ సచివాలయంలో జరిగి న ఉన్నత స్థాయి సమీక్ష సమావేశంలో మంత్రులు, అధికారులు పాల్గొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణ రావు, ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు అరవింద్ కుమార్, సబ్యసాచి ఘోష్, అడిషనల్ డీజీలు విజయ్ కుమార్, స్వాతి లక్రా, వివిధ శాఖ కార్యదర్శులు, ములుగు జిల్లా కలెక్టర్ దివాకర తదితర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్షణ్ కుమార్ మాట్లాడుతూ, గత 2024 మేడారం జాతరకు కోటి న్నర మంది హాజరుకాగా, ఈసారి 2026లో జాతరకు దాదాపు గతం లో ఎన్నడూ లేనివిధంగా

▸▸తరువాయి 2లో..

## ఉగ్రవాదానికి తెగిస్తే గట్టిగా బుద్ధి చెబుతాం

- ఆపరేషన్ సిందూర్‌లో భూతల దాడులకు కూడా సిద్ధపడ్డాం
- భద్రతా సవాళ్లను ఎదుర్కోవ దంలో భారత్ సైనిక సంసిద్ధత
- షక్సాగామ్ వ్యాలీ ఎప్పటికీ భారత్‌లో భాగమే
- మీడియా సమావేశంలో ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది



**న్యూఢిల్లీ, నినాదం:**

ఉగ్రవాదులు తెగిస్తే గట్టిగా బుద్ధి చెబుతామని, ఆపరేషన్ సిందూర్ కొనసాగుతోందని, త్రివిధ దళాల సమన్వయానికి ఇది నిదర్శనమని ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది అన్నారు. దిల్లీలో జరిగిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఆయన ..భద్రతా సవాళ్లను ఎదుర్కోవ డంలో భారత్ సైనిక సంసిద్ధత దీనిద్వారా స్పష్టమైందని పేర్కొన్నారు. ఆపరేషన్ సిందూర్‌ను చాలా కచ్చితత్వంతో అమలుచేశాం. 88 గంటల పాటు సాగిన ఆ ఆపరేషన్‌లో మన సైనిక దళాలు అత్యంత సమర్థంగా పనిచేశాయి.

## తెలుగు ప్రజలందరికీ సీఎం రేవంత్ సంక్రాంతి శుభాకాంక్షలు

**హైదరాబాద్, (నినాదం):**

తెలుగు ప్రజలందరికీ ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. భోగ భాగ్యాలను అందించే భోగి.. కొత్త కాంతులు తెచ్చే సంక్రాంతి.. కనుమ పండుగలను అందరూ ఆనందంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ అభివృద్ధి పథకాలన్నీ రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి చేరాలనేది తమ సంకల్పమని ముఖ్యమంత్రి అన్నారు. తెలంగాణ రైజింగ్ 2047 విజన్ సాకారం చేసేందుకు ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ప్రజలందరూ సంతోషంగా తెలుగు సంప్రదాయం ఉట్టిపడేలా సంక్రాంతి పండుగ సంబురాలు జరుపుకోవాల న్నారు. పతంగులు ఎగరవేసేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు

## 18న మేడారంలో కేబినెట్ భేటీ?

- 19న మేడారం పనులకు సీఎం ప్రారంభోత్సవాలు
- 19న రాత్రికి దావోస్ వెళ్లనున్న రేవంత్

వివరాలు 2

## బెంగళూరులో దారుణ ఘటన

- కామంతో యువతిపై టీనేజర్ దాడి
- తిరస్కరించడంతో చంపేసి ఇంటికి నిప్పు
- దర్యాప్తులో బయటపడ్డ అసలు వ్యవహారం

2

## వీధి కుక్కల బాధ్యత రాష్ట్రాలదే

2

- ఒక్కటి కరిచినా అందుకు బాధ్యత వహించాల్సిందే
- అందుకు విధించే జరిమానాలకు సిద్ధంగా ఉండండి
- వీధి కుక్కలకు ఆహారం పెట్టేవారు కూడా దోషులే
- ఘాటు హెచ్చరిక చేసిన సుప్రీం కోర్టు

2


**న్యూఢిల్లీ, నినాదం:**

వీధి కుక్కల అంశంపై సుప్రీంకోర్టు మరోసారి కీలక వ్యాఖ్యలు చేసింది. ఈ వ్యవహారంపై మంగళవారం విచారణ జరిపిన అత్యున్నత న్యాయస్థానం.. కుక్కల బెడదను అరికట్టేందుకు చర్యలు తీసుకోకపోతే ఆయా రాష్ట్రాలపై భారీ జరిమానాలు వేస్తామని హెచ్చరించింది. ప్రతి కుక్క కాటు కు పరిహారం చెల్లించాల్సిందేనని స్పష్టంచేసింది.



## కవితను కాంగ్రెస్‌లో చేర్చుకోం

- బిఆర్ఎస్‌కు గతమే తప్ప భవిష్యతు లేదు...రాదు
- కెసిఆర్ కుటుంబ అవినీతిపై కవిత వ్యాఖ్యలే నిదర్శనం
- మీడియాతో పిసిసి చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్



2

**హైదరాబాద్, నినాదం:**

తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత కాంగ్రెస్ పార్టీలో చేరబోతున్నారంటూ కొద్దిరోజులుగా వస్తున్న వార్తలపై పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ తోసిపుచ్చుతూ.. అలాంటిదేమీ లేదని అన్నారు. మంగళవారం నాడు మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో పీసీసీ చీఫ్ మాట్లాడుతూ.. కవితను కాంగ్రెస్ పార్టీలో చేర్చుకునే అవకాశమే లేదని స్పష్టం చేశారు.

## గాంధీపేరుతో కాంగ్రెస్ నీచ రాజకీయం

- పథకాలతో సహా అన్నిటికి ఇందిరా, రాజీవ్ పేర్లేనా
- వాల్మీకి అంబేడ్కర్ పేరున్న పథకం పేరు ఎందుకు మార్చారు
- కాంగ్రెస్ రాజకీయాలపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి
- కరీంనగర్ మున్సిపాలిటీలో బిజెపి జెండా ఎగరేస్తాం
- కేంద్రమంత్రి బండి సంజయ్ వ్యాఖ్యలు



2



# రైతు అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యం

అనంతరం మం చుకొండ ప్రాజెక్టు నీటి డెలివరీ సిస్టం వద్ద కృష్ణా జలాలకు పూలతో ఘన స్వాగతం పలికిన మంత్రి, నిర్వహించిన బహిరంగ సభలో రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ. గత ఏడాది ఇదే రోజున మంచు కొండ ఎత్తిపోతల పథకానికి శంకుస్థాపన చేస్తూ ఏడాది లోపే సాగునీరు అందిస్తామని ఇచ్చిన హామీని నెరవేర్చామని తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిల సహకారంతో పనులు సకాలంలో పూర్తి చేశామని అన్నారు.రఘునాథపాలెం మండ లంలో గిరిజనులు, చిన్న–సన్నకారు రైతులు అధికంగా ఉన్నారని, వారి సాగునీటి ఆకాంక్ష తీర్చేందుకు నాగార్జునసాగర్ ఎడమ కాల్వపై లిఫ్ట్ ఏర్పాటు చేసి కృష్ణా జలాలను అందిస్తున్నామని మంత్రి చెప్పారు. రాజకీయాల్లోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకు సుమారు 300 లిఫ్ట్ లు ఏర్పాటు చేశామని, మంచుకొం డ ఎత్తిపోతల పథకం ఎన్ఎస్పీపై చివరి లిఫ్ట్ అని వివరించారు.ప్ర స్తుతం కృష్ణా జలాలతో చెరువుల ను నింపుతున్నామని, వచ్చే సంవ త్సరం నాటికి సీతారామ ఎత్తిపో తల పథకం పూర్తి చేసి గోదావరి జలాలతో చెరువులను నింపు తామని స్పష్టం చేశారు. బుగ్గవాగు ప్రాజెక్టు పూర్తైతే ఎటువంటి లిఫ్ట్ అవసరం లేకుండా గ్రావిటీ ద్వారా చెరువులు నింపుతామనీ తెలిపా రు.వ్యవసాయానికి అవసరమైన గోదాములు, మౌలిక వసతుల కల్ప న పనులు పూర్తి చేస్తున్నా మని, దేశంలో ఎక్కడా లేని విధంగా సన్న రకం ధాన్యానికి బోనస్ ఇస్తున్నా మని మంత్రి తెలిపారు.రైతులకు యూరియా కొరత లేదని, ధాన్యం కొనుగోలు, విద్యుత్ సరఫరా, సాగు నీటి విషయంలో ఎలాంటి సమస్య లు లేవని భరోసా ఇచ్చారు.రైతు లు లాభసాటి ఆయిల్ పామ్ సాగు వైపు దృష్టి సారించాలని, విదేశా లకు వెళ్తున్న లక్షల కోట్ల రూపాయ లు మన రైతులకే దక్కాలనే ఉద్దే శంతో ప్రభుత్వం పనిచేస్తోందని మంత్రి పేర్కొన్నారు.ఈ కార్యక్ర మంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, ఖమ్మం నగర మేయర్ పునుకొల్లు నీరజ, ఖమ్మం మున్సిపల్ కమిష నర్ అభిషేక్ అగస్త్య, ఖమ్మం వ్యవ సాయ మార్కెట్ కమిటీ చైర్మన్ హన్మంత రావు, ఇరిగేషన్, విద్యుత్ శాఖల ఉన్నతాధికారులు, ప్రజాప్ర తినిధులు, రైతులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# సీపీ సజ్జన్నార్‌కు సిట్ బాధ్యతలు

**హైదరాబాద్, నినాదం:**

హైదరాబాద్ సీసీఎస్‌తో పాటు నారాయణపేట జిల్లా మద్దూర్‌లో నమోదైన సంచలన కేసుల్లో తెలంగాణ డీజీపీ శివధర్ రెడ్డి ప్రత్యేక దర్యాప్తు బృందంను ఏర్పాటు చేశారు. ఈ సిట్‌కు హైదరాబాద్ సీపీ సజ్జనార్ నాయకత్వం వహించనున్నారు. మొత్తం ఎనిమిది మంది సభ్యులతో ఈ ప్రత్యేక బృందాన్ని డీజీపీ ఏర్పాటు చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఫొటోలను అసభ్యకరంగా పోస్ట్ చేసిన వ్యవహారంలో తెలంగాణా పబ్లిక్ టీవీ వాట్సాప్ గ్రూప్‌నకు చెందిన కావలి వెంకటేశ్‌పై కేసు నమోదైంది. కాంగ్రెస్ నేత గూళ్ల నరసింహ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఈ నెల 11న మద్దూర్ పోలీసులు కేసు నమోదు చేశారు. తాజాగా ఓ మహిళా ఐఏఎస్ అధికారిని కించపరిచే విధంగా వార్తలు టెలికాస్ట్ చేసిన వ్యవహారంలో హైదరాబాద్ సీసీఎస్‌లో మరో కేసు నమోదైంది. ఈ కేసులో రెండు తెలుగు న్యూస్ ఛానల్స్, ఏడు యూట్యూబ్ ఛానళ్లపై కేసులు నమోదు చేశారు. ఈ వ్యవహారంపై ఐఏఎస్ అధికారుల సంఘం కార్యదర్శి జయేశ్ రంజన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు చర్యలు చేపట్టారు. ఈ రెండు కీలక కేసుల్లో దర్యాప్తు బాధ్యతను సిట్‌కు అప్పగించారు. నారాయణపేట జిల్లా మద్దూర్, హైదరాబాద్ సీసీఎస్‌లో నమోదైన కేసులపై విచారణకు తెలంగాణ ప్రభుత్వం సిట్ ఏర్పాటుచేసింది. హైదరాబాద్ సీపీ సజ్జనార్ నేతృత్వంలో 8 మందితో సిట్ ఏర్పాటు చేస్తూ డీజీపీ శివధర్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. కావలి వెంకటేశ్ అనే వ్యక్తి సీఎం ఫొటోలను అసభ్యకరంగా రూపొందించి వాట్సప్ గ్రూపులో పోస్ట్ చేశాడు. మహిళా ఐఏఎస్‌ను కించపరుస్తూ వార్తలను ప్రచారం చేయడంపై సీసీఎస్‌లో కేసు నమోదు చేశారు. ఐఏఎస్ అధికారుల సంఘం ఫిర్యాదు మేరకు రెండు తెలుగు న్యూస్ ఛానళ్లతో పాటు ఏడు యూట్యూబ్ ఛానళ్లపై కేసులు పెట్టారు. ఈ రెండు కేసుల వ్యవహారంపై సిట్ దర్యాప్తు చేయనుంది. సిట్‌లో సభ్యులుగా నార్త్ రేంజ్ జాయింట్ సీపీ శ్వేత, చేవెళ్ల డీసీపీ యోగేశ్ గౌతమ్, హైదరాబాద్ అడ్మిన్ డీసీపీ వెంకటలక్ష్మి , సైబర్ క్రైమ్ డీసీపీ అరవింద్ బాబు, విజిలెన్స్ అదనపు ఎస్పీ ప్రతాప్, సీసీఎస్ ఏసీపీ గురు రాఘవేంద్ర, సైబర్‌సెల్ ఇన్‌స్పెక్టర్ శంకర్‌రెడ్డి, సైబర్‌సెల్ ఎస్సై హరీశ్ ఉన్నారు.

# 52.4 లక్షలు..

వీరిలో 25,62,369 మంది పురుష ఓటర్లు కాగా.. 26,80,014 మంది మహిళా ఓటర్లు, 640 మంది ట్రాన్స్‌జెండర్ ఓటర్లు ఉన్నారు. పట్టణ స్థానిక సంస్థల్లో పురుషుల కంటే మహిళా ఓటర్లే అధికంగా ఉండటం గమనార్హం. నిజామాబాద్ కార్పొరేషన్‌లో అత్యధికంగా 3,48,051 మంది ఓటర్లు ఉండగా.. కొత్తగూడెం కార్పొరేషన్‌లో అత్యల్పంగా 1,34,775 మంది ఓటర్లు ఉన్నారు. ఆదిలాబాద్ మున్సిపాలిటీలో అత్యధికంగా 1,43,655 మంది ఓటర్లు ఉండగా.. అమరచింత మున్సిపాలిటీలో అత్యల్పంగా 9,147 మంది ఓటర్లు ఉన్నారు. రాష్ట్రంలో పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల కోసం పురపాలకశాఖ కసరత్తు ముమ్మరం చేసింది. రిజర్వేషన్లు ఖరారైన తర్వాత నోటిఫికేషన్ విడుదల కానుంది. జనాభా ప్రాతిపదికన వార్డులు, డివిజన్లు, ఆయా మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల రిజర్వేషన్లను ఖరారు చేయనున్నారు. మొత్తం ఎన్నికల పర్వంలో రిజర్వేషన్ల ప్రక్రియ అత్యంత కీలకం కావడంతో అధికారులు దీనిని సకాలంలో పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నారు. రాష్ట్రంలో గడువు ముగిసిన 117 మున్సిపాలిటీలు, 6 కార్పొరేషన్ల ఎన్నికలకు రంగం సిద్ధమైన సంగతి తెలిసిందే.

# వీధి కుక్కల బాధ్యత రాష్ట్రాలదే

వీధి కుక్కల బెడదను నివారించేందుకు రాష్ట్రాలు తగిన చర్యలు చేపట్టాలి. లేదంటే ప్రతి కుక్క కాటుకు, కుక్కల దాడిలో జరిగిన ప్రతి మరణానికి గానూ ఆయా రాష్ట్రాలపై మేం నిర్దేశించిన భారీ పరిహారాలను చెల్లించాలని న్యాయస్థానం స్పష్టం చేసింది.కుక్క కరిచిన ప్రభావం బాధిత వ్యక్తిపై జీవితకాలం ఉంటుందని న్యాయస్థానం పేర్కొంది. ఈ సందర్భంగా వీధి కుక్కలకు ఆహారం పెడుతున్న వారిపైనా కోర్టు అసహనం వ్యక్తం చేసింది. ఏదైనా సంస్థ ఆహారం పెడుతున్న కుక్కల దాడిలో ఓ చిన్నారి మరణిస్తే.. అప్పుడు ఎవరిని బాధ్యుల్ని చేయాలి? ఆ ప్రాణనష్టానికి సదరు సంస్థ బాధ్యత వహించదా అని ప్రశ్నించింది. ఇక, వీధికుక్కలకు ఆహారం పెట్టే వారి గురించి మాట్లాడుతూ.. మీకు శునకాలపై అంత ప్రేమ ఉంటే.. వాటిని మీ ఇంటికి తీసుకెళ్లి పెంచుకోండి. వీధి కుక్కల సమస్య భావోద్వేగభరిత అంశమని అంటున్నారు. మీ భావోద్వేగం కేవలం కుక్కల పైన మాత్రమేనా? మేం మనుషుల గురించి కూడా సమానంగా ఆందోళన చెందుతున్నాం. కుక్కలు వీధుల్లో తిరుగుతూ ప్రజలను భయపెట్టే పరిస్థితిని మేం ఆమోదించబోం అని ధర్మాసనం వెల్లడిరచింది. దేశవ్యాప్తంగా వీధి కుక్కల దాడుల ఘటనలు పెరుగుతున్న నేపథ్యంలో గతేడాది నవంబరులో సుప్రీంకోర్టు కీలక ఉత్తర్వులు జారీ చేసిన సంగతి తెలిసిందే. విద్యాసంస్థలు, బస్టాండ్లు, రైల్వేస్టేషన్లు, క్రీడా సముదాయాలు, ఇతర బహిరంగ ప్రదేశాల సమీపంలోని వాటిని షెల్టర్లకు తరలించాలని ఆదేశించింది. ఈ అంశంపై సుప్రీంకోర్టులో విచారణ కొనసాగుతోంది.

# 18న మేడారంలో కేబినేట్ భేటీ ?

హైదరాబాద్ :

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన రాష్ట్ర మంత్రివర్గ సమావేశం ఈ నెల 18న ములుగు జిల్లా మేడారంలో నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిసింది. రాజదాని వెలుపల కేబినేట్ భేటీ జరపాలని నిర్ణయించడం ఇటీవల ఇదే ప్రథమం. 'సమ్మక్క సారలమ్మ మేడారం మహాజాతర' ఈ నెల 28న ప్రారంభం కానుండడంతో.. సంప్రదాయానికి భిన్నంగా ఈసారి మేడారంలో క్యాబినెట్ భేటీ నిర్వహించనున్నట్లు సమాచారం. అదే రోజు సాయంత్రానికి ముఖ్యమంత్రి సహా మంత్రివర్గం మేడారం చేరుకుంటుంది. 5 గంటల తర్వాత క్యాబినెట్ సమావేశమయ్యే అవకాశాలున్నాయి. 19న ఉదయం అమ్మవార్ల నూతన ప్రాంగణ ప్రారంభోత్సవం, దర్శనం అనంతరం ముఖ్యమంత్రి హైదరాబాద్‌కు తిరుగు పయనమవుతారు. అదే రోజు రాత్రి దావోస్‌కు వెళ్తారు. 18న మేడారంలో నిర్వహించాలని యోచిస్తున్న మంత్రివర్గ సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చించనున్నారు.

# నాలుగోసారి వాత తప్పదు!

**హైదరాబాద్, జనవరి 13 (నినాదం):**

అసెంబ్లీ, పార్లమెంట్, పంచాయతీ ఎన్నికల్లో ప్రజలు ఇప్పటికే కర్రుకాల్చి వాత పెట్టినా.. గత పాలకులకు ఇంకా జ్ఞానం రాలేదు. ఒళ్లంతా విషం నింపుకొని రోడ్ల మీద కారుకూతలు కూస్తున్న ఆనాటి 'ప్రభువుల'కు రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో నాలుగోసారి వాత తప్పదని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం అశ్వారావుపేటలోని శ్రీశ్రీ ఫంక్షన్ హాల్లో ఎమ్మెల్యే జారె ఆదినారాయణ అధ్యక్షతన జరిగిన కాంగ్రెస్ మద్దతుదారులైన 60 మంది సర్పంచుల సన్మాన సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... పదేళ్ల పాలనలో పేదవాడికి ఇల్లు కట్టించాలనే జ్ఞానం కూడా లేని అప్పటి పాలకులు, ఇప్పుడు అధికారం పోయిందన్న అక్కసుతో సోల్లు వాగుడు వాగుతున్నారని మండిపడ్డారు. పదేళ్లలో నియోజకవర్గానికి కనీసం 10 ఇళ్లు కూడా ఇవ్వని వారు ఇప్పుడు తమ ప్రజా ప్రభుత్వంపై విమర్శలు చేయడం సిగ్గుచేటు అని ఎద్దేవా చేశారు. ఇప్పటికే మూడుసార్లు చెంప చెళ్లుమనిపించిన ప్రజలు, మున్సిపల్ ఎన్నికల్లోనూ అదే తీర్పును పునరావృతం చేస్తారని ధీమా వ్యక్తం చేశారు. అశ్వారావుపేట గిరిజన ప్రాంతంపై ప్రత్యేక శ్రద్ధతో తమ ప్రభుత్వం ఇక్కడకు 4,500 ఇందిరమ్మ ఇళ్లను కేటాయించిందని, ఇది గిరిజన ప్రాంత అభివృద్ధికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందనడానికి నిదర్శనమని పేర్కొన్నారు. అలాగే మేడారం జాతరను 200 ఏళ్ల వరకు చెక్కుచెదరని రీతిలో అద్భుతమైన రాతి కట్టడాలతో పునరుద్ధరిస్తున్నట్లు వెల్లడించారు. ఇదే క్రమంలో కొత్తగా ఎన్నికైన సర్పంచులకు ఆయన దిశానిర్దేశం చేశారు. ప్రజలను ఎక్కడా ఇబ్బంది పెట్టకుండా, గ్రామాల్లో నిస్వార్థంగా సేవ చేస్తూ కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయాలని సర్పంచులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి, ఇరిగేషన్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మువ్వా విజయబాబు, డీసీసీ అధ్యక్షురాలు



తోట దేవి ప్రసన్న తదితరులు పాల్గొని ప్రసంగించారు.

## బీఆర్ఎస్ నేతలపై మంత్రి పొంగులేటి ధ్వజం

తెలంగాణ ఉద్యమంలో అగ్గిపెట్టె పట్టుకుని యువతను రెచ్చగొట్టిన వారు చావలేదు కానీ..అమాయకపు వేలాది పిల్లల్ని పొట్టనపెట్టుకున్నరు. ప్రశాంతంగా ఉన్న తెలంగాణను స్వార్థం కోసం మళ్లీ జిల్లాల పేరుమీద ఉద్యమాలు చేస్తాం..అగ్నిగుండాలు చేస్తాం..సామాన్య ప్రజలను బలిచేస్తాం అంటే..ఊరుకునే ప్రసక్తే లేదు.. ప్రజలు తెలివైన వారు.. అన్నీ గమనిస్తున్నారు మీరు ప్రజల్ని రెచ్చగొట్టి అగ్నిగుండం తయారుచేసి చలికాసుకుంట్ అంటే..ప్రజలు మిమ్మల్నే అగ్నిగుండంలోకి నెట్టెస్తారు. శాస్త్రీయంగా లేని జిల్లాలు, రెవెన్యూ డివిజన్లు, మండలాల విభజనను తప్పకుండా సరిచేస్తాం. శాసనసభలో చర్చించి, రిటైర్డ్ జడ్జీ ద్వారా కమీటి వేసి ప్రజల అభిప్రాయాలను తెలుసుకుని, కేబినెట్ లో చర్చించి ప్రజలకు అనుకూలమైన విధంగా సరైన పునర్వవస్థీకరణ చేస్తాం. సత్తుపల్లి : పదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని అధోగతి పాలు చేసిన బీఆర్ఎస్ నేతలు, గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పినా తీరు మార్చుకోకుండా పిచ్చి కుక్కల్లా మాట్లాడుతున్నారు. మంగళవారం సత్తుపల్లిలోని రాణి సెలబ్రేషన్స్ కన్వెన్షన్ హాల్లో ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ అధ్యక్షతన జరిగిన 81 మంది సర్పంచుల ఆత్మీయ సమ్మేళనం, సన్మాన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మొన్నటి పంచాయతీ ఎన్నికల ఫలితాలు చూశాక బీఆర్ఎస్ నాయకులకు మైండ్ బ్లాక్ అయ్యింది. ఓటమిని జీర్ణించుకోలేక నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారు. రోడ్డు మీద పిచ్చి కుక్క కరిస్తే ఎలా పిచ్చెక్కినట్లు వాగుతారో.. అదే పద్ధతిలో గత పదేళ్లు పాలించిన వారు బ్లఫ్ చేస్తున్నారు. 10 మంది సర్పంచులను గెలిపించుకుని, కార్యకర్తలందరినీ నిలబెట్టి మేమే గెలిచామని చెప్పుకోవడం హాస్యాస్పదమని ఎద్దేవా చేశారు.

**- మున్సిపల్ ఎన్నికల్లోనూ అదే గతి!**

గతంలో ఎన్నికల ఫలితాలను సెమీఫైనల్స్‌గా అభివర్ణించిన మాజీ మంత్రులపై పొంగులేటి నిప్పులు చెరిగారు. గ్రామ పంచాయతీ ఎన్నికల్లో 69 శాతం సీట్లు గెలిచి కాంగ్రెస్ తన జైత్రయాత్రను చాటింది. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో ఇది 80 శాతానికి మించినా ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదు. ఈ కార్యక్రమంలో ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి, రాష్ట్ర నాయకులు డాక్టర్ మట్టా దయానంద్, మండల పార్టీ అధ్యక్షులు, వివిధ హోదాల్లో ఉన్న కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# ఇరాన్‌తో వ్యాపార దేశాలపై ట్రంప్ అక్కసు

ఆమెరికా జోక్యం, ట్రంప్ హెచ్చరికలపై ఇరాన్ సుప్రీం లీడర్ ఆయుతొల్లా ఖమేనీ తాజాగా స్పందించారు. ఆమెరికాకు వార్నింగ్ ఇస్తూ సోషల్ మీడియాలో ఓ పోస్ట్ చేశారు. శత్రువుల ముందు తలొగ్గేది లేదని గతంలో పలుసార్లు చాటి చెప్పాం. ఇప్పటికైనా అమెరికా మోసపూరిత చర్యలకు దూరంగా ఉండాలి. మా దేశానికి ద్రోహం చేస్తున్న కిరాయి మూకలపై ఆధారపడడం మానెయ్యాలి. ఇరాన్ చాలా బలమైన, శక్తివంతమైన దేశం. శత్రువు గురించి మాకు తెలుసు. వారిని ఎలా ఎదుర్కోవాలో మాకు తెలుసు. వారిని ఎదుర్కోవడానికి మేం ఎల్లప్పుడూ సిద్ధంగానే ఉంటాం' అని ఖమేనీ పోస్ట్ చేశారు. ప్రజలు చేస్తున్న నిరసనలు హింసాత్మకంగా మారడంతో ఇరాన్‌పై సైనిక చర్యను చేపట్టడం గురించి అమెరికా ఆలోచిస్తోంది. ఇరాన్‌పై వైమానిక దాడులు చేయడం ఒక ఆప్షన్‌గా ఉందని ట్రంప్ యంత్రాంగం ఇటీవల ప్రకటించింది. అలాగే ఇరాన్‌తో వాణిజ్యం చేసే దేశాలపై 25 శాతం సుంకాలు విధిస్తున్నట్టు తాజాగా ట్రంప్ ప్రకటించారు. ఇరాన్‌తో వాణిజ్యం చేసే దేశాల్లో చైనా, తుర్కియే, యూఏఈ, భారత్ ముందు వరుసలో ఉన్నాయి.




## ఉగ్రవాదానికి తెగిస్తే గట్టిగా బుద్ధి చెబుతాం

ఉగ్ర శిబిరాలను నేలమట్టం చేయగలిగాం. దాదాపు 100 మంది ఉగ్రవాదులను హతమార్చాం. ఆ సమయంలో పెద్దఎత్తున బలగాలను సరిహద్దులకు తరలించాం. పాకిస్థాన్ చిన్న తప్పు చేసినా.. భూతల దాడులను ప్రారంభించేందుకు కూడా నాడు మేం పూర్తి సన్నద్ధంగా ఉన్నాం అని ఆర్మీ చీఫ్ నాటి పరిస్థితులను వివరించారు. అలాగే ఈశాన్య సరిహద్దులో పరిస్థితులు స్థిరంగానే ఉన్నాయని, అయితే అప్రమత్తంగా ఉండటం కీలకమని వెల్లడిరచారు. చైనా సరిహద్దులోని భద్రత గురించి మాట్లాడుతూ.. భారత మోహరింపులు బలంగా ఉన్నాయని చెప్పారు. భవిష్యత్‌లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు ఎదురైనా వాటిని సమర్థవంతంగా ఎదుర్కొంటామని పాకిస్థాన్‌కు పరోక్షంగా గట్టి హెచ్చరికలు చేశారు. జమ్మూకశ్మీర్‌లో పరిస్థితులు సున్నితంగానే ఉన్నా.. ప్రస్తుతం అవి నియంత్రణలోనే ఉన్నాయన్నారు. ఇక వివాదాస్పద షక్సాగామ్ వ్యాలీలోని ప్రాంతం తమ దేశంలో భాగమేనని చైనా చేసిన వాదనను భారత్ మరోసారి తిప్పికొట్టింది. ఆ వ్యాలీ అప్పగింతకు సంబంధించి 1963లో పాకిస్థాన్, చైనా మధ్య జరిగిన ఒప్పందం చట్టవిరుద్ధమని జనరల్ ఉపేంద్ర ద్వివేది వెల్లడిరచారు. ఈ వివాదం పై స్పందించారు. 'షక్సాగామ్ వ్యాలీని చైనాకు అప్పగిస్తూ బీజింగ్‌తో పాకిస్థాన్ చేసుకున్న ఒప్పందం చెల్లదు. ఆ ప్రాంతంలో జరిగే ఏ కార్యకలాపాలను మేం గుర్తించబోం. చైనా`పాక్ ఆర్థిక కారిడార్ విషయానికొస్తే.. అది ఆ రెండు దేశాలు సంయుక్తంగా చేస్తోన్న చట్టవిరుద్ధమైన చర్యగానే మేం పరిగణిస్తాం' అని జనరల్ ఉపేంద్ర ద్వివేది స్పష్టం చేశారు. షక్సాగామ్ వ్యాలీ ప్రాంతంలో చైనా చేపట్టిన అభివృద్ధి పనులపై ఈ నెల 9న భారత్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. 'పాకిస్థాన్`చైనా పేర్కొంటున్న 1963 నాటి సరిహద్దు ఒప్పందాన్ని మేం ఎప్పటికీ గుర్తించబోం. దీనిపై మా నిర్ణయంపై మారదు. షక్సాగామ్ వ్యాలీ మా దేశంలో భాగమే అని స్పష్టం చేసింది. షక్సాగామ్ వ్యాలీ కీలకమైన కారకోరమ్ రహదారిలో ఉంది. స్వాతంత్య్రం రాగానే పాకిస్థాన్ దీన్ని ఆక్రమించుకుంది. అనంతరం దీనికి చైనాకు ధారాదత్తం చేసింది. భారత్‌కు చెందిన ప్రాంతాన్ని ఆక్రమించుకుని మరొక దేశానికి ఇవ్వడం అంతర్జాతీయ చట్టాల ప్రకారం విరుద్ధం. ఈ వ్యాలీని బీజింగ్‌కు అప్పగించడం ద్వారా పాకిస్థాన్‌తో చైనాకు రహదారి సౌకర్యం ఏర్పడిరది. దీని మీదుగానే చైనా`పాకిస్థాన్ ఆర్థిక నడవాను బీజింగ్ నిర్మిస్తోంది.

# బెంగళూరులో దారుణ ఘటన

**బెంగళూరు, నినాదం:**

బెంగళూరులో దారుణ ఘటన వెలుగు చూసింది. పక్కింట్లో ఉన్న ఓ అమ్మాయిపై బలాత్కారానికి పాల్పడ్డ ఇంటర్ విద్యార్థి, ఆమె తిరస్కరించడంతో కత్తితో పొడిచి చంపాడు. అంతేగాకుండా ఇంటిని తగులబెట్టాడు. అంతా అగ్నిప్రమాదమని భావించినా, పోలీసుల దర్యాప్తులో అసలు నిజం బయటపడిరది. చిరుప్రాయంలోనే ఆ యువకుడి ఆలోచనలు అదుపు తప్పాయి. పక్కింటి యువతి ఒంటరిగా ఉన్నవేళ కామంతో అఘాయిత్యానికి తెగించాడు. ఆమె ప్రతిఘటించడంతో చివరకు హత్య చేసి, ఆధారాలు చెరిపేసేందుకు ఇంటికే మంటపెట్టాడు. ఆమె అగ్ని ప్రమాదంలో మరణించినట్లుగా తొలుత భావించినప్పటికీ.. పోస్టుమార్టం నివేదిక, సాంకేతిక ఆధారాలతో యువకుడి పాత్ర బయటపడిరది.బెంగళూరులో జరిగిన ఈ దారుణంపై పోలీసుల కథనం.. కర్ణాటకలోని మంగళూరుకు చెందిన షర్మిల కుశాలప్ప (34) బెంగళూరులోని ఓ సాఫ్ట్‌వేర్ సంస్థలో ఇంజినీర్‌గా పని చేసేవారు. రామ్మూర్తినగర ఠాణా పరిధి సుబ్రహ్మణ్య లేఅవుట్‌లోని ఓ ఫ్లాట్‌లో తన స్నేహితుడితో కలిసి ఉండేవారు. ఈనెల 3న షర్మిల ఒంటరిగా ఉన్నవేళ ఫ్లాట్‌లో ఆకస్మికంగా మంటలు చెలరేగగా, ఆమె మరణించినట్లు ఫిర్యాదు అందింది. పోలీసులూ ఆ కోణంలోనే దర్యాప్తు చేపట్టారు. అయితే, ఇది సాధారణ మరణం కాదని ఫోరెన్సిక్ నివేదికలో తేలింది. ఆమె శరీరానికి నిప్పు అంటుకోకముందే చేతిపై గాయాలయ్యాయని, ఆపై ఊపిరాడక చనిపోయినట్లు వైద్యులు తేల్చారు. దీంతో పోలీసులు అక్కడి సీసీ కెమెరాల ఫుటేజ్‌లు సేకరించారు. ఇద్దరు అనుమానితులను అదుపులోకి తీసుకొని విచారించారు. షర్మిల, ఆమె మిత్రుడు ఉండే లాట్ పక్కనే కొడగు జిల్లా విరాజ్‌పేటెకు చెందిన ఇంటర్ సెకండియర్ విద్యార్థి కర్నల్ కురై (18) తల్లితో కలిసి ఉంటున్నాడు. ఈ నెల 3న షర్మిల స్నేహితుడు ఇంట్లో లేని సమయంలో కురై ఆమె ఉండే గదిలోకి కిటికీలోంచి దూరాడు. లైంగిక కోర్కె తీర్చాలని ఒత్తిడి తేవడంతో షర్మిల గట్టిగా అరుస్తూ తోసివేశారు. కోపం పట్టలేని ఆ యువకుడు.. వంటగదిలోని కత్తితో ఆమెపై దాడి చేశాడు. ఆమె పరుపుపై పడిపోగా, మరోసారి కొట్టాడు. అరవొద్దంటూ నోటిని దిండుతో గట్టిగా మూయడంతో షర్మిల ఊపిరాడక చనిపోయారు.ఆపై సాక్ష్యాలను నాశనం చేసేందుకు రక్తపు మరకలున్న ఆమె దుస్తుల్ని తీసి, అదే గదిలో నిప్పంటించి కాల్చేశాడు. మంటలు వ్యాపించడంతో అక్కడి నుంచి పారిపోయేందుకు మళ్లీ కిటికీలోంచి దూకేశాడు. ప్రమాదవశాత్తు మంటలు వ్యాపించి ఆమె మరణించిందని, సహజ మరణంగా చూపేందుకు ఇలా చేసినట్లు నిందితుడు పోలీసుల విచారణలో అంగీకరించాడు. షర్మిల సెల్‌ఫోన్‌లోని వివరాలు ఈ కేసు దర్యాప్తునకు ఉపకరించాయి. మృతురాలి స్నేహితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# కవితను కాంగ్రెస్ పార్టీలో చేర్చుకునే అవకాశం లేదు

తెలంగాణాలో బీఆర్ఎస్ పార్టీకి గతం తప్పు.. భవిష్యత్తు లేదంటూ వ్యాఖ్యానించారు. కేసీఆర్ కుటుంబ అవినీతి గురించి కవిత నిజాలు చెప్తున్నారన్నారు. తాము చేసిన ఆరోపణలపై కవిత సమాధానం రూపంలో రుజువైందని చెప్పారు. కవిత మాటలతో కేసీఆర్ అవినీతి నిజమని ప్రజలు అర్థం చేసుకుంటున్నారని ఆయన చెప్పారు. సీఎం రేవంత్ రెడ్డికి తెలంగాణా ప్రయోజనాలే ముఖ్యమని.. ఒక్క నీటిబొట్టును కూడా వదలమని తేల్చిచెప్పారు. అజారుద్దీన్, కోదండరామ్ ఎమ్మెల్సీల విషయంలో మంచి స్పందన వస్తోందని నమ్ముతున్నట్లు తెలిపారు. ఏప్రిల్‌లో కార్పొరేషన్ ఛైర్మన్లను భర్తీ చేస్తామని ప్రకటించారు. పదవులు తక్కువ అయ్యాయని... ఆశావహులు ఎక్కువ అయ్యారని తెలిపారు. మున్సిపల్ ఎన్నికల కోసం పార్టీ తరపున ఒక కమిటీ వేస్తామని.. సర్వేల ఆధారంగా టికెట్లు ఇస్తామని చెప్పారు. గెలిచే అభ్యర్థులకే టికెట్ ఇస్తామని మహేశ్ కుమార్ పేర్కొన్నారు. మంత్రులకు పూర్తి స్వేచ్ఛ ఇస్తున్నారని వెల్లడిరచారు. డీ సెంట్రలైజేషన్ కోసమే మేడారంలో క్యాబినెట్ సమావేశం ఏర్పాటు చేస్తున్నారని పీసీసీ చీఫ్ తెలిపారు. కేసీఆర్.. కుమారుడికి ఒక జిల్లా, కూతురికి ఒక జిల్లా, అల్లుడికి ఒక జిల్లా ఇచ్చారని పీసీసీ చీఫ్ ఆరోపణలు గుప్పించారు. కేసీఆర్ అశాస్త్రీయంగా జిల్లాలను విభజించారని మండిపడ్డారు. శాస్త్రీయంగా జిల్లాల పునర్విభజన చేయాలని కమిటీ వేస్తున్నామని తెలిపారు. సికింద్రాబాద్‌ను ఎవరు ముట్టుకున్నారని తలసాని శ్రీనివాస్ యాదవ్ గాబరా పడుతున్నారని ప్రశ్నించారు. వ్యక్తిగత జీవితాలతో ఆడుకునే హక్కు ఎవరికీ లేదన్నారు. మహిళా అధికారులపై ఆధారాలు లేకుండా వార్తలు రాస్తే ఎంత ఇబ్బంది పడతారో అర్థం చేసుకోవాలన్నారు. సోషల్ మీడియాను కట్టడి చేయాలన్నారు. పదేళ్లలో వచ్చిన ఉద్యోగాలు ఎన్ని.. రెండేళ్లలో ఇచ్చిన ఉద్యోగాలు ఎన్నో నిరుద్యోగులు అర్థం చేసుకోవాలని మహేశ్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు.

# గాంధీపేరుతో కాంగ్రెస్ నీచ రాజకీయం

**పథకాలతో సహా అన్నిటికి ఇంది, రాజీవ్ పేర్లేనా**
**వాల్మీకి`అంబేడ్కర్ పేరున్న పథకం పేరు ఎందుకు మార్చారు**
**కాంగ్రెస్ రాజకీయాలపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి**
**కరీంనగర్ మున్సిపాలిటీలో బిజెపి జెండా ఎగరేస్తాం**
**కేంద్రమంత్రి బండి సంజయ్ వ్యాఖ్యలు**

కరీంనగర్ : ఉపాధి హామీ పథకం పేరు మార్చడంపై కాంగ్రెస్ చేస్తున్న రాజకీయాన్ని నీచ రాజకీయంగా కేంద్రమంత్రి బండి సంజయ్ అభివర్ణించారు. వాల్మీకీ`అంబేద్కర్ ఆవాస్ యోజన (వాంబే) పేరుతో వాజ్‌పేయి తీసుకొచ్చిన ఇండ్ల పథకాన్ని కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఎందుకు తీసేశారని ప్రశ్నించారు. వాల్మీకీ, అంబేద్కర్ పేర్లు తొలగించి ఇందిరా ఆవాస్ యోజనగా ఎందుకు మార్చారని, ఇది ఆ మహానుభావులను అవమానించడం కాదా అని విమర్శించారు. అలాగే గతంలో ఎన్టీఆర్ టెర్మినల్‌గా ఉన్న హైదరాబాద్ విమానాశ్రయ టెర్మినల్ పేరును తీసేసి రాజీవ్ గాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టుగా ఎందుకు మార్చారని బండి సంజయ్ ప్రశ్నించారు. కాంగ్రెస్ నేతలపై తీవ్ర విమర్శలు గుప్పించిన ఆయన.. గాంధీ పేరును వాడుకున్నారే తప్ప మహాత్మా గాంధీ కలలు కన్న గ్రామ స్వరాజ్యాన్ని కాంగ్రెస్ నేతలు పాతరేసి ఆయన ఆత్మను క్షోభకు గురిచేశారని ఆరోపించారు. వారసత్వ రాజకీయాలను గాంధీ వ్యతిరేకించారని గుర్తుచేశారు. అలాగే ఆయన పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ వ్యాఖ్యలపై స్పందించారు. రాముడి బాటలో నడుస్తామని, రాముడి ఆలయాలను నిర్మిస్తామని తాము చెప్పినప్పుడు కాంగ్రెస్‌కు నొప్పి ఎందుకు వస్తోందని ప్రశ్నించారు. దేశంలో అనేక పథకాలు కేంద్ర,రాష్ట్ర భాగస్వామ్యంతోనే నడుస్తున్నాయని, ఈ పథకానికి రాష్ట్ర భాగస్వామ్యం కల్పిస్తే తప్పేముందని నిలదీశారు. ఉపాధి కూలీల వేతనాలను కూడా సకాలంలో ఇవ్వలేని కాంగ్రెస్ నేతలు మాట్లాడటం విడ్డూరమని విమర్శించారు. కరీంనగర్ ప్రజలకు కేంద్ర ప్రభుత్వం శుభవార్త అందించిందని కేంద్రమంత్రి బండి సంజయ్ అన్నారు. కరీంనగర్‌లో జరిగిన కార్యక్రమానికి హాజరైన ఆయన మాట్లాడుతూ.. అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ ఫండ్ కింద కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్‌కు మొత్తం రూ.50 కోట్లు విడుదల చేసినట్లు ఆయన వెల్లడించారు.

# కుంభమేళాకు మించి సమ్మక్క సారలమ్మ జాతర

**మొదటిపేజీ తరువాయి**

రూ. 150 కోట్ల నిధులను మంజూరు చేసి విస్తృత ఏర్పాట్లు చేస్తున్నందున ఈసారి దాదాపు మూడు కోట్ల మంది భక్తులు హాజరవుతారని అంచనా వేస్తున్నామని వివరించారు. ఈ మహాజాతరను విజయవంతంగా నిర్వహించడం ప్రతి అధికారికి ఒక బాధ్యతగా తీసుకుని, ఏ చిన్న లోపం కూడా లేకుండా పకడ్బందీగా ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆయన సూచించారు. దేశంలో ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఈ జాతరకు రూ.150 కోట్లకుపైగా నిధులు కేటాయించి అత్యంత ప్రాధాన్యతనిస్తోందని తెలిపారు. ఈ నిధులతో మౌలిక వసతులు, భద్రత, రవాణా, పారిశుద్ధ్యం, వైద్య సేవలు వంటి అన్ని విభాగాల్లో సమగ్ర ఏర్పాట్లు చేయనున్నట్లు చెప్పారు. ఏ ఒక్క భక్తుడికి కూడా ఇబ్బంది కలగకూడదన్నదే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేసిన మంత్రి, జాతరకు వచ్చే భక్తులు సులభంగా గమ్యానికి చేరుకునేలా అన్ని ప్రధాన రహదారులు, అంతర్గత మార్గాల్లో స్పష్టమైన దిశా సూచిక బోర్డులు, బ్యానర్లు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. భక్తులు ఎలాంటి అయోమయానికి గురికాకుండా ట్రాఫిక్ నియంత్రణ పటిష్టంగా ఉండాలని, ప్రత్యేక రూట్ మ్యాప్‌లతో పాటు అవసరమైన చోట వన్‌వే వ్యవస్థ అమలు చేయాలని సూచించారు. ఈ జాతరపై క్యాబినెట్ మొత్తం ప్రత్యేక దృష్టి సారించిందని, మంత్రులందరూ సమన్వయంతో పనిచేస్తూ ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తున్నారని మంత్రి అడ్లూరి తెలిపారు. ఇలాంటి స్థాయి సమిష్టి పర్యవేక్షణ గతంలో ఎప్పుడూ జరగలేదని ఆయన పేర్కొన్నారు. తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, కర్ణాటక, ఛత్తీస్‌గఢ్ సహా పలు రాష్ట్రాల నుంచి లక్షలాదిగా భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున, అందుకు అనుగుణంగా వసతి, పార్కింగ్, రవాణా సౌకర్యాలను విస్తృతంగా ఏర్పాటు చేయాలని తెలిపారు. పార్కింగ్ విషయంలో వీఐపీలు,సామాన్య భక్తులు అనే తేడా లేకుండా, అందరికీ సమాన సౌకర్యాలు కల్పించాలని స్పష్టం చేశారు. రాష్ట్ర పంచాయితీ రాజ్, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ (సీతక్క) మాట్లాడుతూ, ఈసారి జాతర ఏర్పాట్లకు రూ. 150 కోట్లతో పాటు గద్దెల పునరుద్ధరణ పనులకు రూ. 101 కోట్లు మొత్తం 251 కోట్లను రాష్ట్ర ముఖ్యమంత్రి మంజూరు చేశారని వివరించారు. జాతరకు వచ్చే ప్రతీ భక్తులకు సాఫీగా దర్శనం లభించేలా ప్రాధాన్యత నిస్తున్నట్టు అన్నారు. ఇందుకు గాను ప్రతీ శాఖ అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. రాష్ట్ర స్థాయిలో వివిధ శాఖ కార్యదర్సులు, హెచ్.ఓ.డీ లతో ప్రత్యేకంగా వాట్స్`అప్ గ్రూప్ ను ఏర్పాటు చేసి జాతర నిర్వహణపై ప్రత్యేకంగా పర్యవేక్షించాలని సీతక్క సూచించారు. శానిటేషన్, తాగునీరు, రవాణా, భద్రతాలపై ప్రత్యేకంగా ద్రుష్టి సారించాలని, ప్రధానంగా టాయిలెట్ లను మరింత పెంచాలని కోరారు. జాతర సందర్భంగా గురు, శుక్ర వారాల్లోనే ప్రతి రోజు కనీసం 40 లక్షల మంది భక్తులు ఉంటారని, ఇందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేపట్టాలన్నారు. మేడారం జాతరకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి




2010 నుండి ప్రతీ సంవత్సరం వస్తున్నారని, వచ్చే వందేళ్లకు సరిపడా అభివృద్ధి కార్యక్రమాలకు మొట్టమొదటిసారిగా పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేశారని సీతక్క గుర్తు చేశారు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామ కృష్ణ రావు మాట్లాడుతూ, జాతర నిర్వహణ ఏర్పాట్లపై రాష్ట్ర ముఖ్యమంత్రి నిరంతరం పర్యవేక్షిస్తున్నందున అన్ని శాఖల ఉన్నతాధికారులు జాతర పనులకు సకాలంలో పూర్తయ్యేలా ప్రత్యేక దృష్టి సాధించాలని పేర్కొన్నారు. జాతర సందర్భంగా భక్తులకు చేసిన ఏర్పాట్లు, రవాణా, ఇతర సౌకర్యాలు, భక్తులు పాటించాల్సిన సూచనలపై విస్తృత స్థాయిలో సమాచారాన్ని అందించాలని తెలిపారు. మేడారానికి వచ్చే ప్రధాన రహదారుల్లో ట్రాఫిక్ నియంత్రణకు గాను డ్రోన్ లను ఉపయోగించుకోవాలన్నారు. అదేవిధంగా, జాతర సమాచారాన్ని, నియమ నిబంధనలను తెలియచేసే ప్రత్యేక యాప్ ను/ క్యూ.ఆర్ కోడ్ రూపొందించి విస్తృతంగా ప్రచారం చేయాలని అన్నారు. పార్కింగ్ ఏరియాలలో కూడా ప్రత్యేకంగా వాటర్, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. శానిటేషన్, పరిశుభ్రతపై ప్రత్యేక ద్రుష్టి సాధించాలన్నారు. ప్రస్తుతం మేడారంలో జరుగుతున్న జాతర ఏర్పాట్లు, పురోగతి తదితర విషయాలను తెలియచేసే నివేదికను ప్రతీ రోజూ తమకు సమర్పించాలని సంబంధిత శాఖల కార్యదర్శులను కోరారు. ఈ సందర్భంగా, మేడారం జాతరకు వివిధ శాఖలు చేస్తున్న ఏర్పాట్లు, చేపట్టిన పనులు, వాటి పురోగతి పై ములుగు జిల్లా కలెక్టర్ దివాకర పవర్ పాయింట్ ప్రసెంటేషన్ ద్వారా వివరించారు. ఈసారి జాతరకు దాదాపు మూడు కోట్ల మంది హాజరవుతారని అంచనా వేసినట్లు తెలిపారు. తదితర ప్రారంభానికి ముందే దాదాపు 30 శాతం భక్తులు సందర్శిస్తారని అన్నారు. జాతర సమయంలో 60 శాతం నుండి 65 శాతం వరకు, జాతర అనంతరం 5 శాతం భక్తులు మేడారం సందర్శిస్తారని వివరించారు. మేడారం జాతరపై ములుగు జిల్లా యంత్రాంగం రూపొందించిన ప్రత్యేక లోగో, యాప్, వీడియోలను మంత్రులు సీతక్క, లక్షణ్ కుమార్, సి.ఎస్ రామకృష్ణరావులు ఆవిష్కారించారు.



# జిల్లా అభివృద్ధిలో టీజీవోల పాత్ర కీలకం

**టీజీవో జిల్లా క్యాలెండర్–2026, రాష్ట్ర డైరీ ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్**

**భద్రాద్రి కొత్తగూడెం, జనవరి 13 (నినాదం):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం (టీజీవో) ఆధ్వర్యంలో రూపొందించిన టీజీవో జిల్లా క్యాలెండర్–2026తో పాటు టీజీవో సెంట్రల్ అసోసియేషన్ రాష్ట్ర స్థాయి డైరీని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్, ఐఏఎస్ ఘనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లా అభివృద్ధిలో టీజీవోల పాత్ర అత్యంత గణనీయమైనదని పేర్కొన్నారు. అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ ప్రజలకు మరింత సమర్థవంతమైన సేవలు అందించాలని సూచించారు. అలాగే శాఖల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేయడానికి సిఎస్ఆర్ నిధులను సమకూర్చి జిల్లా అభివృద్ధికి మరింతగా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ డి. వేణుగోపాల్ పాల్గొన్నారు. అనంతరం టీజీవో జిల్లా అధ్యక్షులు సంగం వెంకటపుల్లయ్య మాట్లాడుతూ, జిల్లా కలెక్టర్గా బాధ్యతలు చేపట్టిన నాటి నుండి అహర్నిశలు కష్టపడుతూ జిల్లా అధికారులు, ఉద్యోగులను సమన్వయం చేసుకుంటూ జిల్లాను అభివృద్ధి పథంలో ముందుకు నడిపిస్తున్న జిల్లా కలెక్టర్ పనితీరును టీజీవోల పక్షాన హృదయపూర్వకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలోటీజీవో కార్యదర్శి వి. మహేష్, జిల్లా ఇంటర్ విద్యాశాఖాధికారి హెచ్. వెంకటేశ్వర్లు,కార్యవర్గ బాధ్యులు రాజి రెడ్డి, బండి వెంకటేశ్వర్లు, రవి కిరణ్, జి.వి.ఆర్. లక్ష్మణ్ రావు, డి. వెంకటేశ్వర్లు, కామేశ్వరరావు, చంద్రమోహన్ మూర్తి, దినేష్, పాలిటెక్నిక్ శ్రీకాంత్, శ్రీనివాస్,జూనియర్ కాలేజ్ ఖాసీం తదితరులు పాల్గొన్నారు.



# స్వీయ క్రమశిక్షణే రోడ్డు ప్రమాదాలకు అడ్డుకట్ట

**జిల్లా ఎస్పీ రోహిత్ రాజు**

**సుజాతనగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 'ఎరైవ్–ఎలైవ్ 2026' అవగాహన కార్యక్రమం ఘనంగా ప్రారంభం**

**జిల్లా వ్యాప్తంగా పది రోజుల పాటు రోడ్డు భద్రతా ఉద్యమం**





**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, జనవరి13(నినాదం)**

రాష్ట్రంలో రోడ్డు ప్రమాదాలను గణనీయంగా తగ్గించి, అమూల్యమైన ప్రజల ప్రాణాలను కాపాడాలనే లక్ష్యంతో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వినూత్న కార్యక్రమం "ఎరైవ్– ఎలైవ్–2026" అని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు పేర్కొన్నారు. మంగళవారం సుజాతనగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో కొత్తగూడెం సబ్ డివిజన్ పోలీసుల ఆధ్వర్యంలో ఎరైవ్– ఎలైవ్ కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా ఎస్పీ రోహిత్ రాజు మాట్లాడుతూ, రోడ్డు భద్రత అనేది కేవలం పోలీసుల బాధ్యత మాత్రమే కాదని, ప్రతి పౌరుడు స్వీయ క్రమశిక్షణతో ముందుకు వస్తేనే ప్రమాదాలకు అడ్డుకట్ట వేయవచ్చని స్పష్టం చేశారు. హెల్మెట్ వినియోగం, సీటు బెల్ట్ ప్రాధాన్యత, డిఫెన్సివ్ డ్రైవింగ్ నియమాలు తప్పనిసరిగా పాటించాలన్నారు. రోడ్డుపై పోలీసులు ఉన్నా లేకపోయినా వాహనాలు నడిపేటప్పుడు ట్రాఫిక్ నిబంధనలు కచ్చితంగా పాటించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని సూచించారు. డ్రంక్ అండ్ డ్రైవ్, ర్యాష్ డ్రైవింగ్, వాహనం నడుపుతూ సెల్‌ఫోన్ వినియోగం, రాంగ్ రూట్ డ్రైవింగ్, సిగ్నల్ జంపింగ్, ఓవర్ లోడింగ్ వంటి తప్పిదాల వల్ల జరుగుతున్న ప్రాణాంతక ప్రమాదాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఒక చిన్న నిర్లక్ష్యం కుటుంబాలనే శోకసంద్రంలో ముంచేస్తుందన్న విషయాన్ని గుర్తుంచుకోవాలని ప్రజలను కోరారు. ఈ సందర్భంగా సుజాతనగర్ పరిధిలో రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోయిన బాధిత కుటుంబ సభ్యులు తమ బాధాకర అనుభవాలను ప్రజలతో పంచుకున్నారు. ఆ క్షణాలు కార్యక్రమానికి హృదయ విదారకమైన భావోద్వేగాన్ని జోడించాయి. అనంతరం అధికారులు, ప్రజా ప్రతినిధులు, ప్రజలంతా కలిసి రోడ్డు భద్రతా నియమాలు తప్పనిసరిగా పాటిస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం డీఎస్పీ రెహమాన్, ట్రైనీ ఆర్డీఓ మురళి, జిల్లా రవాణాధికారి భూషితా రెడ్డి, ఆర్టీసీ డీఎం రాజ్యలక్ష్మి , ఎంఆర్ఓ కృష్ణ, మోటారు వాహనాల అధికారులు వెంకట రమణ, వెంకట పుల్లయ్య, వైద్యారోగ్య శాఖ అధికారులు, సీఐలు ప్రతాప్, శ్రీలక్ష్మి , వెంకటేశ్వర్లు, సుజాతనగర్ ఎస్సై రమాదేవి, ఎస్సైలు రమణారెడ్డి, ప్రవీణ్, రవి తదితరులు పాల్గొన్నారు.





# సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపిన జిల్లా రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షుడు

**అశ్వాపురం, జనవరి 13: (నినాదం)**

సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షుడు కొడాలి వెంకటేశ్వర రావు గారు జిల్లా ప్రజలకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సంక్రాంతి పండగ రైతుల కష్టానికి ఫలితం అందించే పండగగా, గ్రామీణ జీవనంలో ఆనందం, ఐక్యతను నింపే మహనీయమైన పండగగా పేర్కొన్నారు. ఈ పండగ ప్రతి కుటుంబంలో సుఖసంతోషాలు, ఆరోగ్యం, ఐశ్వర్యం కలిగించాలని, రైతులకు మంచి పంటలు, ప్రజలకు శాంతి, సౌభ్రాతృత్వం చేకూరాలని ఆకాంక్షించారు. అలాగే పేద, మధ్యతరగతి ప్రజలకు ప్రభుత్వం అందిస్తున్న రేషన్ సరుకులు సకాలంలో, నాణ్యతతో అందేలా రేషన్ డీలర్లు అంకిత భావంతో సేవలందిస్తున్నారని తెలిపారు. రేషన్ డీలర్లు ప్రజలకు అత్యంత సమీపంగా ఉండే సేవా ప్రతినిధులని, ప్రజా పంపిణీ వ్యవస్థను మరింత బలోపేతం చేయడమే సంఘం లక్ష్యమని చెప్పారు. ప్రజలందరూ సంక్రాంతి పండగను కుటుంబ సభ్యులతో ఆనందంగా, శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని ఆయన కోరారు.



# కలెక్టర్‌ను కలిసిన ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ

**నిజామాబాద్ ప్రతినిధి, జనవరి 13 (నినాదం)**

నిజామాబాద్ జిల్లా కలెక్టర్గా బాధ్యతలు స్వీకరించిన ఇలా త్రిపాఠిని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా అర్బన్ నియోజకవర్గానికి సంబంధించిన పలు అభివృద్ధి కార్యక్రమాలపై కలెక్టర్‌తో చర్చించారు. పట్టణ మౌలిక సదుపాయాల అభివృద్ధి, ప్రజా సంక్షేమ పథకాల అమలు, మౌలిక వసతుల కల్పన తదితర అంశాలపై సమగ్రంగా చర్చించినట్లు తెలిపారు.జిల్లా అభివృద్ధి కోసం జిల్లా యంత్రాంగం, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ దిశగా తన పూర్తి సహకారం అందిస్తానని ఆయన తెలిపారు.



# ఉద్యోగుల సమస్యలపై టీఎన్జీవో ఆధ్వర్యంలో కలెక్టర్‌కు వినతి

**నిజామాబాద్ ప్రతినిధి, జనవరి 13 (నినాదం) :** ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఎంప్లాయిస్ జేఏసీ జిల్లా చైర్మన్, టిఎన్జీవో జిల్లా అధ్యక్షులు నాశెట్టి సుమన్ కుమార్, టిఎన్జీవో జిల్లా కార్యదర్శి నేతికుంట శేఖర్ ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టర్ ఇలా త్రిపాఠిని ఐడీవోసీ కార్యాలయంలో మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. జిల్లా కలెక్టర్ సానుకూలంగా స్పందించిన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు టీఎన్జీవోస్ పక్షాన హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సమావేశంలో టీఎన్జీవో రాష్ట్ర కార్యదర్శి పోల శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షులు జాఫర్ హుస్సేన్, జిల్లా కార్యవర్గ సభ్యులు స్వామి, టిఎన్జీవో ముఖ్య సలహాదారులు వనమాల సుధాకర్ పాల్గొన్నారు.

# ఇందూర్ బల్దియా ఓటర్ లిస్టులో అన్ని తప్పులే

**కమిషనర్ దృష్టికి తీసుకెళ్లిన ఎమ్మెల్యే ధన్ పాల్ .. పరిశీలిస్తామన్న కమిషనర్**



**నిజామాబాద్ ప్రతినిధి, జనవరి 13 (నినాదం)**

నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ లో డివిజన్ ల వారీగా ఓటర్ల తుది జాబితాలో తప్పులతడకగా నమోదయ్యాయి. ఇందూరు మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి ఓటర్ లిస్ట్ అవకతవకలు గురించి ఎన్నిసార్లు కంప్లైంట్ ఇచ్చిన తప్పులు తడకగానే ఫైనల్ లిస్ట్ ఇవ్వడంతో ఆశావాహులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కార్పొరేటర్లుగా పోటీ చేయాలనుకునే కార్యకర్తల భవిష్యత్తు ప్రశ్నార్థకమైందని కార్యకర్తల పక్షాన మున్సిపాల్ కమిషనర్ దిలీప్ కుమార్ ని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ ప్రశ్నించారు. ఇటీవల అభ్యంతరాల పరిశీలనకు స్వీకరించిన ఎలాంటి మార్పు లేదని ఆందోళన వ్యక్తం చేశారు. సంబంధిత డివిజన్ ల కు సంబంధం లేని ఓటర్లను ఎలా చేర్చుతారని ప్రశ్నించారు. కనీసం కాలనీ పేరు కూడా లేకుండా కేవలం నిజామాబాద్ పేరుతోనే వందల ఓట్లను ఇతర డివిజన్ లలో చేపించారని తెలిపారు. స్థానికంగా అభ్యంతరాలను మళ్లీ పరిశీలించి కొత్త జాబితాను చేయాలని కోరారు. ఈ విషయంపై ఎన్నికల సంఘానికి నివేదించి తదుపరి చర్యలు తీసుకుంటామని కమిషనర్ దిలీప్ కుమార్ హామీ ఇచ్చారు.



# సనాతన సంప్రదాయాలకు రంగుల ఊపిరి

**60వ డివిజన్‌లో బీజేపీ ఆధ్వర్యంలో సంక్రాంతి ముగ్గుల పోటీలు**

**కార్పొరేషన్ పరిధిలో పండుగ శోభకు మహిళలే ప్రతీక**

**బిజెపి కొత్తగూడెం పట్టణ మాజీ అధ్యక్షులు గొడుగు శ్రీధర్ యాదవ్**

**కొత్తగూడెం, జనవరి13(నినాదం)**

కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ 60వ డివిజన్‌లో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో సంక్రాంతి పండుగను పురస్కరించుకొని నిర్వహించిన ముగ్గుల పోటీలు పండుగ వాతావరణాన్ని సంతరించుకున్నాయి. మహిళల ఉత్సాహం, చిన్నారుల చురుకుదనం ఈ కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.ఈ కార్యక్రమాన్ని జిల్లా మహిళా మోర్చా నాయకురాలు గూడ విజయ, పట్టణ ప్రధాన కార్యదర్శి కృష్ణారెడ్డి, గుంపుల మహేష్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా కొత్తగూడెం పట్టణ మాజీ అధ్యక్షుడు గొడుగు శ్రీధర్ యాదవ్ పాల్గొని విజేతలకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా శ్రీధర్ యాదవ్ మాట్లాడుతూ, "సంక్రాంతి అనగానే పిండి వంటలు, ముగ్గుల పోటీలు, ముఖ్యంగా సనాతన ధర్మాన్ని ప్రతిబింబించే రంగవల్లులే గుర్తుకు వస్తాయి. వేల సంవత్సరాలుగా మన సంస్కృతిని నిలబెట్టే శక్తి ఈ సంప్రదాయాల్లోనే ఉంది" అని అన్నారు. నేటి రోజుల్లో ముగ్గులు వేయడం తగ్గిపోతున్న నేపథ్యంలో, ఈ కార్యక్రమంలో ఎక్కువ సంఖ్యలో చిన్నారులు పాల్గొనడం ఎంతో ఆనందదాయకమని, వారిని ప్రోత్సహిస్తున్న మాతృమూర్తులకు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. ముగ్గులు ప్రతి ఒక్కరి జీవితంలో ఇంద్రధనస్సు లాంటి రంగులను నింపుతాయని పేర్కొన్నారు. ఎంతో కష్టపడి ముగ్గులు వేసిన ప్రతి ఒక్క సోదరీమణికి భారతీయ జనతా పార్టీ తరపున ప్రత్యేక ధన్యవాదాలు, అభినందనలు తెలిపారు. "ఇక్కడికి వచ్చిన ప్రతి ఒక్కరూ గెలిచిన వారే" అంటూ అందరికీ సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బస్తీ పెద్దలు, పార్టీ నాయకులు, మహిళలు, చిన్నారులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# ట్రాఫిక్ నిబంధనలు పాటిద్దాం.. ప్రాణాలను కాపాడుకుందాం

**జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో పోలీస్ కమిషనర్ సాయి చైతన్య**





**నిజామాబాద్ ప్రతినిధి, జనవరి 13 (నినాదం)**

నిబంధనలు పాటించి ప్రాణాలను కాపాడుకుందామని పోలీస్ కమిషనర్ సాయి చైతన్య పిలుపునిచ్చారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని రాజీవ్ గాంధీ ఆడిటోరియంలో జరిగిన జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల్లో ఆయన రోడ్డు ప్రమాదాల నియంత్రణపై ప్రసంగించారు. 2020 – 21 సంవత్సరంలో కోవిడ్ వల్ల మరణించిన వారి కంటే ఎక్కువ మంది రోడ్డు ప్రమాదంలో మృత్యువాత పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. కోవిడ్ లో మాస్కులు ధరించి సురక్షితంగా ఉన్నారని కానీ వాహనాలు నడిపే సమయంలో సీటు బెల్టు , హెల్మెట్లు పెట్టుకోక నిర్లక్ష్యంగా వ్యవహరించి అనేకమంది ప్రాణాలు పోగొట్టుకుంటున్నారన్నారు. రెండేళ్ల కరోనా సమయంలో 200 మంది కరోనాతో చనిపోతే , 2025 వ సంవత్సరంలో 250 మంది రోడ్డు ప్రమాదంలో చనిపోయారన్నారు. కుటుంబ భద్రతకు భరోసాను కల్పిస్తూ సురక్షితమైన డ్రైవింగ్ చేయాలని సూచించారు. గత సంవత్సరం ఫిన్లాండ్ అనే దేశంలో ఒక్క రోడ్డు ప్రమాదం కూడా జరగలేదని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. ప్రమాదాల నియంత్రణకు రాష్ట్ర పోలీస్ డైరెక్టర్ జనరల్ అరైవ్ అలైవ్ అనే ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రారంభించారని దీన్ని ఒక తపస్సు లాగా ముందుకు తీసుకెళ్లాలని అయన సూచించారు. డ్రైవింగ్ లో మూడు సూత్రాలను తప్పకుండా పాటించాలని పోలీస్ కమీషనర్ విజ్ఞప్తి చేశారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను పాటిస్తూ, ముఖ్యంగా యువత అతివేగంతో వెళ్లకుండా నెమ్మదిగా వెళ్లాలని, మొబైల్ ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయరాదని, హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలన్నారు తెలియజేసారు. ఈ సందర్భంగా అంతర్జాతీయ బాక్సింగ్ క్రీడాకారుడు, అర్జున అవార్డు గ్రహీత హుసాముద్దిన్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదంలో కుటుంబంలో ఒకరిని కోల్పోయామని, విష్ణు సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి వైద్యులు, న్యూరో సర్జన్ డాక్టర్ రమనేశ్వర్ మాట్లాడుతూ హెల్మెట్ ధరించి సెల్ ఫోన్ వాడకుండా క్షేమంగా వాహనాలు నడపుతూ సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలన్నారు. అనంతరం రోడ్డు భద్రత ప్రతిజ్ఞ చేయించి , టీ షర్ట్స్, ట్రాఫిక్ నిబంధనలతో కూడినటువంటి స్లోగానికి సంబంధించినటువంటి ప్లే కార్డ్స్ ప్రారంభించారు. విష్ణు సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్ సౌజన్యంతో వాహనదారులకు 100 హెల్మెట్లను ఉచితంగా పంపిణీ చేశారు.ఈ సందర్భంగా కార్యక్రమం లో అదనపు డీసీపీ (అడ్మిన్) బస్వారెడ్డి , జిల్లా ట్రాన్స్పోర్ట్ అధికారి ఉమామహేశ్వర్, ఆర్టీసీ డిపో మేనేజర్ బి. ఎస్ ఆనంద్, ఐఎంఏ ప్రెసిడెంట్ డాక్టర్ ఏ. విశాల్ , న్యూరో సర్జన్ డాక్టర్ రమనేశ్వర్, నిజామాబాద్ ఏసిపిజా రా జా వెంకటరెడ్డి , ట్రాఫిక్ ఏసిపి శ్రీ మస్తాన్ అలీ , డిగ్గి వర్కర్స్ , అంబులెన్స్ అసోసియేషన్ , ఆటో అసోసియేషన్స్ , క్యాబ్ డ్రైవర్స్ అసోసియేషన్స్, వ్యాపార సముదాయాల యాజమానులు తదితరులు పాల్గొన్నారు.



# బస్తీ దవాఖానాను పరిశీలించిన డిఎంహెచ్‌వో


**ఖమ్మం, జనవరి 13(నినాదం):**

జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా.డి.రామారావు ఖమ్మం నగరంలోని వై.ఎస్.ఆర్. నగర్ కాలనీ బస్తీ దవాఖానాను మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా బస్తీ దవాఖానాలో అమలవుతున్న అన్ని ఆరోగ్య కార్యక్రమాలను సమగ్రంగా సమీక్షించారు. మాతా శిశు సంరక్షణ కార్డులు తప్పనిసరిగా సంబంధిత ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా జారీ చేయాలని ఆదేశించారు. ఆయుష్మాన్ ఆరోగ్య మందిరం ఓ.పి. సేవలను నిరంతరం సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. సమగ్ర వ్యాధి పర్యవేక్షణ కార్యక్రమానికి సంబంధించిన వివరాలను సకాలంలో నమోదు చేయాలనీ తెలిపారు. హెచ్.ఐ.ఎం.ఎస్. (HMIS) డేటాను ఖచ్చితంగా, సమయానుకూలంగా నమోదు చేయాలని, అసంఖ్యాక వ్యాధుల పోర్టల్‌లో ఐ.డి.ఎస్.పి. (IDSP) పెండింగ్‌లో వున్న రిఫరల్స్‌ను మొదటి ప్రాధాన్యతతో త్వరితగతిన పరిష్కరించాలని, సిబ్బంది పరస్పర సమన్వయంతో పనిచేసి ప్రజలకు నాణ్యమైన ఆరోగ్య సేవలు అందించాలని తెలిపారు.

# 28 న కోదండరామ్ పర్యటన విజయవంతం చేయండి!

**పాలేరు జనవరి 13( నినాదం)**

ఈ నెల 28 న తెలంగాణ జన సమితి వ్యవస్థాపకులు,ఎమ్మెల్సీ కోదండరామ్ పర్యటన ను విజయవంతం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోపగాని శంకర్రావు పేర్కొన్నారు. నేలకొండపల్లి మండల కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు.తెలంగాణ ఉద్యమకారులకు ఎన్నికల ముందు కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. ఎన్నికల ముందు ఉద్యమకారుల పై చూపిన శ్రద్ధ ప్రస్తుతం చూపకపోవటం దారుణం అన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేయాలని క్షేత్ర స్థాయిలో ఉద్యమాలకు శ్రీకారం చుడుతున్నట్లు పేర్కొన్నారు. అందులో భాగంగానే ఈ నెల 28 న నేలకొండపల్లి లో టీజేఎస్ జిల్లా జనరల్ బాడీ సమావేశం ను నిర్వహించినట్లు తెలిపారు. ఈ సమావేశం కు కోదండరామ్ తో పాటు, రాష్ట్ర నాయకులు హజరవుతున్నట్లు తెలిపారు.నూతన కమిటీలు ఏర్పాటు చేయటం తో పాటు, భవిష్యత్ కార్యాచరణ ను ప్రకటిస్తారని తెలిపారు. కావునా కార్యకర్తలు, ఉద్యమకారులు సకాలంలో హజరు కావాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా నాయకులు మాదాసు శ్రీనివాసరావు, రాజేందర్నాయక్, తీగ రాములు, వెంకటేశ్వరరావు, బెల్లంకొండ నాగేశ్వరరావు, వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.





# రోడ్డు భద్రతపై ప్రజలకు అవగాహన

**నిజామాబాద్ ప్రతినిధి, జనవరి 13 (నినాదం)**

నిజామాబాద్ నగరంలోని మూడవ టౌన్ పరిధిలో గల చంద్రశేఖర్ కాలనీ చౌరస్తాలో రోడ్డు భద్రత పై స్థానిక ఎస్సై హరిబాబు అవగాహన కల్పించారు. మంగళవారం రోడ్డు వెంట ఉన్న ప్రజలకు స్థానికులకు రోడ్డు ప్రమాదాలు దానికి తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. రోడ్డు భద్రత మాస ఉత్సవాలను పురస్కరించుకుని ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ దారుణ గురించి అవగాహన కల్పించారు. వాహనాలు నడిపేటప్పుడు కచ్చితంగా ట్రాఫిక్ రూల్స్ ఫాలో అవ్వాలని కోరారు. తనిఖీల సమయంలో పోలీసులు అధికారులు అడిగిన పత్రాలను కచ్చితంగా చూపాలని ఈ సందర్భంగా ఎస్సై స్థానిక ప్రజలను కోరారు.

# పురాతన వస్తువులను పరిశీలించిన ఏడీ..!

**పాలేరు జనవరి 13( నినాదం)**

స్థానిక బౌద్ధక్షేత్రం వద్ద జరుగుతున్న పనులలో భాగంగా లభించిన అతి పురాతన వస్తువులను పురావస్తు శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డి.బుజ్జి మంగళవారం పరిశీలించారు.ఇటీవల బయటపడ్డ వస్తువులను పరిశీలించారు.వీటి యెక్క విశిష్టత గురించి సంబంధిత అధికారులకు వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు.బౌద్ధక్షేత్రం వద్ద జరుగుతున్న పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేసేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.ఇక్కడ బయటపడ్డ వస్తువులను భద్రపరుస్తున్నట్లు పేర్కొన్నారు.



# సంస్కృతి కాంతి సంక్రాంతి





సంస్కృతి కాంతి సంక్రాంతి
అందాల లోగిళ్ళు
ఆనందాల పరవళ్ళు
ఆటల హరివిల్లు
రంగుల ముంగిళ్ళు
గంగిరెద్దుల గంటల చప్పుళ్ళు
ఆత్మల ఆకాశంలో ఎగిరే గాలిపటాలు
బంతిపూల తోరణాలు
కొత్త అల్లుళ్ళ సందళ్ళు
హరిదాసు కీర్తనలు
ఎడ్లబండి పోటీలు
గంగిరెద్దుల ఆటలు
మడులను వీడి ఇళ్లను చేరే పంటలు
చెట్లకు కొత్తదనంతో చిగురించే ఆకులు
రంగవల్లిక నడుమ కొలువుదీరే గొబ్బెమ్మలు
భోగి మంటలు
సంతోషాల సందడైన
సిరుల పండుగ సంక్రాంతి
కలల కాంతి సంక్రాంతి
సంస్కృతి కాంతి సంక్రాంతి
సంస్కృతి సంతకం సంక్రాంతి
జీవన క్రాంతి సంక్రాంతి


కళలో కాంతి, కల్లాల్లో క్రాంతి సంక్రాంతి.
పట్టణాలు పల్లెకు పయనమయ్యాయి
అనురాగాలు ఎదురొచ్చి ఆహ్వానం పలికాయి
పచ్చదనాన్ని శ్వాసించాలని,
బాంధవ్యాలను ఆస్వాదించాలని,
ప్రకృతిని సేవించాలని,
కర్పూరంలా తెలియకుండా కరిగిపోయిన
బాల్యాన్ని ప్రేమగా తడుముకోవాలని,
నేలతల్లి కన్న పేగుకు
కనకాభిషేకం చేయాలని
పరితపించే పండుగ సంక్రాంతి
సంక్రాంతి అంటే పాలమారిన జ్ఞాపకం
అలలెగిసిన మానస సరోవరం
ప్రకృతి పరంగా పల్లెకు
సంక్రమించిన కానుక సంక్రాంతి

డా. పి విజయకుమార్
అసోసియేట్ ప్రొఫెసర్
తెలుగు శాఖ
హైదరాబాద్ విశ్వవిద్యాలయం.



# నేడే మకర సంక్రమణం

## పుణ్యకాలం మధ్యాహ్నం 3:13 నుండి 5:45 వరకు





**ధర్మపురి ప్రతినిధి, జనవరి 12 ( నినాదం)**
తెలుగు వారు ఆచరించే పండుగలలో సంక్రాంతి పండుగ చాలా ప్రత్యేకమైనది. "సంక్రాంతి" లేదా "సంక్రమణం" అంటే చేరుట అని అర్థం. జయసింహ కల్పద్రుమం అనే గ్రంథంలో "సంక్రాంతి" పండుగ ను నిర్వచిస్తూ "తత్ర మేషాదిషు ద్వాదశ రాశి క్రమణేషు సంచరతః సూర్యస్య పూర్వస్మాద్రాశే ఉత్తరః రాశౌ సంక్రమణ ప్రవేశః సంక్రాంతిః" అని చెప్పారు – మేషం నుండి మొదలైన 12 రాశులలో సంచరించే సూర్యుడు ముందున్న రాశి నుండి తరువాతి రాశి లోనికి ప్రవేశించడమే సంక్రాంతి సూర్యుని గమనంలో నాలుగు ఘట్టాలు ముఖ్యమైనవి అవి మేష, తుల, కటక, మకర సంక్రమణాలు. వీటిలో మకర సంక్రమణాన్ని "సంక్రాంతి పండుగ"గా వ్యవహరిస్తారు. మార్గశిరం పూర్తి కాగానే ఉత్తరాయణం మొదలవుతుంది. దానాదులు. ఉత్తరాయణ పుణ్యకాలమైన సంక్రాంతి రోజున చేయు ఏ దానమైన శ్రేష్టమైనదని పురాణాల్లో శాస్త్ర గ్రంథాలలో చెప్పబడింది. ఈరోజు ధాన్యం, ఫలాలు, విసనకర్ర, వస్త్రం, కాయగూరలు, దుంపలు, నువ్వులు, చెరకు మొదలయినవి దానం చేస్తారు. ఇవి కాక పుణ్య కాలమందు చేయు గోదానం వలన స్వర్గ వాసం కలుగునని ప్రజలు విశ్వసిస్తారు. ఈ సంక్రాంతి పండుగలో గొబ్బెమ్మలు ఎంతో ప్రాముఖ్యత కలిగి ఉన్నాయి. స్త్రీలు ముగ్గులు పెడుతుంటే ఇంటి ఆడపిల్లలు ఆవు పేడతో చేసి పెట్టే గొబ్బెమ్మలు పెడతారు. కృష్ణుని భక్తురాళ్ళైన గోపికలకు ఇవి సంకేతం. ఈ ముద్దల తలమీద కనుపించే రంగుల పూలరేకులు, పసుపు కుంకుమలు ఆ గోపికలందరూ భర్తలు జీవించి యున్న పుణ్య స్త్రీలకు సంకేతం. ఆ గోపికా స్త్రీల రూపాలకు సంకేతమే గొబ్బెమ్మలు. మధ్య ఉండే పెద్ద గొబ్బెమ్మ గోదాదేవికి సంకేతం గా అమ్మవారి స్వరూపం గా భావించి పూజిస్తారు. సంక్రాంతి రోజులలో వీటి చుట్టూ తిరుగుతూ పాటలు పడుతూ నృత్యం చేసే బాలికలంతా కృష్ణ భక్తి తమకూ కలగాలని ప్రార్థిస్తుంటారు. దీనిని సందే గొబ్బెమ్మ అంటారు. గొబ్బెమ్మలు పొద్దున పూట ముగ్గులో ఉంచి, దానిపై గుమ్మడి పూలుతో అలంకారం చేస్తే చాలా అందంగా ఉంటుంది. ఈ పండుగ సమయంలో పితృదేవతలకు తిల తర్పణం చేయడం సంప్రదాయం. సంవత్సరంలో మిగిలిన రోజులలో నల్ల నువ్వులు వాడరు. కాని సంక్రాంతి పర్వదినాన మాత్రం నల్లనువ్వులతో మరణించిన పితృదేవతలందరికీ తర్పణములివ్వడం ఆచారం . దీన్నే పెద్దలకు పెట్టుకోవడం అంటుంటారు. సంక్రాంతి పర్వదినాలలో వారి వారి ఆచార సంప్రదాయాలను అనుసరించి ఈ కార్యక్రమము చేస్తుంటారు. ఈ రోజు బూడిద గుమ్మడికాయ దానము చేయడం మట్టితో ఒక బొమ్మను తయారు చేసి పెడతారు . సంక్రాంతి పురుషుడు తన వాహనాన్ని అధిరోహించి ప్రతి సంవత్సరం వేరు వేరు వాహనాల పై వస్తాడు. ఏ వాహనాన్ని ఎక్కితే ఆ వాహనానికి ఆ సంవత్సరం ఎక్కువ నష్టము అని ఒక నమ్మకం . మేళ తాళాలను చేసి, సంక్రాంతి మూడు రోజుల్లో పూజలు చేస్తారు. నాల్గవ నాడు ఈ బొమ్మలను నిమజ్జనం చేస్తారు. ధర్మపురికి చెందిన ప్రముఖ జ్యోతిశ పండితులు బ్రహ్మశ్రీ కెరిడె చంద్రశేఖర శర్మ శాస్త్రసమ్మతమైన సంక్రాంతి పండుగ గురించి నినాదం పాఠకులకు తెలియజేశారు.మకర సంక్రమణ నిర్ణయం పండుగ విశిష్టత వారి మాటల్లోనే తెలుసుకుందాం. మకర సంక్రమణ అంటే సూర్యుడు ధనుస్సు రాశి నుంచి మకర రాశిలో ప్రవేశించే క్షణమే మకర సంక్రమణం అని పిలవబడుతుంది. ఇది సూర్య గోచారాధారితము తిథి, వారం ఆధారంగా కాదు. మకర సంక్రమణ నిర్ణయం శాస్త్ర రీత్యా సూర్యుడు మకర రాశి (0° మకరం) లో ప్రవేశించిన ఖచ్చిత క్షణమే సంక్రమణ కాలం. అదే క్షణాన్ని ఆధారంగా చేసుకొని నిర్ణయిస్తారు. ఇందులో పుణ్యకాలం మహాపుణ్యకాలం అని రెండు ఉంటాయి. సిద్ధాంత జ్యోతిష గ్రంథాల ఆధారంగా సూర్య సంక్రమణ నిర్వచనం రాశ్యంతరం యదా భానోఃసాసంక్రాంతిరుదాహృతా సూర్యుడు ఒక రాశి నుండి మరొక రాశిలో ప్రవేశించినప్పుడు అది సంక్రాంతి అని పిలవబడుతుంది.

మకర సంక్రమణ ప్రత్యేకత ఏమిటంటే
శ్లో॥ ధనుర్ముక్త్వా మకరం ప్రాప్తే
సూర్యే దేవదినోదయే।
మకరాఖ్యా మహాపుణ్యా
సర్వపాపప్రణాశిని॥

సూర్యుడు ధనుస్సును విడిచి మకరంలో ప్రవేశించిన దినం మకర సంక్రాంతి .అది మహాపుణ్యదాయకము, పాపనాశకము.సంక్రమణ పుణ్యకాల నిర్ణయం శాస్త్ర ప్రకారం
శ్లో।సంక్రమణ సమయాత్ పూర్వం
పుణ్యకాలః ప్రకీర్తితః ।
ఉత్తరాయణమార్గస్థే
సూర్యే లోకహితప్రదే ॥

సంక్రమణ క్షణానికి ముందు ప్రారంభమయ్యే కాలమే పుణ్యకాలం.
సూర్యుడు ఉత్తరాయణంలో ప్రవేశించుట వల్ల లోకహితప్రదము.
తేది 14నా? 15నా? సంక్రమణ అంటే ధర్మ శాస్త్రం ప్రకారం
సూర్యుడు మకరంలో ప్రవేశించిన క్షణం ఏ దినంలో ఉంటే,
ఆ దినమే మకర సంక్రాంతి.
ఉదయానికి ముందు జరిగితే – అదే రోజు
ఉదయానంతరం జరిగితే – తదుపరి రోజు
అని పౌరోహిత నిర్ణయ విధానం.
ఇందువల్లే ప్రతి సంవత్సరం
14 లేదా 15 తేదీలలో వ్యత్యాసం కనిపిస్తుంది.
మకర సంక్రమణం సూర్య గోచారం ఆధారం
తిథి కాదు – రాశి ప్రవేశమే ప్రమాణం
సిద్ధాంత జ్యోతిష శ్లోకాలే ప్రామాణికం
పంచాంగం ద్వారా ఖచ్చిత క్షణం నిర్ణయం అంటే 14 జనవరి 2026 బుధవారం భారతదేశం లో మకర సంక్రాంతి జరుపుకోవాలి. సంక్రాంతి సూర్యుడి మకరలో ప్రవేశ ఖచ్చిత సమయము: 3:13 PM (IST) మకర రాశిలో ప్రవేశించే ఖండిత క్షణం. పుణ్యకాలం 3:13 PM నుండి 5:45 PM ఈ సమయంలో స్నానము, దానం, పూజ మొదలైనవి చేస్తే పుణ్యం ఎక్కువగా లభిస్తుంది. మహా–పుణ్యకాలం మధ్యాహ్నం 3:13 నుండి 4:58 వరకు అత్యంత శ్రేష్టం.

# మార్కెట్

## మళ్లీ నష్టపోయిన స్టాక్ మార్కెట్లు.. 260 పాయింట్లు కోల్పోయిన సెన్సెక్స్

భారతీయ స్టాక్ మార్కెట్లు మంగళవారం నష్టాల్ని చవిచూశాయి. సెన్సెక్స్ 260 పాయింట్లుపైగా నష్టపోగా.. నిఫ్టీ 50 పాయింట్లుపైగా నష్టపోయింది. మార్కెట్లు ఉదయం ఆశాజనకంగానే ప్రారంభమయ్యాయి. అంతర్జాతీయ సానుకూల అంశాలు, టెక్నికల్ కొనుగోళ్లు వంటివి కలిసొచ్చి.. ఉదయం మార్కెట్ బాగుంది. సెన్సెక్స్, నిఫ్టీ పాయింట్లు పెరిగాయి. ఒక దశలో సెన్సెక్స్ 200 పాయింట్ల వరకు పెరిగినట్లు కనిపించింది. కానీ, తర్వాత మార్కెట్ నెమ్మదిగా తగ్గుతూ వచ్చింది. వివిధ స్టాక్స్ ఒత్తిళ్లు, మార్కెట్ మిశ్రమ సంకేతాలు, టారిఫ్లు వంటివి ప్రభావం చూపాయి. దీంతో మార్కెట్ల పతనం ప్రారంభమైంది. ఒక దశలో సెన్సెక్స్ 600 పాయింట్ల వరకు నష్టపోయింది. నిఫ్టీ కూడా ఇంట్రాడే కనిష్టానికి చేరుకుంది. మొదట సెన్సెక్స్ 379.86 పాయింట్లు పైకి ఎగిసింది. 84,258.03 పాయింట్లకు చేరుకుంది. నిఫ్టీ కూడా 109.55 పాయింట్లు ఎగబాకింది. 25,899.80కి చేరుకుంది. తర్వాత మళ్లీ మార్కెట్లు నష్టపోయాయి. మొత్తంగా సెన్సెక్స్ 260 పాయింట్ల వరకు నష్టపోయి, 83,600 వద్ద ముగిసింది. నిఫ్టీ 50 పాయింట్లు నష్టపోయి 25,700 వద్ద ముగిసింది. లార్సెన్ అండ్ టర్బో, హెచ్ సీఎల్ టెక్నాలజీస్, రిలయన్స్ ఇండస్ట్రీస్, భారతి ఎయిర్ టెల్, టాటా కన్సల్టెన్సీ వంటి సంస్థలు నష్టపోయాయి. డాలరుతో రూపాయి విలువ తగ్గి, 90.21గా కొనసాగింది. బంగారం ఔన్స్ ధర 4,528.93 డాలర్ల వద్ద, అంతర్జాతీయ క్రూడాయిల్ బ్యారెల్ ధర 64.91 డాలర్ల వద్ద కొనసాగింది.

# సంప్రదాయం ఆరోగ్యం...
# ఔషధమయం సంక్రాంతి

**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో (నినాదం):**
భారతీయ సంస్కృతితో పాటు శాస్త్రీయ పరంగా సంక్రాంతి పండగ ఆరోగ్యానికి ఎంతగానో ఉపయోగపడుతుంది. అందుకే సంక్రాంతి ఔషధమని, ఆరోగ్య సంక్రాంతి అని కూడా పిలుస్తుంటారు. శరీర సంరక్షణకు ఉపయోగపడే అంశాలు ఎన్నో ఈ పండుగతో ముడిపడి ఉన్నాయి. మూడు రోజులు జరుపుకునే ప్రతి కార్యక్రమంలోనూ ఒక్కో విశేషం దాగి ఉంది. సూర్యుడు మకర రాశిలోకి ప్రవేశించే రోజే మకర సంక్రాంతి. సూర్యుడు దక్షిణాయనం పూర్తి చేసుకుని ఉత్తరాయణంలో అడుగుపెడతాడు. ఇది శాస్త్రీయ అంశం. దీంతోపాటు భోగి మంటలు, గొబ్బెమ్మలు, వాటి చుట్టూ పోసే నవధాన్యాలు, రేగు పండ్లు, మనం తయారు చేసుకుని తినే వంటకాలు, అందులో వినియోగించే పదార్థాలు అన్నీ మన ఆరోగ్యానికి ఔషధం లాగా పని చేస్తాయంటే ఆశ్చర్య పోక తప్పదు. చలికాలంలో ఇలాంటి ఆహారం తీసుకోవడం వల్ల ఎంతో మేలు జరుగుతుందని ఆయుర్వేద నిపుణులు చెబుతున్నారు.

**పిండి వంటలు ప్రత్యేకం..!**
సంక్రాంతి పండుగకు వారం రోజుల ముందు నుంచే పిండి వంటల తయారీలో మహిళలు బిజీగా ఉంటారు. చలి కాలంలో సుమారు నెల రోజుల వరకు నిల్వ ఉండగలిగే ఈ తినుబండారాలు ఇళ్లకు వచ్చే అతిథులకు ఆత్మీయులకు అల్పాహారంగా పని చేస్తాయి. ఇందులో ఉన్న పోషక పదార్థాలు ఆరోగ్యపరంగా ఎంతో మేలు చేస్తాయి. జనవరి నెలలో చలిని దూరం చేసుకోవడం తో పాటు సకినాలు తయారీలో ఉపయోగించే ఓమా శరీరంలో ఉష్ణోగ్రతను పెంచుతుంది. శీతాకాలంలో వాతం సమస్యలు కూడా ఓమ దివ్యౌషధంగా పనిచేస్తుంది. సంక్రాంతి పండుగను మన రాష్ట్రంలో సకినాల పండుగ అని కూడా పిలుస్తారు. సకినాలతోపాటు గారెలు, అరిసెలు, మురుకులు, కారప్పూస తదితర పిండి వంటకాలు చేస్తారు. ఈ పండుగకు ఆర్థిక లేమితో బాధపడే కుటుంబాలు సైతం కొన్ని సకినాలు చేసుకోవడం ఆనవాయితీగా వస్తున్న సంప్రదాయం.

**రేగుపండ్లు..!**
భోగి పండుగకు వినియోగించే రేగుపండ్ల కు రక్తం శుద్ధి చేసే గుణం ఉంటుంది. వీటిలో యాంటీ ఆక్సిడెంట్లు, ఫ్లవనాయిడ్స్ పుష్కలంగా ఉంటాయి. శరీరంలోని మలినాలను బయటకు పంపేందుకు ఉపయోగపడతాయి. మలబద్ధకాన్ని నివారించి జీర్ణవ్యవస్థ సరిచేస్తాయి. వీటిని తినడం వల్ల నోటి పూత, చిగుళ్ళు వాపు తగ్గుతాయి.

**నువ్వులు..!**



నువ్వులను సకినాల పిండిలో కలుపుకుని సకినాలు చేస్తారు. పండుగపూట నువ్వులు బెల్లం కలిపి తయారు చేసుకునే నువ్వుల ఉండలు శరీరానికి కాల్షియం, ఫోలిక్ యాసిడ్, ఐరన్ అందిస్తాయి. బాలింతలకు పాలు అధికంగా వస్తాయి. చిన్న పిల్లల్లో చురుకుదనం పెరుగుతుంది.

**పొంగలి..!**
దంపుడు బియ్యం, బెల్లం పాలతో చేసే పొంగలి కూడా ఎన్నో ఔషధ గుణాల కలయిక. ఇది పిల్లలకు, పెద్దలకు పుష్టికరమైన ఆహారం. ఇందులో ఉన్న ప్రోటీన్లు, విటమిన్లతో రోగనిరోధక శక్తి పెరుగుతుంది

**చెరుకు..!**
చెరుకు గడ్డల్లో కాల్షియం, రసంలో ఔషధ గుణాలు అధికంగా



ఉంటాయి. చెరుకు ముక్కలు తినడం మంచిది. దీంతో సత్వరమే శక్తి లభిస్తుంది. ఆకలి పెరుగుతుంది. విరేచనాలు అతిసారం తో బాధపడుతున్న వారికి ఔషధంగా పనిచేస్తుంది.

**మామిడాకులు..!**
ఇంటికి తోరణాలుగా కట్టుకునే మామిడాకులు, బంతిపూలు ఇంటి అందాన్ని పెంచడం తో పాటు ఎంతో మేలు చేస్తాయి. అవి క్రిమి సంహారిణిగా పనిచేస్తాయి. క్రిములతో పాటు బ్యాక్టీరియాను ఇంటి లోనికి రాకుండా నిరోధిస్తాయి.

**గొబ్బెమ్మలు..!**
ఆవు మూత్రం, పేడలో ఎన్నో ఔషధ గుణాలున్నాయి. గోమూత్రం శరీరంలోని టాక్సిన్లను తగ్గించే గుణం ఉంది. పేడతో చేసిన గొబ్బెమ్మలు అలుకు (పేడనీళ్లు) వాకిట్లో చలకలడం వల్ల సంహారిణిగా పనిచేస్తాయి.

**భోగి మంటలు..!**
భోగి మంటల్లో ఇంట్లోని పాత వస్తువులు తదితరాలతో పాటు ఉత్తరేణి చేయడం వల్ల వచ్చే వాసన పీల్చితే ఉబ్బసం లాంటి జబ్బులు తగ్గుతాయి.

**గుమ్మడికాయ..!**
సంక్రాంతికి వినియోగించే గుమ్మడికాయ ప్రోస్టేట్ గ్రంధి వాపు తో బాధపడేవారికి ఉపశమనం ఇస్తుంది. 100 గ్రాముల గుమ్మడికాయలో 62.5 శాతం తేమ, 4.4 శాతం కొవ్వు, 31 శాతం ప్రోటీన్లు ఉంటాయి. దీంతో కడుపులో నులి పురుగులు చనిపోతాయి. బలహీనత తగ్గుతుంది. పిల్లలు చురుకుగా ఉంటారు.

# ఆంధ్రా భీష్మాచార్యులు న్యాపతి సుబ్బారావు

చికాగో సర్వ ధర్మ సమ్మేళనంలో పాల్గొని, భారత దేశానికి తిరిగి వచ్చిన స్వామి వివేకానంద యోగి పుంగవుడు మద్రాసు రేవులో కాలిడగానే ఆయనను పూల మాలాలంకృతుల గావించి సాదరంగా ఆహ్వానించే అవకాశాన్ని పొందిన వ్యక్తి న్యాపతి సుబ్బా రావు. అంతేకాదు... వివేకానందుని ఆహ్వాన సభకు అధ్యక్షత వహిం చిన అరుదైన గౌరవం దక్కించు కున్న అదృష్ట వంతులు ఆయనే. భారతదేశములో ఒక విశిష్ట స్థానం కలిగి, దక్షిణ భారత దేశములో ఎక్కువ ప్రచురణ కలిగిన పత్రికగా, ప్రాచుర్యంలో ఉన్న ది హిందూ (The Hindu) ఆంగ్ల దినపత్రికకు పత్రికను స్థాపించి ఇప్పటికి సుమారు 120 సంవత్సరాలు దాటింది. ఈ పత్రిక ఎలా ప్రారంభించ బడింది అంటే...తిరువయ్యారుకు చెందిన 23 ఏళ్ళ జి. సుబ్రమణియ అయ్యర్, ఆయన స్నేహితుడు, పచ్చయ్యప్ప కళాశాలలో ఆయన సహోద్యోగి, చెంగల్పట్టుకు చెందిన 21 ఏళ్ళ ఎం. వీరరాఘవా చారియర్ – నలుగురు న్యాయ శాస్త్ర విద్యార్థులు టి.టి. రంగాచారియర్, పి.వి. రంగా చారియర్, డి.కేశవ రావు పంత్, న్యాపతి సుబ్బారావు పంతులు (హిందూ స్థాపకుల్లో ఆంధ్రుడు) – వీళ్ళందరూ ట్రిప్లికేన్ సాహితీ సంఘం సభ్యులు. ఈ సంఘం అప్పటి బ్రిటిష్ ప్రభుత్వ నిరంకుశ వైఖరుల గురించి ప్రజలకు అవగాహన కలిగించడం, బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రజలను కూడగట్టడం లక్ష్యాలుగా ఏర్పడింది. ట్రిప్లికేన్ సిక్స్ అని పేరుబడ్డ ఆ ఆరుగురు యువకులు మొదట న్యూస్‌పేపర్ అనే సైక్లోస్టైల్ పక్షపత్రికను ప్రారంభించారు. చెన్నైలో ఆ పత్రికకు మంచి స్పందన లభించడంతో హిందూను వారపత్రికగా ప్రచురించడం మొదలు పెట్టారు. ది హిందూ పత్రిక స్థాపన సెప్టెంబర్ 20, 1878న జరిగినట్లు పేర్కొంటారు. అలా ది హిందూ ఆంగ్ల పత్రిక స్థాపనలో ఒక తెలుగు వారు ఉండడం విశేషం. ఏ ఐ సీ సీ ప్రధాన కార్యదర్శిగా నాలుగు పర్యాయాలు పని చేశారు. ఆయన బహుముఖ ప్రజ్ఞాశాలి. ఆంధ్ర భీష్మ బిరుదాంకితులు, ప్రసిద్ధి స్వాతంత్ర్య సమర యోధుడు, సంస్కరణవాది, సాహిత్యవేత్త, పాత్రికేయుడు, న్యాపతి సుబ్బారావు పంతులు (1856, జనవరి 14 – 1941, జనవరి 15) మకర సంక్రాంతి రోజున నెల్లూరులో రాఘవరావు, రంగమ్మ దంపతులకు జన్మించారు. ఆ తరువాత కుటుంబం రాజ మండ్రికి మారింది. బాల్యం నుండే సుబ్బరావు విషయ పరిజ్ఞాన సముపార్జన పట్ల అమిత జిజ్ఞాస కలిగి ఉండి పేదరికం కారణంగా వీధిలాంతర్ల మసక వెలుతులో చదువు కొనసాగించారు. మెట్రిక్యు లేషన్ పాస్ అయ్యి అనంతరం మద్రాసు క్రైస్తవ కళాశాలలో చేరి స్కాలర్‌షిప్ సహాయంతో చదువుకుని 1876లో బిఏ డిగ్రీ పొందాడు. అనంతరం అధ్యాపకునిగా ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించాడు. బోధనా వృత్తిలో కొనసాగుతూనే న్యాయవాద విద్యను అభ్యసించి 1879లో లా పట్టాను పొందాడు. ఉపాధ్యా యునిగా పనిచేస్తూ న్యాయవాద పట్టాను పొందటం అప్పట్లో అరుదైన విషయం. ఈ ఖ్యాతిని సాధించిన దక్షిణ భారత దేశం లోని అతి కొద్దిమందిలో ఒకరిగా కోస్తా జిల్లాల్లో తొలి వ్యక్తిగా ఆయన చరిత్ర సృష్టించారు. న్యాయ విద్యార్థిగా ఉండగానే 22 ఏళ్ళ ప్రాయంలో ఆయన ట్రిప్లికేన్ సిక్స్‌గా పిలువబడే నాటి సాహిత్య సంఘం సభ్యులు మరో ఐదుగురు సభ్యుల మిత్ర బృందంతో కలసి, జాతీయో ద్యమానికి సహకరించే ఉదాత్త లక్ష్యంతో, ది హిందూ జాతీయ ఆంగ్ల దినపత్రికను స్థాపించారు. అప్పట్లో భారత దేశంలో ప్రచురిత మయ్యే ఆంగ్ల పత్రికలన్నీ బ్రిటీష్ ప్రభుత్వం కనుసన్నలలోనే ఉండేవి. ఉమ్మడి మద్రాసు రాష్టంలో సుబ్బా రావు గౌరవ న్యాయమూర్తిగా, పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా పని చేశారు. 1880లో న్యాపతి సుబ్బారావు మద్రాసు నుంచి రాజమండ్రి తిరిగివచ్చి అక్కడే స్థిరపడ్డారు. మరో 9 మంది న్యాయ వాదులతో కలిసి రాజమండ్రి బార్ అసోషి యేషన్ స్థాపించారు.

రాజమండ్రిలో సంఘసంస్కర్త కందుకూరి వీరేశలింగంతో సన్నిహితంగా మెలగేవారు. వితంతు పునర్వి వాహాలు జరిపించడంలో వీరేశలింగానికి సుబ్బారావు పంతులు ఎంతగానో సహకరించారు. 1881లో స్థాపితమైన హితకారిణి సమాజం యొక్క మొదటి కార్యదర్శిగా నియమించ బడి నిర్వహణలో, కార్యకలాపాల విస్తరణలో విలువైన సేవలందిం చారు. 1885లో రాజమండ్రి పురపాలక సంఘానికి తొలి అనధికార ఛైర్మన్‌గా ఎన్నికయ్యారు. 1888 వరకూ ఆయన ఆ పదవిలో కొనసాగారు. ఆయన హయాంలోనే రాజమండ్రి ప్రజలకు తొలిసారి నళ్ళాల కనెక్షన్లు మంజూరు చేశారు. 1893లో ఆయన మద్రాసు ఇంపీరియల్ లెజిస్లేటివ్ కౌన్సిల్‌కు సభ్యునిగా ఎన్నికై సర్కారు జిల్లాలకు ప్రాతినిధ్యం వహించారు. ఈ పదవిలో ఆయన వరుసగా మూడు పర్యాయాలు ఎన్నికై 1899 వరకు కొనసాగారు. 1896లో ఆయన రాజమండ్రి లోని టౌన్ హాల్ ట్రస్టుబోర్డు కమిటీ అధ్యక్షునిగా ఎన్నికయ్యారు. కలకత్తాలోని టౌన్ హాలు తర్వాత దేశంలో అంతటి ప్రాముఖ్యత రాజమండ్రి టౌన్ హాల్‌కు ఉంది. దీనిని కందుకూరి వీరేశలింగం పంతులు స్థాపించటం వెనుక న్యాపతి వారి సహకారం ఎంతో ఉంది. సుబ్బారావు పంతులు రాజమండ్రి ఎలక్ట్రిక్ సప్లై కార్పొరేషన్‌ను స్థాపించి, విద్యుదు త్పాదన చేయడమే కాక తొలి సారిగా రాజమండ్రికి ఆ విద్యుత్ ను సరఫరా చేసి వెలుగులు నింపాడు. 1893లో ఆయన రాజమండ్రిలో చింతామణి పత్రికను పునరుద్ధరించి ప్రజలకు ఆందుబాటు లోకి తెచ్చారు. ఈ పత్రికకు కందుకూరి వీరేశలింగం పంతులు ఎడిటర్‌గా వ్యవహ రించారు. రచయితల్ని ఆర్థికంగా ప్రోత్సహించటం లక్ష్యంగా సుబ్బా రావు పంతులు నవలారచన అంశంగా వివిధ పోటీలు నిర్వహించే వారు. చిలకమర్తి లక్ష్మీనరసింహం రచనా వ్యాసంగానికి సుబ్బారావు నైతికంగా, ఆర్థికంగా ఎంతో సహకరించారు. అదేవిధంగా హరికథా పితామహ ఆదిభట్ల నారాయణ దాసును రాజమండ్రి, పరిసర ప్రాంతాలకు పరిచయం చేసినది కూడా ఆయనే. 1922 ప్రాంతంలో రాజమండ్రిలో ఆంధ్ర చారిత్రక పరిశోధనా సంస్థ (ఇప్పుడు రాళ్ళబండి సుబ్బారావు పురావస్తు ప్రదర్శనశాలగా ఉన్నది) ఏర్పాటును న్యాపతి సుబ్బారావు పంతులు ఎంతగానో ప్రోత్సహించారు. 1897, ఫిబ్రవరి11న స్వామి వివేకానంద అంతర్జాతీయ మతాల సమావేశంలో ప్రసంగించి భారత దేశం తిరిగివస్తున్న సందర్భంలో ట్రిప్లికేన్ సిక్స్ మిత్రబృందం ఆయన్ను ఆహ్వానించ డానికి ఒక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. పెద్ద ఎత్తున పురజనులు హాజరైన ఆ సమావేశంలో వివేకానందుని ఆహ్వాన సంఘానికి న్యాపతి సుబ్బారావును అధ్యక్షునిగా నియమించారు.

వివేకానందుడు మద్రాసు రేవులో దిగగానే పూలమాల వేసి ఆహ్వానించిన తొలి వ్యక్తి సుబ్బారావే. ఆ మరు సటి రోజు విక్టోరియా హాల్లో వివేకానందునికి ఆహ్వాన సభ ఏర్పాటు చేశారు. ఫిబ్రవరి14న మెరీనా బీచ్‌లో ఏర్పాటుచేసిన బహిరంగ సభలో వివేకానందునితో పాటు సుబ్బారావు పంతులు వేదికను అలంకరించారు. అలా ప్రారంభమైన వీరి స్నేహం సుబ్బా రావుపై గాఢమైన ప్రభావాన్ని వేసింది. 1903లో వివేకానందుని స్ఫూర్తితో, సుబ్బారావు రాజమండ్రిలో భగవద్గీత, సనాతన హిందూధర్మ ప్రచారానికై, హిందూ సమాజం అనే సంస్థను స్థాపించారు.

1898 నుంచి 1917 వరకూ భారత జాతీయ కాంగ్రెస్‌లో ఆయన కీలకమైన భూమికను పోషించారు. 1907లో వందేమాతర ఉద్యమ సందర్భంగా బిపిన్ చంద్రపాల్‌ను రాజమండ్రి ఆహ్వానించి అక్కడ ఉపన్యాసాలు ఇప్పించారు. విజయ వాడలో 1914 ఏప్రిల్ 11వ తేదీన జరిగిన రెండవ ఆంధ్ర మహాసభకు ఆయన అధ్యక్షత వహిస్తూ, మద్రాసు నుంచి ఆంధ్ర రాష్ట్ర విభజన కోసం చారిత్రాత్మకమైన పిలుపు నిచ్చారు. 1918 జనవరి 1వ తేదీన సుబ్బారావు పంతులు డిమాండ్ మేరకు ఆంధ్రప్రాంతానికి ప్రత్యేక ప్రాంతీయ కాంగ్రెస్ కౌన్సిల్‌ను అధిష్టానం ఏర్పాటు చేసింది. ఈ మండలికి న్యాపతి సుబ్బారావు పంతులు అధ్యక్షుడ య్యారు. అంతేగాక ఆయన అఖిలభారత కాంగ్రేసు కమిటీ ప్రధాన కార్యదర్శిగా నాలుగు పర్యాయాలు ఎన్నికై సేవలందిం చారు. సుబ్బారావు పంతులు 1941, జనవరి 15వ తేదీన మరణించారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల... 9440595494**

# ప్రతిభా శాలియైన ఆర్థిక వేత్త సి.డి.దేశ్‌ముఖ్

సి.డి.దేశ్‌ముఖ్ (జనవరి 14, 1896 – అక్టోబరు 2, 1982) పూర్తి పేరు చింతమన్ ద్వారకానాథ్ దేశ్‌ముఖ్స్వ తంత్ర భారత దేశపు తొలి రిజర్వ్ గవర్నర్‌గా నియమితులైన తొలి భారతీయుడిగా సిడి దేశ్‌ముఖ్‌ను ఎప్పటికీ గుర్తుంచు కుంటారు. భారతీయ నాటి కరెన్సీపై సిడి దేశ్ ముఖ్ సంతకాన్ని చూడవచ్చు. భారతీయ రిజర్వ్ బాంక్ మూడవ గవర్నర్, 1943, ఆగష్టు 11 నుంచి 1949, జూన్ 30 వరకు ఈ పదవిని నిర్వహించారు. ఆ తర్వాత దేశ్‌మఖ్ భారత దేశానికి ఆర్థిక మంత్రిగా నియమితులైనారు. అంతర్జాతీయ ద్రవ్యనిధిలో సంవత్సరానికి 30వేల డాలర్ల వేతనం కాదని దేశసేవకే తన జీవితాన్ని ఆయన అంకితం చేసిన గొప్ప సామాజిక సేవకుడు. ప్లానింగ్ కమిటీ సభ్యుడుగా ఉంటూనే ఆర్థికమంత్రిగా ఉన్నా ప్రతిభాశాలి. బొంబాయి నగరాన్ని కేంద్రం అధీనంలో ఉంచడం ఇష్టపడక దేశ్‌ముఖ్ మంత్రి పదవికి రాజీనామా చేసిన నిబద్ధత కలిగిన రాజకీయ నాయకులు. భారత ఆర్థికమంత్రులలో సి.డి. దేశ్‌ముఖ్ అత్యంత ప్రతిభావంతుడు. ఆయన హయాంలో దేశంలో విదేశీ మారక కొరతలేదు. లోటు బడ్జెటు ప్రస్తావన రాలేదు. ద్రవ్యోల్బణం రేటు వెర్రితలలు వేయలేదు. అంతర్జాతీయ మార్కెట్‌లో మన రూపాయి విలువ తగ్గలేదు. ఇండియన్ సివిల్ సర్వీస్ సభ్యుడైన దేశ్‌ముఖ్ కు 1939 నుంచే రిజర్వ్ బ్యాంక్తో సంబంధం ఉంది. 1941లో రిజర్వ్ బ్యాంక్ డిప్యూటి గవర్నర్ గా నియమించ బడ్డారు. 1943లో. ఆ తర్వాత జేమ్స్ టేలర్ నుంచి 3 వ గవర్నర్ గా బాధ్యతలు తీసుకున్నారు. దేశ్‌ముఖ్ గవర్నర్ గా ఉన్న సమయంలో ప్రపంచంలో ముఖ్యమైన ఆర్థిక పరిణామాలు సంభవించాయి. 1943లో రిజర్వు బ్యాంకు గవర్నర్ టెయిలర్ మరణించగా, డిప్యూటీ గవర్నరుగా ఉన్న సి.డి. దేశ్‌ముఖ్‌ని ఏకగ్రీవంగా గవర్నరుగా ఎన్నుకున్నారు. రిజర్వు బ్యాంక్ గవర్నరుగా దేశ్‌ముఖ్ దేశానికి ఎంతో సేవ చేశారు. జూలై 1944లో జరిగిన బ్రెట్టన్ వుడ్స్ సమావేశంలో అతడు కూడా భారత దేశం తరపునన పాల్గొన్నారు. ఈ సమావేశమే అంతర్జాతీయ ద్రవ్య సంస్థ (IMF), ప్రపంచ బ్యాంకు (lIBRD) ఏర్పడడానికి కారణమైంది. ఈ రెండు సంస్థల లోనూ దేశ్‌ముఖ్ బోర్డ్ ఆఫ్ గవర్నర్ గా పదేళ్ళ పాటు పనిచేశారు. 1950లో పారిస్లో జరిగిన ఈ రెండు సంస్థల వార్షిక సంయుక్త సమావేశంలో ఇతడు చైర్మెన్ గా వ్యవహరించారు. 1945లో సిమ్లా సమావేశంలో వైస్రాయ్ సభ సభ్యులంతా భారతీయులే ఉండాలని తీర్మానించారు. ఆ జాబితాలో ఆర్థిక సభ్యుడుగా దేశ్‌ముఖ్ పేరు వేయాలని ప్రయత్నించారు. కానీ దేశ్‌ముఖ్ తనకు రాజకీయాలు పడవని తప్పించు కున్నారు. 1950లో ప్లానింగ్ కమిషన్ ఏర్పడింది. ఆ బాధ్యత దేశ్‌ముఖ్ మీద పడింది. అదే సంవత్సరం డా. జాన్ మత్తయ్ ఆర్థికమంత్రిగా రాజీనామా ఇచ్చినపుడు దేశ్‌ముఖ్ ఆ స్థానం పొందారు. ప్లానింగ్ కమిటీ సభ్యుడుగా ఉంటూనే ఆర్థికమంత్రిగా ఉన్నారు. 1953 జనవరి 22న దేశ్‌ముఖ్ వివాహం దుర్గాబాయి తో జరిగింది. అది దేశంలో గొప్ప సంచలనం సృష్టించింది. వారి పెళ్లిపత్రంపై నెహ్రూ, కృపలానీ దంపతులు సాక్షులుగా సంతకాలు చేశారు. దుర్గాబాయ్‌తో వివాహం జరిగిన తర్వాత మొదటి జన్మదినాన్ని ఆయన తన ఇంట్లో చాలా నిరాడంబరంగా జరుపు కున్నారు. ఈ సంగతి నెహ్రూకు తెలిసి, తీరిక చేసుకొని నెహ్రూ వాళ్ల ఇంటికి వెళ్లారట. 'ఏం దుర్గాబాయ్! దేశ్‌ముఖ్ నీ భర్తే కావచ్చు.. నా క్యాబినెట్ మంత్రి సుమా!' అని చమత్కరించారట. ఆ దంపతులు ఇచ్చిన టీ బిస్కెట్ తీసుకుని నెహ్రూ మందహాసంతో వెళ్లిపోయా రట. ఇలాంటి ఆప్యాయత ఈ రోజుల్లో కనిపించడం అరుదు. తన నియోజకవర్గం ప్రజల అభీష్టానికి వ్యతిరేకంగా బొంబాయి నగరాన్ని కేంద్రం అధీనంలో ఉంచడం ఇష్టపడక దేశ్‌ముఖ్ మంత్రి పదవికి రాజీనామా చేశారు. ఆ తర్వాత ఆయన ఢిల్లీ యూనివర్సిటీ వైస్‌ఛాన్సలర్‌గా ఆరేళ్లు చేశారు. దేశ్‌ముఖ్ సేవలను అంతర్జాతీయ ద్రవ్యనిధి వినియోగించు కోవాలని కోరినప్పుడు అందుకు ఆయన అంగీకరించ లేదు. అప్పటికే దేశ్‌ముఖ్ దంపతులు సంక్షేమ కార్యక్రమాలను దేశమంతా విస్తరించి ఉన్నారు. సంవత్సరానికి 30వేల డాలర్ల వేతనం కాదని దేశసేవకే తన జీవితాన్ని ఆయన అంకితం చేశారు. ఇన్ని ఉద్యోగాలు చేసిన ఆయన ఎల్లప్పుడూ నిర్ధనుడే. కూడబెట్టిన ధనమంతా పూణేలో ఉన్న ఇల్లు మాత్రమే. 1952లో దేశ్‌ముఖ్ విద్యనభ్యసించిన కేంబ్రిడ్జి విశ్వ విద్యాలయపు జేసస్ కళాశాల నుంచి గౌరవ ఫెలోగా ఎన్నికైనారు. 1959లో ప్రభుత్వ సర్వీసు రంగంలో రామన్ మెగ్సేసే అవార్డును పిలిప్పీన్స్ కు చెందిన జోస్ అగ్విలార్ తో కల్సి సంయుక్తంగా పొందారు. 1975లో భారత ప్రభుత్వం పద్మ విభూషణ పురస్కారంతో సత్కరించగా, అదే సంవత్సరం ఆయన సతీమణి దుర్గాబాయి దేశ్‌ముఖ్ కూడా పద్మ విభూషణ్ పొందడం, భార్యాభర్తలు ఇద్దరూ ఒకే ఏడాది పురస్కార గ్రహీతలు కావడం విశేషం.

**రామ కిష్టయ్య సంగన భట్ల, 9440595494**

## బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్ రామచంద్రరావుకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపిన కార్పొరేటర్



**కుత్బుల్లాపూర్, జనవరి 13 (నినాదం) :** బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రామచంద్ర రావు గాజులరామారం డివిజన్ కార్పొరేటర్ బిజెపి నాయకులు రావుల శేషగిరి కత్బుల్లాపూర్ బిజెపి నాయకులతో కలిసి సంక్రాతి శుభాకాంక్షలు తెలిపారు .ఈ కార్యక్రమం లో బిజెపి సీనియర్ నాయకులు శేఖర్ యాదవ్, దాసి నాగరాజు, సుబ్బారావు, రచ్చ చక్రధర్, పద్మ ప్రసాద్, రాజు తదితరులు పాల్గొని రాంచందర్రావుకు చాలవాలు కప్పి సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు.

## ఉమ్మడి సుభాష్ నగర్ డివిజన్‌ను ఆదర్శవంతంగా అభివృద్ధి చేయాలి

**కొంపల్లి డిప్యూటీ కమిషనర్ కృష్ణారెడ్డికి వినతిపత్రం అందజేసిన గుబ్బల లక్ష్మీనారాయణ**



**కుత్బుల్లాపూర్, జనవరి 13 (నినాదం) :** కుత్బుల్లాపూర్ నియోజక వర్గం కొంపల్లి డిప్యూటీ కమిషనర్ కృష్ణారెడ్డి ని సుభాష్ నగర్ డివిజన్ టీఆర్ఎస్ పార్టీ నాయకులు గుబ్బల లక్ష్మీనారాయణ, డివిజన్ మాజీ అధ్యక్షులు ఆలూరు వెంకట శేషాచారి లు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. డివిజన్ లో ఉన్న సమస్యలు పరిష్కరించాలని ఉమ్మడి సుభాష్ నగర్ డివిజన్ ను ఆదర్శవంతమైన డివిజన్ గా తీర్చిదిద్దాలని డిప్యూటీ కమిషనర్ ను ఈ సందర్భంగా కోరారు. ఎస్సార్ నాయక్ నగర్ లో జి హెచ్ ఎం సి పార్కుకు సంబంధించి సమస్యలు ఉన్నాయని అందులో ఉన్న సమస్యలు పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. సుభాష్ నగర్ డివిజన్ లో పారిశుధ్య సమస్యలను పరిష్కరించాలని, ఎస్సార్ నాయక్ నగర్ తో పాటు పలు బస్తీలో ఉన్న సమస్యలు పరిష్కరించాలని, కాలనీలో పర్యటించి సమస్య పరిష్కరించాలని కోరారు. అందుకు డిప్యూటీ కమిషనర్ కృష్ణారెడ్డి సానుకూలంగా స్పందించి సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చినట్లు గుబ్బల లక్ష్మీనారాయణ ప్రకటనలో వివరించారు. ఈ కార్యక్రమంలో కిషోర్, గోవిందస్వామి,సోమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు భద్రత మన అందరి బాధ్యత

**మాదాపూర్ జోన్ ట్రాఫిక్ డీసీపీ సాయి మనోహర్**




**రాజేంద్రనగర్ జనవరి 13 (నినాదం) :** రోడ్డు భద్రత మన అందరి బాధ్యత అని గ్రామాల్లో ట్రాఫిక్ నియమాల పట్ల అవగాహనమే కలిగించాలని మాదాపూర్ జోన్ ట్రాఫిక్ డిసిపి సాయి మనోహర్ అన్నారు. మంగళవారం కోకాపేట కమ్యూనిటీ హాల్‌లో కోకాపేట గ్రామస్తులతో కలిసి, ప్రస్తుతం దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న రోడ్ సేఫ్టీ మంత్ ట్రాఫిక్ అవేర్నెస్ కార్యక్రమం జరి గింది. ఈ కార్యక్రమంలో భాగంగా తెలంగాణ పోలీస్ డిపార్ట్మెంట్ చేపడుతున్న అరైవ్, ఆలివ్ ప్రోగ్రాం క్రింద ఒక ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈనెల 13వ తేదీ నుంచి 24వ తేదీ వరకు పది రోజుల పాటు కొనసాగుతున్న రోడ్ సేఫ్టీ ట్రాఫిక్ అవేర్నెస్ కార్యక్రమాని ముఖ్య అతిథు లుగా హాజరైన ట్రాఫిక్ డిసిపి సాయి మనోహర్, అడిషనల్ డీసీపీ హనుమంతరావు మాదాపూర్ డివిజన్ ఏసిపి చంద్రశేఖర్ రెడ్డి నార్సింగ్ ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ ఆంజనేయులు నార్సింగ్ పోలీస్ స్టేషన్ ఎస్హెచ్ఓ హరికృష్ణారెడ్డి, అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ శ్రీముఖి,ఎస్సై బి రాజేష్ గౌడ్, మాజీ కార్పొరేటర్ ఆదిత్య రెడ్డి, పోలీస్ సిబ్బందితో కలిసి హాజరయ్యారు.ఈ సందర్భంగా గ్రామస్తులు, లోకల్ యూత్, వివిధ ప్రభుత్వ విభాగాల ప్రతినిధులు పాల్గొని రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు.ఈ సదస్సులో భాగంగా గతంలో రోడ్డు ప్రమాదాలకు గురైన బాధిత కుటుంబాల అనుభవాలను కూడా పంచుకున్నారు.కోకాపేట గ్రామానికి చెందిన నిరంజన్ అనే యువకుడు, సీబీఐటీ కాలేజీ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తన తండ్రిని కోల్పోయిన సంఘటనను భావోద్వేగంగా వివరించారు. ఆయన మాటలు గ్రామస్తుల్లో రోడ్డు భద్రతపై లోతైన అవగాహన కలిగించాయి. అలాగే రోడ్డు ప్రమాదాల్లో గాయపడి అంగవైకల్యానికి గురైన బాధి తులు ఎదుర్కొనే శారీరక, మానసిక వేదనల గురించి లోకల్ డాక్టర్ డా. జాఫర్ వైద్య పరంగా వివరించి, రోడ్డు ప్రమాదాల నివారణ ఎంత అవసరమో స్పష్టంగా తెలియజేశారు. ఈ సందర్భం గా వారంతా మాట్లాడుతూ తమ అనుభవాలను పంచుకొని, రోడ్డు ప్రమాదాలు తగ్గించేందుకు ప్రజలు పాటించవలసిన జాగ్రత్తలు, ట్రాఫిక్ నియమాల ప్రాముఖ్యతపై సూచనలు చేశారు.

## దుబ్బాక వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకారం



**సిద్దిపేట దుబ్బాక (నినాదం):** దుబ్బాక నియోజకవర్గ వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలక వర్గం ప్రమాణ స్వీకార కార్యక్రమం మంగళవారం దుబ్బాకలోని కోమటిరెడ్డి రజినీకాంత్ రెడ్డి ఫంక్షన్ హాల్‌లో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా ఇంచార్జ్ మంత్రి గడ్డం వివేక్ వెంకట స్వామి , దుబ్బాక నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి .ముఖ్య అతిథు లుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన దుబ్బాక వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా కొంగరి రవి , వైస్ చైర్మన్‌గా బొంగరం బాల్ రెడ్డి తొగుట మార్కెట్ కమిటీ చైర్మన్ చెరుకు విజయ్ రెడ్డి (అమర్), వైస్ చైర్మన్ కొంగరి నర్సింలు, మీరుదొడ్డి మార్కెట్ కమిటీ చైర్మన్ బొమ్మెర సంయుక్త శ్రీధర్ గుప్తా, వైస్ చైర్మన్ చెన్నై భూపాల్ గౌడ్, దౌల్తాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ ఐలాపురం కనకయ్య యాదవ్, వైస్ చైర్మన్ మద్దెల స్వామి ప్రమాణ స్వీకారం చేశారు.సహా అన్ని మండలాలకు చెందిన మార్కెట్ కమిటీ డైరెక్టర్లు ప్రమాణ స్వీకారం చేశారు ఈ సందర్భంగా మంత్రి వివేక్ వెంకటస్వామి చెరుకు శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి కార్యకర్తను కాపాడుతూ వారికి గుర్తింపు ఉంటుందని తెలిపారు.దుబ్బాక మున్సిపాలిటీ ఎన్నికల్లో అన్ని వార్డులలో కాంగ్రెస్ పార్టీ భారీ మెజార్టీతో కైవసం చేసుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నూతన మార్కెట్ కమిటీ పాలకవర్గానికి అభినందనలు తెలియజేస్తూ, రైతుల సంక్షేమానికి అంకితభావంతో పనిచేయాలని సూచించారు రైతులతో సమన్వయం పెంచుకుని వారి సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కోరారు. ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం అన్నారు

## మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ ప్రత్యేక ఆఫర్లు

**సిద్దిపేటలోని మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ 4వ వార్షికోత్సవం**
**సందర్భంగా నిర్వహిస్తున్న 'బ్రైడ్స్ ఆఫ్ ఇండియా షో**
**జనవరి 10 నుండి 18 వరకు ప్రత్యేక ప్రదర్శన**




**సిద్దిపేట(నినాదం):** వేడుకలను మరింత వైభోగంగా మార్చేందుకు ప్రపంచ ప్రఖ్యాత ఆభరణాల బ్రాండ్ మలబార్ గోల్డ్ డ డైమండ్స్ సిద్ధమైంది. తన ప్రతిష్టాత్మక ప్రదర్శన 'బ్రైడ్స్ ఆఫ్ ఇండియా' ఎడిషన్‌ను సిద్దిపేటలోని మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ 4వ వార్షికోత్సవం సందర్భంగా ఘనంగా ప్రారంభించనుంది. జనవరి 10 నుండి 18 వరకు వరకు జరిగే ఈ ప్రదర్శన, భారతీయ వివాహ సంప్రదాయా ల వైవిధ్యాన్ని మరియు పెళ్లి ఆభర ణాల అద్భుత పనితనాన్ని కళ్ళకు కట్టినట్లు చూపనుంది
**డిజైన్లు:** భారతదేశంలోని వివిధ సంస్కృతులు సంప్రదా యాలను ప్రతిబింబించేలా అద్భుతమైన బంగారు, వజ్రాల విలువైన రత్నాల ఆభరణాలు బజ్‌శీ 30శాతం శీటట అందుబాటులో ఉన్నాయి.
**వార్షికోత్సవ ఆఫర్లు:** 4వ వార్షికోత్సవం సందర్భంగా కస్టమర్ల కోసం మేకింగ్ ఛార్జీలపై తగ్గింపు.
**ముందస్తు బుకింగ్:** రాబోయే పెళ్లిళ్ల సీజన్ దృష్ట్యా, కస్టమర్లు తమకు నచ్చిన ఆభరణాలను ముందుగానే బుక్ చేసుకునే సౌకర్యం కలదు.అని జనవరి 26, 2026 వరకు కొనసాగే మైన్ డైమండ్ ఫెస్టివల్‌లో భాగంగా వజ్రాల విలువపై 30శాతం వరకు తగ్గింపు వర్తిస్తుందని స్టోర్ హెడ్ షరీక్ అష్రఫ్ మేనేజరు లు శివ,వాజిద్ తెలిపారు

## గ్రామాల అభివృద్ధిలో పంచాయతీ కార్యదర్శులదే కీలక పాత్ర

**ఎమ్మెల్యే ప్రకాష్ గౌడు**



**రాజేంద్రనగర్ జనవరి13 నినాదం :** గ్రామాల అభివృద్ధిలో పంచాయతీ కార్యదర్శులదే కీలక పాత్ర అని ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ అన్నారు. మంగళవారం రాజేంద్రనగర్ లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శంషాబాద్ మండలానికి చెందిన21 గ్రామ పంచాయతీ కార్యదర్శిలతో ఆయన ప్రత్యక్ష సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల సమగ్ర అభివృద్ధి ప్రజలకు మెరుగైన సేవలందించడంలో పంచాయతీ కార్యదర్శులు అంకితభావంతో పనిచేయాలని తమ విధులను సక్రమంగా నిర్వహించాలని, ప్రతిరోజూ గ్రామాల్లో పర్యటించి కనీస సౌకర్యాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ సూచించారు.గ్రామాల్లోని రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ, వీధి దీపాల నిర్వహణను నిరంతరం పర్యవేక్షించాలని, ఎక్కడైనా సమస్యలు తలెత్తితే వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. గ్రామాల్లోని నర్సరీల నిర్వహణ, మొక్కల పెంపకం భూగర్భ జలాల పెంపునకు దోహదపడే ఇంకుడు గుంతల నిర్మాణం గురించి ఆరా తీసి, వాటి పురోగతిపై దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వ పథకాలు సేవలు నేరుగా ప్రజలకు అందేలా చూడటంలో కార్యదర్శులు వారధిలా పనిచేయాలని ఆయన పేర్కొన్నారు. ఈ సమీక్షా సమావేశంలో శంషాబాద్ ఎంపీడీవో ముని, ఎంపీఓ రమేష్ వివిధ గ్రామాల పంచాయతీ కార్యదర్శులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రాగిరి మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో పతంగుల పంపిణీ



**కాప్రా, జనవరి13 (నినాదం) :** నాచారం సర్కిల్ నాచారం డివిజన్ ఎర్రకుంట, అంబేద్కర్ నగర్ లో బిజెపి పార్టీ మేడ్చల్ అర్బన్ జిల్లా కిసాన్ మోర్చా ఉపాధ్యక్షులు రాగిరి మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో సంక్రాంతి పండుగను పురస్కరించుకొని చిన్నారులకు పతంగులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాగిరి మోహన్ రెడ్డి మాట్లాడుతూ సాంప్రదాయాలను కాపాడుతూ సంక్రాంతి పండుగను ప్రజలు సంతోషాలతో జరుపుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి పార్టీ నాచారం డివిజన్ అధ్యక్షులు కొమ్మగల నవీన్ కుమార్, మాజీ అధ్యక్షులు మల్లా ప్రకాష్, బిజెపి పార్టీ నాయకులు అనితా పద్మా రెడ్డి, అభిషేక్ గౌడ్, ఉదయ్ కిరణ్ రెడ్డి, సాయి గౌడ్, ఆనంద్ గుప్తా, శ్రీ మూర్తి నాగరాజు, కౌశిక్, బాలు, బాలకృష్ణ పాల్గొన్నారు.

## ఫార్మర్ రిజిస్ట్రీ తప్పనిసరి

**వ్యవసాయ జిల్లా అధికారి రాజారత్నం**



**కొడంగల్, జనవరి13 (నినాదం) :** రైతులు తప్పనిసరిగా ఫార్మర్ రిజిస్ట్రీ చేసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి రాజారత్నం అన్నారు.మంగళవారం ఆయన వ్యవసాయ అధికారులతో కలిసి కొడంగల్ మండలం లోని రావుల పల్లి, అంగడిరాయిచూర్,గ్రామాల రైతువేదికలను సందర్శించారు.ఈసందర్భంగా రైతులతో మాట్లాడుతూ రైతులకు పలు సూచనలు చేశారు.భూమి ఉన్న ప్రతి రైతు తనకు ఉన్న భూములకు సంబంధించిన వివరాలతో ఆధార్ సంఖ్యను అనుసంధానం చేయించుకోవాలి అన్నారు. ప్రభుత్వ వ్యవసాయ పథకాల ద్వారా లబ్ధి పొందేందుకు, పిఎం కిసాన్ లబ్ధిదారులు తదుపరి విడత లబ్ధి పొందేందుకు ఫార్మర్ రిజిస్ట్రీ తప్పనిసరి చేస్తూ కేంద్ర ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసిందని రైతులకు సూచించారు. ఫార్మర్ రిజిస్ట్రీ కోసం భూమి ఉన్న ప్రతి రైతు రైతు వేదికకు వెళ్లి వ్యవసాయ అధికారి చేత ఆధార్, ఆధార్ కార్డు,వ్యవసాయ పాసుపు స్తకం, ఆధార్ లింక్ చేయబడిన ఫోన్ నెంబర్ తీసుకెళ్ళి రిజిస్ట్రీ చేసుకోవాలని సూచించారు. ఈకార్యక్రమంలో వ్యవసాయ సహాయ సంచాలకులు కె.శంకర్ రాథోడ్, ఏఈఓ లు సుమ,పావని వ్యవసాయ రైతులు పాల్గొన్నారు.

## రేషన్ షాప్ ద్వారా ప్రజలకు బియ్యంను సక్రమంగా అందించాలి

**బాచుపల్లి బాబుల్ బెడ్రూముల్లో రేషన్ దుకాణం ప్రారంభోత్సవంలో కొలను హనుమంత రెడ్డి**



**కుత్బుల్లాపూర్, జనవరి 13 (నినాదం) :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం బాచుపల్లి డబుల్ రూమ్ ప్రాంతంలో శ్రీహరి ఏర్పాటు చేసిన తెలంగాణ రాష్ట్ర జాతీయ పౌర సరఫరాల పతకం దుకాణాన్ని (3307012) నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా కొలను హను మంత రెడ్డి మాట్లాడుతూ, పేద ప్రజలకు నాణ్యమైన సన్న బియ్యం అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. ప్రతి అర్హత కలిగిన కుటుంబానికి ఆహార భద్రత కార్డు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందని తెలిపారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ పార్టీ నిరంతరం పనిచేస్తుందని, పేదల అభ్యున్నతే ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యత అని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు బాల బ్రహ్మాచారి, సిద్దనోళ్ల సంజీవ రెడ్డి, ఆలేటి శ్రీనివాస్ రావు, మైసిగారి శ్రీనివాస్, రాంచందర్ నాయక్, మల్లికార్జున్, ఆది రెడ్డి, రహీమ్ భాయ్, శేఖర్, శ్రీను, డబుల్ బెడ్ రూమ్ వాసులు పాల్గొన్నారు.

## మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తాచాటుతోంది


**మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి**



**వికారాబాద్, జనవరి13(నినాదం):** త్వరలో జరగనున్న మున్సిపల్ ఎన్నికల్లో బి ఆర్ ఎస్ సత్తా చాటుతోందని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పి సబితా ఇంద్రారెడ్డి ధీమా వ్యక్తం చేశారు. మంగళవారం వికారాబాద్ లో మున్సిపల్ ఎన్నికల సన్నాహక సమావేశాన్ని పార్టీ జిల్లా అధ్యక్షుడు మెతుకు ఆనంద్ అధ్యక్షన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇన్నాళ్ళు పార్టీలో చెత్త లాంటి నకిలీ నాయకులు ఉండేవారని వారు అందలంమెక్కి పార్టీకి ద్రోహం చేశారని అన్నారు. నేడు నిజమైన కార్యకర్తలు ఉన్నారని వారు రానున్న మున్సిపల్ ఎన్నికల్లో నిజాయితీగా పనిచేసి పార్టీ అభ్యర్థులకు విజయానికి కృషి చేయనున్నారని ఆమె అన్నారు. ఆపదలో ఉన్నవారే నిజమైన నాయకులని ఆలాంటి వారు నేడు రొమ్ము విరిచి పార్టీ విజయం కోసం పనిస్తున్నారని ఆమె చెప్పారు. కార్యకర్తలు సహితం పార్టీ విజయం కోసం తపిస్తున్నారని అన్నారు. ప్రస్తుత ప్రభుత్వంతో ప్రగతి సాధ్యం కాదని తేలిపోయిందని ఊకదంపుడు ఉపన్యాసాలు తప్ప ఆచరణలో పెట్టడం చేతకాని ప్రభుత్వమని ప్రజలు విశ్వసిస్తున్నారని అన్నారు. ఏ ఒక్క పనిని సకాలంలో సమర్థవంతంగా చేసి చూపిన దాఖలాలు లేవని ప్రజలే చెబుతున్నారని ఆమె చెప్పారు. ఎన్నిక ఏదైనా బి ఆర్ ఎస్ విజయం తాధ్యమని ఆమె ధీమా వ్యక్తం చేశారు. నిరుద్యోగ సమస్య ను ప్రక్కతోపట్టించడం కోసం ప్రభుత్వం జిల్లా ల పునర్వీభజన విషయాన్ని తెరపైకి తెచ్చారని ఆమె ఆరోపించారు. వికారాబాద్ మున్సిపాలిటీ అభివృద్ధికి కోసం అప్పటి ఎమ్మెల్యే ఆనంద్ కొట్లాది రూపాయల నిధులు మంజూరీ చేయిస్తే కాంగ్రెస్ ప్రభుత్వం నిధులు రద్దు చేసి అభివృద్ధిని అడ్డుకున్నట్లు చెప్పారు. పాల మూరు రంగారెడ్డి ప్రాజెక్టు నీటి వాటా కోసం కూడ ప్రభుత్వం భిన్న మైన పద్దతులు అలం భిస్తోందని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు మాజీ చర్మన్ నాగేందర్ గౌడ్, కమిషన్ సభ్యుడు శుభప్రదపటేల్, నాయకులు రామస్వామీ, విజయ్ కుమార్, దేవదాసు తదితరులు పాల్గొన్నారు.

## వాళ్లంతా సంతలతో ట్రాఫిక్ ఇబ్బంది

**సైలెన్సర్ లేని వాహనాలు, అతివేగం,**
**నెంబర్ ప్లేట్లు లేని వాహనాలపై చర్యలు తీసుకోవాలి.**
**ట్రాఫిక్ భద్రత వారోత్సవాలలో ఏసిపి వెంకట్ రెడ్డికి వినతిపత్రం అందజేసిన కోళ రవీందర్ ముదిరాజ్**



**కుత్బుల్లాపూర్, జనవరి13 (నినాదం) :** కాలనీలలో ఏర్పాటు చేస్తున్న వారాంతపు సంతల వలన ఆయా బస్తీలలో రోడ్లపై విచ్చలవిడిగా కూరగాయలు, ఆకు కూరలు, పండ్లు విక్రయిస్తుండడంతో పాదచారులకు, వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయని పర్యావరణ ప్రేమికుడు కోలా రవీందర్ ముదిరాజ్ ట్రాఫిక్ ఏసిపి వెంకట్ రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. ట్రాఫిక్ వారోత్సవాలలో భాగంగా సూరారం గ్రామానికి వెళ్లే రోడ్డు,సూరారం కాలనీ రోడ్డు, సాయిబాబా నగర్, వెళ్లే రోడ్డులో, ప్రతివారం గంటల తరబడి,ట్రాఫిక్ జామ అవడంతో రాకపోగాలకు కలుగుతున్న ఇబ్బందులను తొలగించేలా చర్యలు చేపట్టాలని వినతి పత్రంలో కోరారు. యువకులు బైకులకు సైలెన్సర్ లేకుండా శబ్ద కాలుష్యంతో వాహనాలు విపరీతమైన స్పీడ్ తో నడుపుచున్నారని ఆశబ్దం వల్ల వృద్ధులు, చిన్నపిల్లలు భయపడి ఆసుపత్రుల పాలవుతున్నారని అట్టివారిని గుర్తించి, నెంబర్లు లేని వాహనాలను, సీజ్ చేసేలా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులు ఆదేశించాలని విజ్ఞప్తి చేశారు.

## సమస్యలకు నిలయాలు.. జవహర్ నగర్ కాలనీలు


**ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు మహేందర్ యాదవ్**
**భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో బస్తీబాట**



**జవహర్ నగర్, జనవరి 13 (నినాదం):** సమస్యలకు నిలయాలు జవహర్ నగర్ ప్రాంతంలోని పలు కాలనీలు నిలుస్తున్నాయని ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు మహేందర్ యాదవ్ అన్నారు. జిహెచ్ఎంసి హైదరాబాద్ కీసర సర్కిల్ పరిధిలోని జవహర్ నగర్ పరిధిలోని గబ్బిలాల పేటలోని వివిధ ప్రాంతాలను బస్తి బాట కార్యక్రమంలో భాగంగా, స్థానిక బిజెపి నాయకులతో కలిసి మంగళవారం సందర్శించి అక్కడి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ ఈ ప్రాంత ప్రజలు అనేక సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నారని, మురికి కాలువలతో ఈ ప్రాంతం నిలయంగా మారిందని వీటి వలన డెంగ్యూ మలేరియా టైఫాయిడ్ తదితర సాంక్రమిక వ్యాధులు ప్రబలుతున్నాయని, మురు గునీరు రోడ్లపై ప్రవహించడం వల్ల రాకపోకలకు తీవ్రమైన ఇబ్బందు లు ఎదురవుతున్నాయని రోడ్లపై మురుగనీరు నిలిచి ఉండడంతో బాటసారులకు నడిచే పరిస్థితి కూడా లేకపోయిందన్నారు. ఇలాంటి దుర్భర పరిస్థితుల్లో ప్రజలు జీవనం సాగించాల్సి రావడం బాధాకరమన్నారు. ఎన్ని ప్రభుత్వాలు మారినా గబ్బిలాల పేట ప్రజల బ్రతుకులు మారలేదని, సమస్యలు పట్టించుకున్న నాథుడు కనిపించడం లేదని వాపోయారు. గతంలో మాజీ మంత్రి మల్లారెడ్డి జవహర్ నగర్ నా గుండెకాయ అంటూ చెప్పిన మాటలు ఫోటోలు ప్రచారానికే పరిమితమయ్యాయని వాస్తవ పరిస్థితి చూస్తే జవహర్ నగర్ పూర్తిగా నిర్లక్ష్యానికి గురైంది అన్నారు. కాంగ్రెస్ పాలనలో ఇప్పటికే రెండున్నర సంవత్సరాలు గడిచినా ఈ ప్రాంత అభివృద్ధికి ఒక్క రూపాయి కూడా కేటాయించలేని పరిస్థితి నెలకొంది అన్నారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి రాగానే జవహర్ నగర్ లోని అన్ని సమస్యలను పరిశీలిస్తామని చెప్పిన హామీలు ముఖ్యమంత్రి అయ్యాక ప్రత్యేక ప్యాకేజీ ఇస్తానని చెప్పి ఎలక్షన్ల ముందు వాగ్దానంలో చేసినప్పటికీ అధికారంలోకి వచ్చిన తర్వాత మర్చిపోవడం జరిగింది అన్నారు. కాంగ్రెస్ నాయకుల మాటలు కోటలు దాటాయే తప్ప కాళ్లు గడప దాటలేదన్నారు. గబ్బిలాల పేట ప్రజల జీవితాల్లో ఏమాత్రం మార్పు కనిపించలేదని తెలిపారు. తక్షణమే ఈ ప్రాంతంలో పారిశుధ్య సమస్యలను పరిష్కరించి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని భారతీయ జనతా పార్టీ డిమాండ్ చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు బిజెపి ప్రధాన కార్యదర్శి డాక్టర్ యాదగిరి, ఉపాధ్యక్షులు రఘురాం చారి, యువమోర్చా ప్రధాన కార్యదర్శి చందు, సీనియర్ నాయకులు గిరి కత్తుల వెంకన్న ,మల్లికార్జున్ గౌడ్, శ్రీధర్ ,ఆంజనేయులు చారి, రామకృష్ణ ,ప్రవీణ్ ,విష్ణువర్ధన్ రెడ్డి, మల్లేష్ ,చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

## సంక్రాంతి వేళ 'చైనా మాంజా'పై పోలీసుల ఉక్కుపాదం

**జీడిమెట్లలో మాంజా సీజ్, నలుగురిపై కేసు నమోదు**



**కుత్బుల్లాపూర్, జనవరి 13 (నినాదం) :** సంక్రాంతి పండుగ వేళ పతంగుల సందడి మొదలైనందున ప్రాణాంతకమైన 'చైనా మాంజా'పై పోలీసులు నిఘా ముమ్మరం చేశారు. ప్రభుత్వ నిషేధాజ్ఞలు అమలులో ఉన్నప్పటికీ, గుట్టుచప్పుడు కాకుండా వీటిని విక్రయిస్తున్న వారిపై సైబరాబాద్ పోలీసులు కఠిన చర్యలు చేపట్టారు.జీడిమెట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో సీఐ మల్లేష్ ఆధ్వర్యంలో గత కొన్ని రోజులుగా ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఈ తనిఖీల్లో భాగంగా జనవరి 8 నుంచి 12 వరకు నిర్వహించిన దాడుల్లో సుమారు 15 వేల రూపాయల విలువైన 15 మాంజా బాబిన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిషేధిత దారాన్ని విక్రయిస్తున్నట్లు గుర్తించి నలుగురిపై క్రిమినల్ కేసులు నమోదు చేశారు.

**చైనా మాంజా ద్వారాల విక్రయంపై ఎందుకీ నిషేధం - సిఐ మల్లేష్ వివరణ.**

చైనా మాంజా (నైలాన్ లేదా సింథటిక్ దారం) ప్రాణ సంకటంగా మారిందని సిఐ మల్లేష్ హెచ్చరించారు. "సాధారణ పత్తి దారంతో పోలిస్తే, ఈ నైలాన్ దారానికి గాజు ముక్కలు, లోహపు పొడిని పూతగా పూస్తారు. ఇది అత్యంత పదునుగా ఉండి మనుషుల గొంతులు కోయడమే కాకుండా, పక్షులు, జంతువుల మరణానికి కారణమవుతోంది. పర్యావరణానికి కూడా ఇది తీవ్ర నష్టం కలిగిస్తోందన్నారు."

**తల్లిదండ్రులకు పోలీసుల విజ్ఞప్తి.**

పండుగ పూట విషాదాలు చోటు చేసుకోకుండా ఉండాలంటే తల్లిదండ్రులు బాధ్యతగా వ్యవహరించాలని పోలీసులు కోరారు. పిల్లలకు ప్రమాదకరమైన సింథటిక్ దారాలకు బదులు, సంప్రదాయ నూలు దారాలనే కొనివ్వాలని సూచించారు. మీ పరిసరాల్లో ఎవరైనా నిషేధిత చైనా మాంజా విక్రయిస్తున్నట్లు తెలిస్తే వెంటనే డయల్ 100 సమాచారం అందించాలని సీఐ కోరారు.

## రోడ్డు భద్రతానియమాలు పాటిద్దాం.. ప్రమాదాలను అరికడదాం

**సురక్షిత ప్రయాణమే.. జీవితానికి శ్రీరామరక్ష**
**జవహర్ నగర్ డిటెక్టివ్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్**





**జవహర్ నగర్, జనవరి 13 (నినాదం):** రోడ్డు భద్రత నియమాలను పాటించి ప్రమాదాలను అరికడదామని సురక్షిత ప్రయాణమే నిండు జీవితానికి శ్రీరామరక్ష అని జవహర్ నగర్ డిటెక్టివ్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ అన్నారు. రోడ్డు భద్రత వారోత్సవాలను పురస్కరించుకొని మల్కాజిగిరి డిసిపి శ్రీధర్, ఏసిపి వెంకట్ రెడ్డి ఆదేశాల మేరకు జవహర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధి దమ్మాయిగూడలో జవహర్ నగర్ పోలీసుల ఆధ్వర్యంలో మంగళవారం వాహనదారులకు ప్రజలకు రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డిటెక్టివ్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు రోజురోజుకు పెరిగిపోతున్నాయని కుటుంబ పెద్దలను కోల్పోవడంతో అనేకమంది ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, అప్రమత్తతతోనే ప్రమాదాలను అరికట్ట వచ్చునని తెలిపారు. ప్రాణ రక్షణ కోసం ప్రతి వాహనదారుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని డ్రైవింగ్ లైసెన్సు లేకుండా వాహనం నడపొద్దని సూచించారు. శుభప్రదమైన ప్రయాణానికి నివారనే రాజమార్గమని రోడ్డు భద్రత సూచనలు సలహాలు ప్రమాద తీవ్రతను తగ్గిస్తాయని తెలిపారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలను కచ్చితంగా పాటించాలని పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ప్రజలు ట్రాఫిక్ పట్ల అవగాహన పెంచుకోవాలని సూచించారు. దేశంలో ఎక్కువ శాతం ప్రమాదాలు ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోవడం వల్ల నిర్లక్ష్యపు డ్రైవింగ్ వల్ల మితిమీరిన వేగం వల్ల అజాగ్రత్తపు డ్రైవింగ్ వల్ల ప్రమాదాలు ఎక్కువగా చోటు చేసుకుంటున్నాయని తెలిపారు. అనంతరం వాహనదారులు ప్రజలతో కలిసి రోడ్డు భద్రత ప్రతిజ్ఞను చేయించారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు ఇద్రిస్ అలీ ,నర్సిరెడ్డి, మమత, ట్రాఫిక్ పోలీసులు, తదితరులు, ప్రజలు, వాహనదారులు, పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఖానాపురం సర్పంచ్‌ల సంఘం నూతన కమిటీ ఎన్నిక




**నర్సంపేట, జనవరి13 (నినాదం):** నర్సంపేట నియోజకవర్గం ఖానాపురం గ్రామపంచాయతీ అవరణలో మంగళవారం జరిగిన సర్పంచ్ ల సమావేశంలో ఖానాపురం మండల సర్పంచ్‌ల సంఘం నూతన కమిటిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల సర్పంచ్‌ల అధ్యక్షులుగా మాద్రాజు వెంకన్న (ధర్మరావుపేట) , ఉపాధ్యక్షులు గొంది సుజాత (మంగళావారిపేట) ,ప్రధాన కార్యదర్శి దాసరి రమేష్ (ఖానాపురం), సహాయ కార్యదర్శి అబోతు శ్రీలత (మనుబోతులగడ్డ ) , కోశాధికారి బాదరబోయిన నరేష్ (చిలుకమ్మనగర్ ), ముఖ్య సలహాదారులు బాదావత్ జ్యోతి (మంగళావారిపేట) , బానోత్ వీరన్న (భద్రుతండా ) , కార్యనిర్వాహక సభ్యులు లకావత్ వసంత (కొడ్తిమాట్ తండా), కూస విమల (అయోధ్యనగర్)లు ఎన్నికయ్యారు.

## కాళేశ్వర ఆలయంలో డిసిసి అధ్యక్షుడు ప్రత్యేకపూజలు



**మహదేవపూర్ జనవరి 13, (నినాదం):** పవిత్ర పుణ్యక్షేత్రమైన శ్రీ కాళేశ్వర ముక్తేశ్వర స్వామి ఆలయంలో జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బట్టు కరుణాకర్ కుటుంబ సభ్యులతో కలిసి మంగళవారం శ్రీ కాళేశ్వర ముక్తేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీ కాళేశ్వర ముక్తేశ్వర స్వామికి అభిషేకం, శుభానంద దేవి ఆలయంలో అర్చన చేశారు. అనంతరం స్వామి వారి శేష వస్త్రాలతో సన్మానించి తీర్థప్రసాదాలు అందజేసి పూజారులు మహా ఆశీర్వాదాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అక్బర్ ఖాన్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు రాజబాబు, వామన్ రావు, శ్రీనివాస్ రెడ్డి, సత్యనారాయణ తో పాటు పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే రూ.10 లక్షల ఎల్ఓసి



**వనపర్తి ప్రతినిధి, జనవరి 13 (నినాదం) :** రేవల్లి మండలం తల్పునూర్ గ్రామానికి చెందిన మద్దుల సావిత్రికి రూ.10 లక్షల విలువగల ఎల్ వో సి ని ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి బాధిత కుటుంబానికి అందజేశారు. సావిత్రి అనారోగ్యంగా ఉందని, మెరుగైన వైద్యం అందించేందుకు తమకు ఆర్థిక స్తోమత సరిపోవడంలేదని భర్త శేఖర్ రెడ్డి మాజీ ఎంపీటీసీ ఎక్కె వెంకటేష్ కు చెప్పారు. కొన్ని రోజుల క్రితం ఎమ్మెల్యే దృష్టికి ఈ విషయాన్ని ఆయన తీసుకొచ్చారు. అందుకు వెంటనే స్పందించిన ఎమ్మెల్యే సావిత్రికి మెరుగైన చికిత్స అందించేందుకు ప్రభుత్వపరంగా మొదటి విడతగా రూ.5 లక్షల ఎల్ఓసిని, రెండో విడతగా మరో రూ.5 లక్షల ఎల్ఓసిని మొత్తం రూ.10 లక్షలు మంజూరు చేయించారు.మంజూరైన ఎల్ వో సి ని మంగళవారం హైదరాబాదులోని మాదాపూర్ లో గల తన కార్యాలయంలో బాధితకుటుంబ సభ్యులకు అందజేశారు. ఎంతో ఆర్థిక ఇబ్బందులు ఉండి మెరుపైన వైద్యం చేయించుకోలేని తమ కుటుంబానికి రూ.10లక్షల సహాయం అందించిన మీ గొప్ప మనసుకు తామెప్పుడు రుణపడి ఉంటామని కుటుంబ సభ్యులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

## శ్రీపాదరావు క్రికెట్ టోర్నీ ప్రారంభించిన డిసిసి అధ్యక్షుడు



**మహదేవపూర్, జనవరి 13, (నినాదం):** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలం కాళేశ్వరంలో మంగళవారం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ శాసనసభాపతి దివంగత నేత దుద్దిల్ల శ్రీపాదరావు క్రికెట్ టోర్నమెంట్ ను జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బట్టు కరుణాకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసానికి శరీర దృఢత్వానికి తోడ్పాటు అందిస్తాయని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు లేతకారి రమ్య రాజబాబు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ టోర్నమెంట్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో మహదేవపూర్ సిఐ వెంకటేశ్వర్లు, మండల పార్టీ అధ్యక్షుడు అక్బర్ ఖాన్, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి, వామన్ రావు, గందె సిరి సత్యనారాయణ, మైనార్టీ సబ్ డివిజన్ అధ్యక్షుడు అస్రార్, వార్డు సభ్యులు రాజశేఖర్, ఇమ్రాన్, ప్రేమ్ కుమార్ తో పాటు పలువురు పాల్గొన్నారు.

# ఇసుక అక్రమ రవాణా అరికట్టేలా పటిష్టచర్యలు

### మన ఇసుక వాహనం యాప్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

### కలెక్టర్ రాహుల్ శర్మ



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (నినాదం):** జిల్లాలో ఇసుక అక్రమ రవాణాను అరికట్టేందుకు పటిష్టమైన చర్యలు చేపడుతున్నట్లు జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. మంగళవారం ఐడీఓసీ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో ఎస్పీ సంకీర్త్ తో కలిసి రెవెన్యూ, పోలీస్, ఇరిగేషన్, రవాణా, టీజీఎండీసీ తదితర శాఖల అధికారులతో ఇసుక అక్రమ రవాణాపై చేపట్టాల్సిన చర్యలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి గతంలో మాన్యువల్ కూపన్ల ద్వారా ఉచితంగా ఇసుక అందించామని, ఇకపై ఆ విధానాన్ని పూర్తిగా నిలిపివేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. ఇకపై జిల్లాలో ఇసుక అవసరమైన లబ్ధిదారులు తప్పనిసరిగా “మన ఇసుక వాహనం” యాప్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. ఈ విధానం ద్వారా ఇసుక పంపిణీలో పారదర్శకత పెరుగుతుందని తెలిపారు. త్వరలోనే తహసీల్దార్లు, టీజీఎండీసీ అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి క్షేత్రస్థాయిలో ఉన్న సమస్యలపై విశ్లేషణ చేస్తామని అన్నారు. జిల్లాలోని ఇసుక రీచ్‌లను గుర్తించేందుకు ఇరిగేషన్, టీజీఎండీసీ అధికారులు సంయుక్తంగా సర్వే నిర్వహించాలని ఆదేశించారు. ట్రాన్స్‌పోర్ట్ అధికారులు నిరంతరం తనిఖీలు చేపట్టి ఓవర్‌లోడింగ్‌లను గుర్తించి చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇసుక అక్రమ రవాణా, అక్రమ నిల్వలు, అక్రమ విక్రయాలపై కఠిన చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. జిల్లా ఎస్పీ సంకీర్త్ మాట్లాడుతూ ఇసుక అక్రమ రవాణా చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లాలోని వాగుల నుంచి అక్రమంగా ఇసుక తరలించినా, అక్రమ డంపులు ఏర్పాటు చేసినా చర్యలు తప్పవని తెలిపారు. పోలీసులతో కలిసి నిరంతరం తనిఖీలు చేపడతామని, చెక్‌పోస్టుల వద్ద తనిఖీలు మరింత ముమ్మరం చేస్తామని తెలిపారు. ఇసుక రీచ్‌లు, వాగుల నుంచి ఇసుక తరలించే ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి నిరంతరం పర్యవేక్షిస్తామని, అక్రమ ఇసుక రవాణా చేస్తే వాహనంతో పాటు సంబంధిత వ్యక్తులపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో అటవీశాఖ అధికారి నవీన్ రెడ్డి, సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, రవాణా అధికారి సంధాని, ఆర్డీఓ హరి కృష్ణ, ఇరిగేషన్ శాఖ ఈఈ బసవ ప్రసాద్, శిక్షణా డిప్యూటీ కలెక్టర్ నవీన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# హోంగార్డు నుంచి ఎస్పీ వరకు ఒక్కటైన పోలీసులు




### గెలుపు కన్నా క్రీడల్లో పాల్గొనడం ముఖ్యం

### ఎస్పీ డి.సునీతా రెడ్డి

**వనపర్తి ప్రతినిధి, జనవరి 13(నినాదం):** పోలీసు అంటే కేవలం చట్టం అమలే కాదు‌ప్రజలకు భరోసా కల్పించే సేవా బలగం... నిత్యం ఒత్తిడిలో పనిచేసే పోలీసులకు స్నేహ క్రీడలు మానసిక ఉల్లాసాన్ని, శారీరక దృఢత్వాన్ని అందిస్తాయని, దీని ద్వారా ప్రజల సమస్యలను మరింత ఓర్పుతో విని పరిష్కరించే సామర్థ్యం పెరుగుతుందని జిల్లా ఎస్పీ డి.సునీతా రెడ్డి అన్నారు. స్నేహ పూర్వక క్రీడల ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా ఎస్పీ సునీతా రెడ్డి హాజరై విజేతలకు ట్రోఫీలు, పతకాలు అందజేశారు.రెండు రోజులుగా జరుగుతున్నా స్నేహ పూర్వక క్రీడల్లో పోలీసు అధికారులతో పాటు జిల్లా పోలీసు సిబ్బంది క్రికెట్, వాలీ బాల్ ఆటలలో పాల్గొన్నారు.ఈ పోలీసు స్నేహ పూర్వక క్రీడల ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా ఎస్పీ సునీతా రెడ్డి పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో ఎస్పీ మాట్లాడుతూ పోలీసు అంటే ఎల్లవేళలా ప్రజలకు భరోసా, రక్షణ కోసం పనిచేసేవారని, వారు నిత్యం అనేక ఒత్తిడిలకు గురవుతారని, ఈ యొక్క ఆటల ద్వార ఉల్లాసాన్ని అందజేస్తుందని, శారీరకంగా, మానసికంగా ఆరోగ్యంగా ఉండగలుగుతారని చెప్పారు. తద్వారా ప్రజల యొక్క సమస్యలను మరింత ఓర్పుగా విని వారికి సహాయ పడగలుగుతారని తెలిపారు. ఈ క్రీడల వల్ల పోలీసు సిబ్బందిలో స్నేహభావం, సుహృద్భావ సంబంధాలు పెరగాలని ఆకాంక్షించారు. నేర నియంత్రణలో ఎల్లప్పుడూ కృషి చేస్తూ పని ఒత్తిడి నుండి ప్రతి ఒక్కరూ బయటికి రావాలనే ఉద్దేశంతో ఈ స్నేహ పూర్వక క్రీడలను నిర్వహించడం జరిగిందని చెప్పారు. హోదాతో సంబంధం లేకుండా హోంగార్డ్ నుండి ఎస్పీ వరకు కలిసికట్టుగా పోటీలో జట్టుగా పాల్గొని వారి ప్రతిభను కనబరిచి ఈ యొక్క స్నేహపూర్వపు క్రీడలను దిగ్విజయం చేశారు. ఈ కార్యక్రమాన్ని జరుపుకోవడానికి సహకరించిన ప్రతి ఒక్కరికి ఎస్పి ధన్యవాదాలు తెలిపారు. క్రికెట్ పోటీల్లో విజేతలు మొదటి బహుమతి వనపర్తి సాయిధ దళ పోలీసు టీం, ద్వితీయ బహుమతి జిల్లా పోలీసు కార్యాలయం టీం, వాలీబాల్ లో మొదటి బహుమతి సాయిధ దళ పోలీసు టీం, ద్వితీయ బహుమతి కొత్తకోట సర్కిల్ పోలీసు టీం, టగ్ ఫార్‌లో మొదటి బహుమతి హోంగార్డ్స్ టీం, ద్వితీయ బహుమతి జిల్లా పోలీసు కార్యాలయం టీం పొందింది. వీరికి ఎస్పీ బహుమతుల ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో ఏ ఆర్ అదనపు ఎస్పీ వీరారెడ్డి, వనపర్తి డిఎస్పీ వెంకటేశ్వరావు, డిసిఆర్బి డిఎస్పి బాలాజీ, స్పెషల్ బ్రాంచ్ సిఐ నరేష్, సిసిఎస్ సీఐ అశోక్ కుమార్, వనపర్తి సిఐ కృష్ణ, కొత్తకోట సీఐ రాంబాబు, ఆత్మకూర్ సిఐ శివకుమార్, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు అప్పలనాయుడు, శ్రీనివాస్, జిల్లాలోని ఎస్సైలు, పోలీస్ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

### ముగ్గులు మహిళల సృజనాత్మకతకు

# నిలువెత్తు నిదర్శనం

### ఎస్పీ డి.సునీతా రెడ్డి




**వనపర్తి ప్రతినిధి, జనవరి 13(నినాదం):** ముగ్గులు భారతీయ మహిళల సృజనాత్మకతకు, హస్తకళా నైపుణ్యానికి ప్రతిబింబమని జిల్లా ఎస్పీ డి.సునీతా రెడ్డి అన్నారు. సంక్రాంతి సంబరాలలో భాగంగా జిల్లా పోలీసుశాఖ ఆధ్వర్యంలో స్నేహ పూర్వక క్రీడల్లో భాగంగా జిల్లాలో మహిళలకు ముత్యాల ముగ్గుల పోటీని ఎస్పీ కార్యాలయం క్రీడా ప్రాంగణంలో నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా ఎస్పీ సునీతా రెడ్డి మాట్లాడుతూ భారతీయుల సంస్కృతి సాంప్రదాయంలో ముగ్గులది ప్రధానమైన పాత్రని ఆమె వివరించారు. ఎలాంటి సాధనాలు ఉపయోగించకుండా మన మహిళలు మునివేళ్లతో వేసే ముగ్గులను ప్రపంచంలోని స్త్రీలంతా ఆశ్చర్యంగా చూస్తారని ఎస్పీ వివరించారు.అనాదిగా వస్తున్న ఈ కళను కాపాడుకోవడం, తరతరాలకు అందించడం మన బాధ్యతని ఎస్పీ హృదయపూర్వకంగా తెలిపారు. ఎస్పీ, మహిళ అధికారులు, సిబ్బంది వారి కుటుంబ సభ్యులతోపాటు పోలీసుశాఖలో పనిచేస్తున్న ఉద్యోగులు ఇతర ప్రాంతాలవారు ఉత్సాహంగా పాల్గొన్నారు. అనంతరం పోటీల్లో ప్రతిభ కనబరిచిన మహిళలకు జిల్లా ఎస్పీ స్వయంగా బహుమతులు అందజేసి ఆత్మవిశ్వాసాన్ని పెంచే మాటలతో అభినందించారు. ముగ్గుల పోటీల్లో మొదటి బహుమతి శుష్మ, కవిత, రెండవ బహుమతి అనిత, దీపిక, 3వ బహుమతి అరుణ, సోని, అనిత, హారిక సాధించారు. ఈ కార్యక్రమంలో ఏ ఆర్ అదనపు ఎస్పీ వీరా రెడ్డి, వనపర్తి డి ఎస్పీ వెంకటేశ్వరావు, డిసిఆర్బి డిఎస్పి బాలాజీ, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు శ్రీనివాస్, అప్పలనాయుడు, మహిళ ఎస్సైలు, మహిళ, కానిస్టేబుల్, కానిస్టేబుల్ కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలను కాపాడాలి

### • ప్రముఖ వ్యాపారవేత్త గుడిపాటి నవీన్



**మిర్యాలగూడ జనవరి 13 (నినాదం):** తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలను కాపాడాలని గుడిపాటి నవీన్ కోరారు. 47 వార్డు ఇస్లాంపురంలో మంగళవారం ముగ్గులు పోటీలు నిర్వహించారు. గెలుపొందిన మహిళలకు బహుమతులతోపాటు పాల్గొన్నవారికి కన్సోలేషన్ బహుమతులు అందచేసి ఆయన మాట్లాడారు. తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలు ఉట్టిపడే విధంగా మహిళలు ముగ్గులు వేశారని కొనియాడారు. మహిళల సంక్షేమ అభివృద్ధి కోసం ప్రజా ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతుందని తెలిపారు. దేశంలోని రాష్ట్రంలో మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించిందని చెప్పారు. మహిళల్లో ప్రతిభను వెలికితీసేందుకు గత 30 ఏళ్లుగా పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. మహిళలు కాంగ్రెస్ ప్రభుత్వానికి అండగా నిలవాలని కోరారు. రానున్న మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలన్నారు. కార్యక్రమంలో తాజా మాజీ కౌన్సిలర్ అబ్దుల్ ఘని, గౌరు విజయకుమార్, రామ్మూర్తి అఫ్జల్, కర్నాటి సీతారాములు, నాగార్జున, ముజీబ్, నరేష్ మునిర్, షఫీ అరుణ్, దేశ నాగేంద్ర, మట్టయ్య, స్వామి ఫిరోజ్, అబ్దుల్ రషీద్ పాల్గొన్నారు.

# మానవ నిర్లక్ష్యంతోనే రోడ్డు ప్రమాదాలు

### ట్రాఫిక్ నియమాలను ఖచ్చితంగా పాటించాలి

### ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (నినాదం):** రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా మానవ నిర్లక్ష్యం వల్లే జరుగుతున్నాయని జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ అన్నారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న రోడ్ సేఫ్టీ కార్యక్రమంలో భాగంగా జనవరి 13 నుండి 24 వరకు జిల్లాలో నిర్వహిస్తున్న ప్రత్యేక అవగాహన కార్యక్రమాలలో భాగంగా మంగళవారం భూపాలపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని గొల్లబుద్ధారం గ్రామంలో రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పాల్గొని మాట్లాడుతూ వాహనదారులు ముఖ్యంగా హెల్మెట్ ధరించక పోవడం, అతివేగం, మద్యం సేవించి వాహనాలు నడపడం, ట్రాఫిక్ నియమాలను ఉల్లంఘించడం వంటి కారణాల వల్ల ప్రాణనష్టం జరుగుతోందని తెలిపారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, ట్రిపుల్ రైడింగ్ చేయరాదని, అనుమతించిన వేగ పరిమితిని మించకుండా వాహనాలు నడపాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి వాహనదారుడు తనతో పాటు ఇతరుల ప్రాణ భద్రతను కూడా దృష్టిలో ఉంచుకొని ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో భాగంగా రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబ సభ్యులను ప్రత్యేకంగా ఆహ్వానించి, ప్రమాదాల కారణంగా వారు ఎదుర్కొంటున్న మానసిక వేదన, ఆర్థిక ఇబ్బందులను వారి అనుభవాల ద్వారానే ప్రజలకు వివరించారు. ఈ సంఘటనలు ప్రజల్లో రోడ్డు భద్రతపై మరింత చైతన్యం తీసుకువచ్చేలా ఉపయోగపడ్డాయని ఆయన తెలిపారు. రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని, చిన్న నిర్లక్ష్యం కూడా కుటుంబాలను జీవితాంతం బాధలోకి నెట్టే ప్రమాదం ఉందని పేర్కొంటూ, రోడ్డు ప్రమాదాలను తగ్గించి ప్రతి ఒక్కరూ సురక్షితంగా గమ్యస్థానానికి చేరుకోవాలన్నదే అరైవ్ అలైవ్ కార్యక్రమ ప్రధాన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో భూపాలపల్లి రవాణాశాఖ అధికారి, ఫారెస్ట్ డిపార్ట్మెంట్, హెల్త్ డిపార్ట్మెంట్ అధికారులు, పోలీస్ అధికారులు, సిబ్బంది, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సమస్యల పరిష్కారంలో ముందుంటా..

### సర్పంచ్ గురగాళ్ల బంగారయ్య



**వనపర్తి ప్రతినిధి, జనవరి 13 (నినాదం):** గ్రామంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించడంలో ముందుంటానని గ్రామ సర్పంచ్ గురగాళ్ల బంగారయ్య అన్నారు. గోపాల్ పేట మండలం లక్ష్మీదేవి పల్లి గ్రామంలో మంగళవారం సర్పంచ్ వీధిలైట్లను ఏర్పాటు చేశారు. గ్రామంలో ఉన్న ప్రతి విద్యుత్ స్తంభానికి ఆయన లైట్లను ఏర్పాటు చేసి అంధకారం లేకుండా చేశారు. ఎంతో కాలంగా గ్రామంలో స్ట్రీట్ లైట్లు లేక ప్రజలు రాత్రి సమయాల్లో చీకట్లో ఇబ్బందులు పడ్డారు. నూతనంగా సర్పంచ్ గా ఎన్నికైన గురగాళ్ల బంగారయ్య సమస్యల పరిష్కారంలో ముందుంటున్నారు. గెలిచిన వెంటనే గ్రామంలో రోడ్లను, రోడ్డు ప్రక్కల ఇరువైపులా ఉన్న పిచ్చి మొక్కలు, చెట్లను జెసిబి సహాయంతో తొలగించారు. ఇంటర్నల్ గా ఉన్న రోడ్లను శుభ్రం చేసి డ్రైనేజీలలో ఉన్న చెత్తను తొలగించారు. క్షవరం చేసుకునేందుకు గ్రామం నుండి ఇతర ప్రాంతానికి వెళ్లలేని స్థితిలో ఉన్న వృద్ధులకు గ్రామంలో ఉచితంగా ఒకరోజు నాయి బ్రాహ్మణుడిచే క్షవరం (సేవింగ్, కటింగ్) చేయించారు. గ్రామంలో నెలకొన్న సమస్యలను తెలుసుకుంటూ ఎప్పటికప్పుడు పరిష్కారం దిశగా బంగారయ్య పని చేస్తున్నారు. సంక్రాంతి పండగ రావడం, గ్రామంలో వీధిలైట్లు లేక అంధకారంలో ఉండడంతో స్పందించిన సర్పంచ్ గురగాళ్ల బంగారయ్య వీధిలైట్లు ఏర్పాటు చేయడంతో గ్రామస్తులు ఆయనను అభినందిస్తున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు జి.బాబు, ఎం. యాదగిరి, జి.మద్దిలేటి, ఎం.రాములు తదితరులు పాల్గొన్నారు.

# విద్యాసంవత్సరం నాటికి తరగతి గదుల నిర్మాణం పూర్తి చేయాలి

### కలెక్టర్ బడుగు చంద్రశేఖర్



**నల్లగొండ ప్రతినిధి జనవరి 13 (నినాదం):** విద్యా సంవత్సరం నాటికి నల్లగొండ ఎస్ ఎల్ బిసీ వద్ద చేపట్టిన యంగ్ ఇండి యా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పా ఠశాల అకడమిక్ బ్లాక్, తరగతి గ దుల నిర్మాణ పనులను పూర్తి చేసి అప్పగించాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ ఇంజనీరింగ్ అధికారు లను ఆదేశించారు. మంగళవారం ఆయన ఎస్ఎల్ బి సి వద్ద ఉన్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసి డెన్షియల్ పాఠశాల నిర్మాణ పను లను తనిఖీ చేశారు. పనులు నిరంతరం కొనసాగించాల ని, ఒక్క రోజు కూడా పనులు ఆగ రాదని, నిర్దేశించిన సమయానికి ముందే నిర్మాణం పూర్తి చేసి అప్ప గించాలని, ముఖ్యంగా వచ్చే విద్యా సంవత్సరం నాటికి అకాడమిక్ బ్లా క్ ,తరగతి గదులను పూర్తి చేసి ఇ వ్వాలని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బా ల ప్రసాద్ ను ఆదేశించారు.టైం షెడ్యూల్ ఏర్పా టు చేసుకొని నిర్దేశించిన సమయం ప్రకారం పనులు పూర్తి చేయాలని, ప్రతి 15 రోజులకు ఒకసారి పాఠశాల నిర్మాణ పనుల పురోగ తిని సమీక్షించడం జరుగుతుందని తెలిపారు. పాఠశాల నిర్మాణ పను లు నాణ్యతగా ఉండాలని, భవనా నికి బీటలు రావడం ,నాణ్యత లో పించడం వంటివి ఉండకూడదని, ఒకవేళ అలాంటివి జరిగితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చ రించారు. న ల్గొండ యంగ్ ఇండియా ఇంటిగ్రే టె డ్ రెసిడెన్షియల్ పాఠశాలకు సంబం ధించి కాంపౌండ్ వాల్ తో పాటు పా ఠశాలకు సంబంధించిన స్థలం మొ త్తం భద్రతగా ఉండేలా చూసుకోవా లని ఈఈ ని ఆదేశించారు.మునుగోడు పాఠశాల నిర్మాణ పను లను సైతం ఇదేవిధంగా వేగవంతం గా పూర్తిచేయాలన్నారు. తక్కిన నియోజకవర్గాలలో చేపట్టిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్సియ ల్ పాఠశాల పనులకు సంబంధిం చి న స్థలాలను వెంటనే పొజిషన్లోకి తీ సుకోవాలని ఆయన ఆదేశించారు.ఈ ఈ బాల ప్రసాద్ నల్గొండ యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియ ల్ పాఠశాల వివరాలను జిల్లా కలెక్ట ర్ కుమ్యాప్ ద్వారా పాఠశాల బ్లాక్ లు, డార్మెటరీ, తరగతి గదులు, ప్రి న్సిపల్, సిబ్బంది క్వార్టర్స్ తదితర అన్ని వివరాలను తెలియజేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పాఠ శాల నిర్మాణ పనులను పరిశీలించా రు. స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్, ఆర్డీఓ వై.అశోక్ రెడ్డి, న ల్గొండ తహసిల్దార్ పరశురాం, ఇంజ నీరింగ్ అధికారులు ఉన్నారు.

## చైనా మాంజా విక్రయిస్తే కఠినచర్యలు

### భూపాలపల్లి సిఐ నరేష్ కుమార్




**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (నినాదం):** భూపాలపల్లి పట్టణంలో నిషేధించబడిన చైనా మాంజా విక్రయాలు, నిల్వలు, వినియోగంపై కఠిన చర్యలు తీసుకుంటామని పట్టణ సీఐ డి. నరేష్ కుమార్ హెచ్చరించారు. మంగళవారం పట్టణంలో ఎఫ్ఆర్‌వో నరేశ్, ఎస్ఐ సతీష్ లతో కలిసి ఆయన పలు దుకాణాలు, వ్యాపార కేంద్రాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఎవరైనా వ్యక్తులు లేదా షాపులు నిషేధిత చైనా మాంజాను విక్రయించినా, నిల్వ ఉంచినా లేదా వినియోగించినా, వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన స్పష్టం చేశారు. కేసులు నమోదు చేసి, జరిమానాలు విధించడంతో పాటు అవసరమైతే అరెస్టులు కూడా చేయబడతాయని తెలిపారు. పట్టణ ప్రజలు, వ్యాపారులు ఈ విషయంలో పూర్తిగా సహకరించాలని, నిషేధిత చైనా మాంజాను విక్రయించకుండా, వాడకుండా ఉండాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఎవరైనా అక్రమంగా చైనా మాంజా విక్రయాలు చేస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

### మిర్యాలగూడ మున్సిపాలిటీలో

# 144 కేంద్రాలు

### ముసాయిదా జాబితా కమీషనర్ జి .శ్రీనివాస్



**మిర్యాలగూడ, జనవరి 13(నినాదం):** రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు రానున్న మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో మిర్యాలగూడ మున్సిపాలిటీలో పోలింగ్ కేంద్రాల ముసాయిదా జాబితా ప్రచురించబడిందని మునిసిపల్ కమీషనర్ జి. శ్రీనివాస్ తెలిపారు. ముసాయిదా పోలింగ్ కేంద్రాల జాబితాను మునిసిపల్ కార్యాలయంలో ప్రజల కోసం నోటిస్ బోర్డులో పెట్టారు. మున్సిపాలిటీ లోని 48 వార్డులకు మొత్తం 144 పోలింగ్ కేంద్రాలు ఉన్నట్టు కమీషనర్ శ్రీనివాస్ తెలిపారు. తుది పోలింగ్ కేంద్రాల జాబితా ఈ నెల 16న సబ్ కలెక్టర్, మునిసిపల్, తహసీల్దార్ కార్యాలయాల్లో నోటీస్ బోర్డుపై పెడ్తామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్, రెవిన్యూ ఆఫీసర్ జి.జ్ఞానేశ్వరి, టీపీఓ కె.అంజయ్య, టీపీబీఓ చరణ్, సాంబయ్య, మనోజ్ కుమార్, సానిటరీ ఇన్స్పెక్టర్ వెంకటరమణ, పర్యావరణ ఇంజనీర్ శ్వేత, ఇతర మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## పూదరి మహేందర్‌కి కాంగ్రెస్ టికెట్ ఖరారు

**ఎమ్మెల్యే విజయరమణరావు**



**పెద్దపల్లి ప్రతినిధి,జనవరి13(నినాదం):**
రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను ఆశీర్వదించాలని,11వ వార్డు నుంచి పూదరి మహేందర్ కాంగ్రెస్ పార్టీ తరుపున ఎన్నికల బరిలో నిలుస్తారని, అతడిని భారీ మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్యే వార్డు ప్రజలకు పిలుపునిచ్చారు. మహిళకు రిజర్వ్ ఐతే పూదరి మహేందర్ భార్య నిలబడుతారంటూ పూదరి మహేందర్ ఫ్యామిలీకి టిక్కెట్ ఖరారు చేశారు.ఈ కార్యక్రమంలో నూగిళ్ల మల్లయ్య, బండారి రాంమూర్తి, మాజీ కౌన్సిలర్లు,కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, యూత్ కాంగ్రెస్ నాయకులు,రంగంపల్లి ప్రజలు మరియు తదితరులు పాల్గొన్నారు.

## 24 వ డివిజన్‌లో తప్పిదాలను సమీక్షించాలి

***రామగుండం కార్పొరేషన్ 24వ డివిజన్ రిజర్వేషన్ కేటాయింపులో అక్రమాల పై కలెక్టర్‌కు వినతి పత్రం అందజేత***



**పెద్దపల్లి ప్రతినిధి,జనవరి 13 (నినాదం)**
రామగుండం కార్పొరేషన్ పరిధిలోని 24 వ డివిజన్‌లో ఇంటింటి సర్వే నిర్వహించలేదని,ఎన్టీపీసీ ప్రాంతంలో నివసిస్తున్న వందలాది మంది కొత్త ఓటర్లును జాబితాలో చేర్చలేదు. బదిలీ ఐన అనేక ఉద్యోగుల కుటుంబాలను తొలగించలేదంటూ, మొత్తంగా ఓటరు జాబితా వాస్తవ పరిస్థితిని ప్రతిబించటం లేదంటూ ఆయా వార్డు ప్రజలు కలెక్టర్‌కు వినతి పత్రాన్ని సమర్పించారు.తప్పుల తడకగా ఉన్న ఓటరు జాబితాతోనే 24వ డివిజన్‌లో రిజర్వేషన్ కేటాయింపులు చేపడుతున్నారని వారు వాపోయారు.ఎన్నికల సంఘం నియామావళి ప్రకారం రొటేషన్ పద్ధతికి అనుగుణంగా రిజర్వేషన్ సరిచేసేలా,తక్షణమే సమీక్షించాలన్నారు.2014లో ఒక డివిజన్‌ను 47,48 అనే రెండు డివిజన్‌లుగా విభజించారు,ఈ రెండింటినీ జనరల్‌కు కేటాయించారు. 2020లో ఈ రెండు డివిజన్‌లను కలిపి 24 వ డివిజన్‌గా మార్చి,మళ్లీ జనరల్‌కు కేటాయించారని,ఒక డివిజన్‌ను అనేక సార్లు,రిజర్వేషన్ లేని మహిళలకు,కేటాయించడం చట్టవిరుద్ధమంటూ,తక్షణమే ఉన్నాతాధికారులు స్పందించాలంటూ పి. హరికృష్ణయాదవ్,నేత్ర, మధు, జీవన్, రవి, తరుణ్, అభిలాష్ రితేష్ రెడ్డి తదితరులు కలెక్టరేట్‌లో వినతి పత్రం అందజేశారు.

## క్రికెట్ పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రధానం



**మంథని, జనవరి 13 (నినాదం)**
మంథని మండలం పోతారం గ్రామంలో ఎడ్ల వెంకటమ్మ స్మారక క్రికెట్ పోటీలు నిర్వహించారు. మంగళవారం పోతారం మాజీ సర్పంచ్ ఎడ్ల శ్రీలత, మాజీ ఎంపీటీసీ ఎడ్ల సత్యనారాయణ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన క్రికెట్ పోటీలకు అనుహ్య స్పందన లభించింది. సంక్రాంతి పండుగ సందర్భంగా సెలవులు రావడంతో పోటీల్లో యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. క్రికెట్ పోటీ ఫైనల్ మ్యాచ్ లో విన్నర్ గా గెలుపొందిన తూండ్ల సురేష్ టీమ్ కు రూ. 5016 నగదు బహుమతి, రన్నర్ గా నిలచిన బుద్ధార్తి సతీష్ టీమ్ కు రూ. 2016 నగదు బహుమతి అందజేశారు. నగదు బహుమతి అందుకున్న రెండు టీముల కెప్టెన్లు నగదును పోతారం గ్రామ హనుమాన్ గుడి కి విరాళంగా ఇచ్చారు. ఈ సందర్భంగా గ్రామంలో మొట్టమొదటిసారిగా గ్రామంలో క్రికెట్ పోటీలు నిర్వహించి యువకుల్లో చైతన్య స్ఫూర్తిని నింపేలా కృషిచేసిన నిర్వాహకులు ఎడ్ల సంతోష్ ను గ్రామస్తులు అభినందించారు. ఈ కార్యక్రమంలో పోతారం సర్పంచ్ ఎడ్ల ఆదిత్య, ఉపసర్పంచ్ దాసరి వెంకటస్వామితో పాటు యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.<
ఖని సభ లో నేతల వార్ పై కాంగ్రెస్ సీరియస్

## దాసరి విజయ్ సస్పెన్షన్.. మాజీ కార్పొరేటర్లకు షోకాజ్

**గోదావరిఖని, జనవరి 13 (నినాదం):**
గోదావరిఖనిలో జనవరి 11న జరిగిన ఇండ్ల పట్టాల పంపిణీ కార్యక్రమం అనంతరం సభావేదికపై చోటుచేసుకున్న ఘటనపై కాంగ్రెస్ పార్టీ కఠిన చర్యలు చేపట్టింది. రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ 11వ డివిజన్‌కు చెందిన కాంగ్రెస్ పార్టీ (ఎన్ఎస్ఎయూఐ) నాయకుడు దాసరి విజయ్ సభావేదికపై దురుసుగా ప్రవర్తించి, ఇతర నాయకులను దుర్భాషలాడినందున పార్టీ క్రమశిక్షణ ఉల్లంఘనగా భావించి పార్టీ నుంచి సస్పెండ్ చేసినట్లు రామగుండం కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బొంతల రాజేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సస్పెన్షన్ తక్షణమే అమల్లోకి వస్తుందని పేర్కొన్నారు. అదేవిధంగా, ఇదే ఘటనకు సంబంధించి పార్టీ క్రమశిక్షణ, సిద్ధాంతాలను అతిక్రమించినట్లు భావిస్తూ మాజీ కార్పొరేటర్లు పెద్దెల్లి తేజస్విని, పెద్దెల్లి ప్రకాష్‌లకు షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. ఈ వ్యవహారంపై జనవరి 20, 2026లోగా వివరణ ఇవ్వాలని నోటీసుల్లో సూచించారు. గడువులోగా సమాధానం ఇవ్వని పక్షంలో పార్టీ తీసుకునే తదుపరి చర్యలకు వారే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు.

## రోడ్డు భద్రత అందరి బాధ్యత

***ప్రమాదాలు నివారించడమే లక్ష్యం.. పెద్దపల్లి డీ.సీ.పీ రామ్ రెడ్డి***




**పెద్దపల్లి ప్రతినిధి,జనవరి 13 (నినాదం)**
రోడ్డు ప్రమాదాల వల్ల ప్రాణాలు ఎన్నో పోతున్నాయని వాటి వల్ల కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని వాటి నివారణే లక్ష్యంగా పోలీస్ శాఖ పని చేస్తుందని, పెద్దపల్లి డీ.సీ.పీ రామ్ రెడ్డి అన్నారు. మంగళవారం పెద్దపల్లి రూరల్ ఎస్.ఐ మల్లేష్ ఆధ్వర్యంలో పెద్దబొంకూరు గ్రామంలో అరైవ్–అలైవ్ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పెద్దపల్లి డీ.సీ.పీ రామ్ రెడ్డి,ఎసిపి జి.కృష్ణ హాజరు అయ్యారు.ఈ సందర్భంగా ప్రమాదాల బారిన పడి నష్టపోయిన కుటుంబాల ఆర్థిక స్థితి,వారి బాధలను తెలుసుకున్నారు.అనంతరం డీ.సీ.పీ రామ్ రెడ్డి మాట్లాడుతూ,రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా ప్రమాదాల నివారణకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని అన్నారు. వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని,కారు డ్రైవ్ చేసేపుడు సీట్ బెల్ట్ వినియోగించాలన్నారు. వాహనాలు నడిపే వారి మద్యం సేవించారాదని అలా చేసిన వారి పై చట్ట రీత్యా చర్యలు తీసుకుంటామన్నారు.18 ఏళ్ల వయసు నిండిన వారు మాత్రమే వాహనాలు నడపాలని,వారు కూడా డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. రోడ్డు భద్రత నియమాలు పాటిస్తూ ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరు సహకరించాల న్నారు. అనంతరం గ్రామస్థులతో ప్రతిజ్ఞ చేయించారు.ఈ కార్యక్రమంలో పెద్దపల్లి సి.ఐ ప్రవీణ్ కుమార్,ట్రాఫిక్ సీ.ఐ అనిల్ కుమార్, పెద్దపల్లి రూరల్ ఎస్.ఐ మల్లేష్, గ్రామాల సర్పంచ్ లు కాల్వల తిరుపతి,రిబ్కా,సంతోష్,వార్డు సభ్యులు,ఆటో యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

# అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు

**పేదలందరికీ సంక్షేమ పథకాలు -ఎమ్మెల్యే విజయరమణ రావు**



**పెద్దపల్లి ప్రతినిధి,జనవరి 13 (నినాదం)**
పెద్దపల్లి పట్టణంలోని రంగంపల్లి 10, 11 వార్డుల్లో అర్హులైన 36 మంది కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్ల నూతన నిర్మాణాలకు ముగ్గులు పోసి భూమి పూజ అనంతరం లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయరమణ రావు మాట్లాడుతూ, అర్హులైనవారందరికే ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసి పేద ప్రజల సొంతింటి కల నెరవేర్చడమే కాంగ్రెస్ సర్కార్ ధ్యేయం అని అన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వ హయంలో పేదలందరికీ సంక్షేమ ఫలాలు అందుతున్నాయని అన్నారు.ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు 400 ఎస్.ఎఫ్.టీ కి తగ్గకుండా 600 ఎస్.ఎఫ్.టి కి పెరగకుండా చూసుకోవాలని సూచించారు. గత పాలకులు పేదలకు డబల్ బెడ్ రూంలు ఇస్తామని ఎన్నికల సమయాల్లో హామీలు ఇచ్చి ఇండ్లు మంజూరు చేయకుండా పబ్బం గడిపారని విమర్శించారు.కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేశామని పెద్దపల్లి నియోజకవర్గంలో నిర్మాణ దశలో ఉన్నాయని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తుందని పెద్దపల్లి పట్టణంలో శరవేగంగా అభివృద్ధి కార్యక్రమాలు



చేపడుతున్నామని పట్టణం కాంగ్రెస్ హయంలో సుందరంగా మారుతుందని గుర్తు చేశారు. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను ఆశీర్వదించాలని ప్రజలను కోరారు.ఈ కార్యక్రమంలో పెద్దపల్లి మున్సిపల్ కమిషనర్ వెంకటేష్, మున్సిపల్ అధికారులు, మాజీ కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, యూత్ కాంగ్రెస్ నాయకులు,రంగంపల్లి ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# కళ్యాణం...కమనీయం...

## అంగరంగ వైభవంగా గోదారంగనాథుల కల్యాణ మహోత్సవం

## పాల్గొన్న ఆలయ కమిటీ అధ్యక్షులు అంబటి అర్చన, సంతోష్ రావు



**గోదావరిఖని, జనవరి 13 (నినాదం):**
గోదావరిఖని ఐబీ కాలనీ లోని శ్రీ కల్యాణ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో మంగళవారం గోదారంగనాథుల కల్యాణ మహోత్సవం భక్తిశ్రద్ధల నడుమ ఆధ్యాత్మిక వైభవంగా జరిగింది. ఈ కల్యాణ కార్యక్రమానికి పట్టణం నలుమూలల నుంచే కాకుండా పరిసర గ్రామాల నుంచి కూడా పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. స్వామివారి దర్శనంతో పాటు కల్యాణ ఘట్టాన్ని ప్రత్యక్షంగా వీక్షిస్తూ భక్తులు పరవశించారు. వేద మంత్రోచ్చారణలు, మంగళ వాయిద్యాల నాదాలతో పాటు సుందరమైన పుష్పాలంకరణలతో ఆలయ ప్రాంగణం దివ్య వాతావరణాన్ని సంతరించుకుంది. ఈ సందర్భంగా ఆలయ కమిటీ అధ్యక్షులు అర్చన–సంతోష్ రావు అంబటి మాట్లాడుతూ, గోదారంగనాథుల కల్యాణ దర్శనం భక్తులకు సుఖసంతోషాలు, కుటుంబ సమైక్యత, శుభాలు కలుగుతాయని తెలిపారు. కల్యాణ మహోత్సవాన్ని విజయవంతం చేయడంలో సహకరించిన భక్తులు, దాతలు, ఆలయ సిబ్బందికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేయడంతో పాటు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. దేవాలయ నిర్మాణానికి,




కళ్యాణం లో పాల్గొన్న అంబటి అర్చన–సంతోష్ రావు

కల్యాణ మహోత్సవానికి సహకరించిన వారిని శాలువాలతో ఘనంగా సత్కరించారు. సంతోష్ రావు అంబటి, జి. శ్రీనివాస్, పల్లెర్ల కృష్ణ ప్రసాద్, కోటేశ్వరరావు, మిట్ట శంకర్, ముప్పు రాజమౌళి పాల్గొన్నారు.



# బూడిద మాఫియాపై కఠిన చర్యలు తీసుకోవాలి

- కేంద్ర విద్యుత్, బొగ్గు, హోం శాఖ మంత్రులకు ఫిర్యాదు చేస్తాం
- గత ఏడాది కాలంగా జాతీయ రహదారులకు బూడిద సరఫరా జరగడం లేదు
- 24 గంటల్లో సరఫరా ప్రారంభించకపోతే యాష్ పాండ్‌కు వెళ్లి తామే బూడిద తరలిస్తాం
- బిజెపి జిల్లా ప్రధానకార్యదర్శి కోమల్ల మహేష్




**గోదావరిఖని, జనవరి 13 (నినాదం):**
జాతీయ రహదారులకు ఎన్.టి.పి.సి బూడిదను చట్టబద్ధ టెండర్ ను పొందిన వారి ద్వారా బూడిదను వెంటనే సరఫరా చేయాలనీ, బూడిద మాఫియాపై రామగుండం సీపీ చర్యలు తీసుకోవాలని బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి కోమల్ల మహేష్ డిమాండ్ చేశారుగోదావరిఖని ప్రెస్ క్లబ్ లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్.టి.పి.సి సంస్థ నుండి కోట్లాది రూపాయలు బ్యాంకు గ్యారంటీ ద్వారా టెండర్లను పొందిన వారిని బూడిద ప్లాంట్ లో మిషన్ లు పెట్టి నడుపుకోకుండా.. గత సంవత్సరం కాలంగా ఇక్కడ కొందరు బూడిద మాఫియాగా ఏర్పడి టెండర్ పొందిన వారిని అడ్డుకొని జాతీయ రహదారులకు బూడిద సరఫరా జరుగకుండా చేస్తున్నారని ఆరోపించారు. రామగుండం పోలీస్ కమిషనర్ దీనికి అడ్డుకట్ట వేస్తూ బూడిద అక్రమార్కుల పట్ల చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. 24 గంటలలోగా చట్టబద్ధ టెండర్ పొందిన వారి ద్వారా బూడిదను జాతీయ రహదారులకు సరఫరా చేయాలని లేదంటే తామే స్వయంగా యాష్ పాండ్ వద్దకు వెళ్లి బూడిదను టిప్పర్లలో నింపి పంపిస్తామని హెచ్చరించారు.

తాము బీజేపీ పార్టీ పరంగా రామగుండం సిపి కి, కేంద్ర విద్యుత్ శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ కు, సహాయ మంత్రి ప్రహ్లాద్ యశో నాయక్ కు, కేంద్ర బొగ్గు గనుల శాఖా మంత్రి కిషన్ రెడ్డికి, కేంద్ర హోమ్ శాఖ సహాయమంత్రి బండి సంజయ్ కి ఫిర్యాదు చేస్తామని తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు సుల్వ లక్ష్మీనర్సయ్య, నాయకులు కొండపర్తి సంజీవ్, మిట్టపల్లి సతీష్, ఐత పవన్ కుమార్, సిలివేరి అంజి, ఈదునూరి చిరంజీవి, జనగామ శివరామ కృష్ణ, చెన్నూరి రమేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# ఏఐఎఫ్టిపి దక్షిణ భారత విభాగంలో మంథని వాసికి చోటు

**సంయుక్త కార్యదర్శి గా నగేష్ రంగి**

**మంథని టౌన్ జనవరి 13 (నినాదం):**
హైదరాబాద్ లో ప్రముఖ టాక్స్ అడ్వకేట్ నగేష్ రంగి ఆల్ ఇండియా ఫెడరేషన్ ఆఫ్ టాక్స్ ప్రాక్టిషనర్స్ (ఏఐఎఫ్టిపి)దక్షిణ భారత విభాగం నిర్వాహణ కమిటీలో సంయుక్త కార్యదర్శిగా 2026 గా నియమితుల య్యారు.తెలంగాణ రాష్ట్రం నుండి ఈ పదవికి మంథని చెందిన న్యాయవాది జాతీయ స్థాయిలో ఎంపిక కావడం విశేషం. దేశవ్యాప్తంగా వేలాది టాక్స్ ప్రాక్టిషనర్లకు ప్రాతినిధ్యం వహిస్తున్న ఏ ఐ ఎఫ్ టి పి వంటి ప్రతిష్టాత్మక జాతీయ సంఘంలో దక్షిణ భారత విభాగంలో సంయుక్త కార్యదర్శి గా పదవి పొందటం ఆనందంగా ఉందని రంగి నగేష్ తెలిపారు. ఈ ఎన్నిక ద్వారా వృత్తిపరమైన నైపుణ్యం, సంస్థాగత అనుభవం, నాయకత్వ ప్రతిభకు జాతీయ స్థాయిలో సంపూర్ణ గుర్తింపు లభించినట్లు భావిస్తున్నారు. గతంలో నగేశ్ రంగి తెలంగాణ టాక్స్ ప్రాక్టీషనర్స్ అసోసియేషన్ అధ్యక్షులుగా వరుసగా రెండు పర్యాయములు బాధ్యతలు చేపట్టి, సంఘాన్ని సుస్థిరమైన మార్గంలో ముందుకు నడిపించారు. 2025లో సదరన్ జోన్ తెలంగాణ సమన్వయకర్తగా బాధ్యతలు నిర్వర్తించారు. వీరు సంఘ సభ్యుల సంక్షేమం, వృత్తి పరమైన సమస్యల పరిష్కారానికి అంకిత భావంతో నిరంతర కృషి చేస్తున్నారు. సంఘ అభివృద్ధికి విశేష సేవలు అందించారు.తెలంగాణతో పాటు ఇతర రాష్ట్రాల టాక్స్ ప్రాక్టిషనర్ల సమస్యలను ఉన్నత వేదికలపై ప్రస్తావించారు. జీఎస్టి అమలు, చట్టపరమైన మార్పులు, ప్రొఫెషనల్స్‌ఎదుర్కొంటున్న సవాళ్లపై అనేక అవగాహన సదస్సులు, శిక్షణ కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించారు. వృత్తి పట్ల అపారమైన అంకిత భావం, నాయకత్వ సామర్థ్యం, క్రమశిక్షణతో కూడిన నిరంతర సేవలను పరిగణనలోకి తీసుకున్న ఏఐఎఫ్టిపి జాతీయ నాయకత్వం రంగి నగేష్ తో పాటు తెలంగాణకు చెందిన ఖమ్మం జిల్లా వాసి ఉల్లిబోయిన సైదులు




2026–27 కాలానికి జాతీయ కార్యవర్గ సభ్యుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కోఆప్టెడ్ సభ్యులు గా వసంత కుమార్ రెడ్డి నియమితు లయ్యారు. ఈ ఎన్నిక ద్వారా తెలంగాణ నుండి, జాతీయ స్థాయిలో మరింత ప్రాధాన్యం లభించిందని వృత్తి వర్గాలు అభిప్రాయ పడుతున్నాయి. సదరన్ జోన్ లో వీరితో పాటు తెలంగాణ నుండి టి వి సుబ్బారావు సమన్వయకర్తగా, మేనేజింగ్ కమిటీ సభ్యులుగా హైదరాబాద్ నుండి విఠల్ రామరాజు, కాట్రగడ్డ నరేంద్రబాబు, కె.నర్సింగ రావు, రమణమూర్తి, బాలకృష్ణ, సమ్మయ్య, దుర్గాప్రసాద్ రావు ఖమ్మం, మల్లికార్జున్ దేవ్ కరీంనగర్, వెంకటరమణ, నల్గొండ తదితరులు ఎన్నికైన్నారు.ఈ నియా మకం యువ టాక్స్ ప్రాక్టిషనర్లకు స్ఫూర్తిగా నిలుస్తుందని, భవిష్య త్తులో తెలంగాణ రాష్ట్ర టాక్స్ ప్రాక్టీషనర్ల సమస్యలను జాతీయ వేదికపై మరింత బలంగా ప్రస్తావించేందుకు దోహద పడుతుందని పలువురు అభిప్రాయ పడుతున్నారు. ఈ నియామకంతో కష్టపడి పనిచేస్తే జాతీయ స్థాయిలోనూ గుర్తింపు సాధ్యమేనన్న నమ్మకాన్ని బలపరుస్తోందని తెలియ జేసారు.

## ముఖ్యమంత్రి సహాయ నిధి పేద ప్రజలకు అండ

**మాజీ ఎమ్మెల్యే నారాయణరావు పటేల్**



**నిర్మల్ ప్రతినిధి(భైంసా), జనవరి 12(నినాదం):**
పేద ప్రజల ఆరోగ్యం కోసం ప్రభుత్వం అందిస్తున్న ముఖ్యమంత్రి సహాయ నిధి వరం లాంటిదని మాజీ ఎమ్మెల్యే బి. నారాయణరావు పటేల్ అన్నారు. భైంసా పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో వివిధ మండలాలకు చెందిన లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను లబ్ధిదారులకు మాజీ ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ పేద ప్రజల ఆరోగ్యంతో పాటు సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ముఖ్యమంత్రి సహాయనిధి వరంలాంటిదాని పేర్కొన్నారు. ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు వైద్య చికిత్సల కోసం ఇబ్బంది పడకూడదని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం సీఎంఆర్ఎఫ్ నిధులను త్వరగా విడుదల చేస్తుందని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలు అందేలా చూస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ముధోల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రావుల గంగారెడ్డి, అష్ట సర్పంచ్ రావు లావణ్య శ్రీనివాస్, నాయకులు లోలం మురళి, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## వాహనాలకు సరైన పత్రాలు కలిగి ఉండాలి


**మైనర్లు వాహనం నడిపితే చట్ట రీత్య నేరము**



**పెద్దపల్లి రూరల్ జనవరి 13 (నినాదం)**
జూలపల్లి మండల పోలీస్ స్టేషన్ పరిధిలోని తేలుకుంట గ్రామంలోని మంగళవారం రోజున అరైవ్–అలైవ్ కార్యక్రమాన్ని జూలపల్లి ఎస్సై సిహెచ్ సనత్ కుమార్ నిర్వహించారు.ఈ కార్యక్రమానికి జూలపల్లి మండేల ప్రజలు భారీ సంఖ్యలో హాజరయ్యారు.రోడ్డు భద్రత కు సంబంధించి తగు జాగ్రత్తలు వారికి సూచించారు.ఇందులో భాగంగా ఎస్.ఐ సనత్ కుమార్ మాట్లాడుతూ, ప్రతి ఒక్కరు వాహనాలకు సరైన పత్రాలు కలిగి ఉండాలని,18 సం,రాలు నిండిన ప్రతి ఒక్కరు డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరిగా తీసుకోవాలని పేర్కొన్నారు.ఎవరైనా లైసెన్స్ లేకుండా ఎలాంటి వాహనాలు నడిపిన చట్టరీత్య చర్యలు వారిపై తీసుకోబడతాయని హెచ్చరించారు. అలాగే 18 సం,రాల లోపు పిల్లలకు వాహనాలు ఇవ్వకూడదని,ఒకవేళ ఎవరైనా అలా పట్టుబడితే వారి తల్లిదండ్రులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై సనత్ కుమార్ తెలిపారు.ప్రతి ఒక్కరూ తమ వాహనాలను నెమ్మదిగా నడుపుతూ, ఎదుటివారికి ఇబ్బంది కలగకుండా నడిపే బాధ్యత మీపై ఉందని గుర్తు చేశారు.ఆటో డ్రైవర్లు వారి ఆటోలో మోతాదుకు మించి ప్యాసింజర్లను తరలించరాదని అలా ఎవరైనా తరలిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై పేర్కొన్నారు. మనం చేసే చర్య వల్ల ఎదుటివారికి గాని మనకు గాని నష్టం జరగకూడదని,వాహనం నడిపేటప్పుడు బాధ్యతగా నడపాలని గుర్తు చేశారు.ఈ కార్యక్రమంలో జూలపల్లి పోలీస్ సిబ్బంది తోపాటు, గ్రామ సర్పంచ్ మరియు గ్రామస్తులు పాల్గొనడం పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


## మైనారిటీలకు నిధులు మంజూరు పట్ల హర్షం

**మంథని, జనవరి 13( నినాదం)**



మంథని పట్టణంలోని ముస్లిం మైనార్టీల సంక్షేమం కోసం రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు నిధులు మంజూరు చేయడం పట్ల జమాతే ఇస్లామి హింద్ అధ్యక్షులు మోహ్మద్ సర్దార్ ఖన్, ఉపాధ్యక్షులు యండి వసీయోద్దీన్(షాహిద్), కార్యదర్శి మోహ్మద్ అఫ్జల్, ప్రచార కార్యదర్శి ఆలీం ఖాన్ లు బుధవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. మంథని మున్సిపాలిటీ పరిధిలోని కూచిరాజ్ పల్లి ఈద్ మజీద్ పునర్నిర్మాణం కోసం రూ. 30 లక్షలు, ఖబ్రస్తాన్ ప్రహరీగోడ నిర్మాణం కోసం రూ. 20 లక్షలు మంజూరు చేసి శంకుస్థాపన చేయడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ కృతజ్ఞతలు తెలిపారు.

## రామగుండం నగర పాలక సంస్థలో ముసాయిదా పోలింగ్ కేంద్రాల జాబితా ప్రదర్శన



**గోదావరిఖని, జనవరి 13 (నినాదం):**
తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం జారీ చేసిన నోటిఫికేషన్‌లో పేర్కొన్న షెడ్యూల్ ప్రకారం రామగుండం నగర పాలక సంస్థ ముసాయిదా పోలింగ్ కేంద్రాల జాబితాను మంగళవారం ప్రచురించారు. కమిషనర్ జె. అరుణ శ్రీ రామగుండం నగర పాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ముసాయిదా పోలింగ్ కేంద్రాల జాబితా ప్రదర్శించారు.ఈ జాబితాకు సంబంధించి సలహాలు, సూచనలు ఈ నెల 14, 15 తేదీలలో నగరపాలక సంస్థ కార్యాలయంలో లిఖితపూర్వకంగా సమర్పించవచ్చని కమిషనర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ మారుతి ప్రసాద్, సెక్రటరీ ఉమా మహేశ్వర్ రావు, అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, ఎ.సి.పి శ్రీ హరి, టి పి ఎస్ నవీన్, సూపరింటెండెంట్ పబ్బాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## నిర్మల్ పట్టణంలో విస్తృతంగా పర్యటించిన ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి

**నిర్మల్ ప్రతినిధి, జనవరి 13.(నినాదం):**



నిర్మల్ పట్టణంలోని పలు ప్రాంతాల్లో బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి విస్తృతంగా పర్యటించారు. పట్టణంలోని మంజులాపూర్, శాస్త్రీనగర్, శ్రీనగర్, బోయవాడ, ప్రియదర్శిని నగర్ కాలనీలో బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి కాలనీ వాసుల ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా శాస్త్రీనగర్ శివాలయం తో పాటు, శ్రీనగర్ హనుమాన్ ఆలయాలను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వార్డులలో సమస్యలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు రావుల రాం నాథ్, మేడిసెమ్మ రాజు, డా మల్లకార్జున రెడ్డి, పట్టణ అధ్యక్షులు ఆకుల కార్తీక్, తో పాటు పట్టణ బీజేపీ నాయకులు, తాజా మాజీ కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

# జన నినాదంమై వినిపించాలి

## ప్రజాస్వరం మరింత బలపడాలి: జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్

**నినాదం తెలుగు దినపత్రిక క్యాలెండర్‌ను ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్**





**భద్రాద్రి కొత్తగూడెం, జనవరి 13**

ప్రజల సమస్యలు, ఆశలు, ఆకాంక్షలకు అద్దం పట్టేలా జన "నినాదం"మై వినిపించాలని, ప్రజా సమస్యల పరిష్కార సంకల్పంతో నడుస్తున్న నినాదం తెలుగు దినపత్రిక క్యాలెండర్‌ను జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఘనంగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా స్టాఫ్ రిపోర్టర్ జల్లి శామ్ ఆధ్వర్యంలో నిర్వహించగా, కలెక్టర్ క్యాలెండర్‌ను ఆవిష్కరించి నినాదం పత్రిక బృందానికి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ జితేష్ వి పాటిల్ మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యంలో మీడియా కీలక పాత్ర పోషిస్తుందని, ముఖ్యంగా ప్రజల నినాదాన్ని అధికార వ్యవస్థల దృష్టికి తీసుకువెళ్లడంలో నిష్పక్షపాత జర్నలిజం అవసరం ఎంతో ఉందని పేర్కొన్నారు. నినాదం పత్రిక ప్రజాసమస్యలపై నిరంతరం స్పందిస్తూ, బాధ్యతాయుత పాత్ర పోషించడం అభినందనీయమన్నారు. ఈ క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం నినాదం పత్రిక ప్రజాసేవా ప్రయాణంలో మరో మైలురాయిగా నిలిచింది. ప్రజల గొంతుగా, జనసమస్యల ప్రతిధ్వనిగా నినాదం మరింత ముందుకు సాగాలని పలువురు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం ఆర్డీ హరికృష్ణ, ఆయా మండలాల విలేకరులు తదితరులు పాల్గొన్నారు.

**ప్రముఖుల ప్రశంసలు..**



నినాదం పత్రిక క్యాలెండర్ ఆవిష్కరణ చేసిన అడిషనల్ కలెక్టర్ వెంకటేశ్వరరావు, తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు సంగం వెంకటపుల్లయ్య, గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ సభ్యులు పత్రిక సభ్యులను ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రజాస్వామ్య వ్యవస్థలో మీడియా ప్రజల తరఫున ప్రశ్నించే వేదికగా నిలవాలని, నిజాయితీతో ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చే పత్రికలే సమాజాన్ని ముందుకు నడిపిస్తాయని పేర్కొన్నారు. ప్రత్యేకంగా నినాదం పత్రిక గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు ప్రజల నినాదాన్ని అధికార యంత్రాంగానికి చేరవేస్తూ బాధ్యతాయుత పాత్ర పోషిస్తోందని ప్రశంసించారు. అలాగే, సమాజ హితం, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా జర్నలిజం సాగినప్పుడే ప్రజలకు న్యాయం జరుగుతుందని అన్నారు. భవిష్యత్తులోనూ నినాదం పత్రిక ఇదే ప్రజాపక్ష ధోరణితో ముందుకు సాగాలని ఆకాంక్షించారు.

# ఎంపీ ఈటెల రాజేందర్ చేత నినాదం క్యాలెండర్ ఆవిష్కరణ



**కీసర సర్కిల్, నాగారం డివిజన్, జనవరి 13, (నినాదం)**

కీసర సర్కిల్, నాగారం డివిజన్, ఆర్ ఎల్ నగర్ లో కీసర మండలం రిపోర్టర్ ఎస్ దినేష్ కుమార్ ఆధ్వర్యంలో నినాదం నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ ఎంపీ ఈటల రాజేందర్ చేతుల మీదుగా ఆవిష్కరించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ...ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా పత్రికలు కీలక పాత్ర పోషిస్తున్నాయని అన్నారు. సమాజంలో ప్రతి ఒక్కరు తమ బాధ్యతలను నెరవేర్చుకుంటూ, సమాజ స్థాపన, సాంఘిక అభివృద్ధి పేదల పట్ల ప్రేమ, దేశ అభివృద్ధి కోసం పట్టుదలతో కృషి చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. సమకాలిన పరిస్థితుల్లో వాస్తవాలు తెలుసుకోవాలంటే ప్రజలు పత్రికలు చదవలసిన అవసరం ఉందని తెలిపారు. వార్తా, వార్త శైలి, సంఘటనాల వివరాలు స్థానికుల వ్యాసము పత్రికల కథనంలో తెలుపుతున్నారని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో నాగారం మున్సిపల్ మాజీ చైర్మన్ కౌకుంట్ల చంద్ర రెడ్డి మాజీ కౌన్సిలర్ విద్యా శ్రీనివాస్ గౌడ్ స్థానిక బిజెపి నాయకులు ఎం సురేష్, బాలరాజు, మీడియా మిత్రులు తదితరులు పాల్గొన్నారు.

# నిఖార్సైన జర్నలిజానికి నిదర్శనం నినాదం

**నాగర్ కర్నూల్ ప్రతినిధి డిసెంబర్ 13 (నినాదం)**

ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా ఉంటూ నిఖార్సైన జర్నలిజానికి నిదర్శనంగా నినాదం దినపత్రిక నిలిచిందని నాగర్ కర్నూల్ జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ జి పాటిల్ అన్నారు. మంగళవారం నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయంలో నినాదం దినపత్రిక క్యాలెండర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.నినాదం దినపత్రిక ప్రజాస్వామ్య విలువలను కాపాడుతూ నిజాయితీతో వార్తలు రాస్తూ ప్రజల మన్ననలు పొందుతుందని ప్రశంసించారు. సమాజంలో అవగాహన పెంచడంలో



మీడియా కీలక పాత్ర పోషిస్తుందన్నారు ప్రజలకు సరైన సమాచారం అందించడంలో నినాదం దినపత్రిక ముందుందని తెలిపారు. ఇటీవల కాలంలో ప్రజా సమస్య ఏదైనా అందులో వాస్తవం తెలియాలంటే నినాదం దినపత్రిక చదవాల్సి వస్తుందని అన్నారు. రాష్ట్ర రాజకీయాల్లో జరుగుతున్న విప్లవాత్మకమైన సంఘటనలు మార్పులపై వినూత్న కథనాలను అందిస్తూ ప్రజల గుండెచప్పుడుగా నినాదం దినపత్రిక మారిందని అన్నారు ప్రధాన పత్రికలకు దీటుగా నినాదం దినపత్రిక నిర్భయంగా రాస్తుందని ఎప్పటికప్పుడు ప్రజల్లో చైతన్యం ప్రశ్నించే తత్వం ఉన్నప్పుడే అధికార యంత్రాంగం స్పందిస్తుందని అన్నారు. రాబోయే రోజుల్లో నినాదం దినపత్రిక మరింత అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని ఆకాంక్షించారు.

## ప్రజా సమస్యలను వెలికి తీయడంలో

# నినాదం పత్రిక ముందంజ



**చింతపల్లి, జనవరి 13 (నినాదం)**

ప్రజా సమస్యలను వెలుగు తీయడంలో నినాదం దినపత్రిక ముందంజలో ఉందని స్థానిక ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ అన్నారు.దేవరకొండ పట్టణంలో మంగళవారం నినాదం దినపత్రిక క్యాలెండర్ను ఆయన తన కుమారుడు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు అభిలాష నాయక్ తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నినాదం దినపత్రిక ప్రజా సమస్యలను వెలికి తీయడంతో పాటు ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారం కోసం కృషి చేయడం అభినందనీయమన్నారు. నినాదం దినపత్రిక దిన దిన ప్రవర్ధమానమై పత్రికా రంగంలో ఉన్నత స్థాయిలో నిలుస్తుందని ఆయన ఎంతో ధీమాగా అన్నారు. ఈ సందర్భంగా ఆయన నియోజకవర్గ ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అంగిరేకుల నాగభూషణం, తదితరులు పాల్గొన్నారు.

# నిజాలను నిర్భయంగా రాసే పత్రిక నినాదం

### నినాదం క్యాలెండర్ ఆవిష్కరించిన కార్పొరేటర్


**అల్వాల్, అల్వాల్ 13 (నినాదం)**

ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువస్తూ నిజాలను నిష్పక్షంగా రాస్తున్న పత్రిక నినాదం దినపత్రిక అని కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మంగళవారం తన కార్యాలయంలో 20 26 నినాదం క్యాలెండర్ ను కార్పొరేటర్ శాంతి శ్రీనివాసరెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నినాదం జర్నలిస్టులు అందరూ నిజాలను నిక్కసిగా రాస్తూ ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా నిలుస్తూ ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు ప్రభుత్వం మరియు అధికారుల దృష్టికి వార్తపరంగా తీసుకువస్తూ సమాజానికి ఉపయోగపడే విధంగా వార్తలు రాస్తున్న నినాదం పత్రికకు ఈ సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేశారు. కొత్త సంవత్సరంలో ప్రజలందరూ సంతోషాలతో ఉండాలన్నారు. ప్రజలకు తాను ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ సమస్యలను పరిష్కరిస్తున్నానన్నారు.



# వివాదంలో యశ్ టాక్సిస్

**మహిళా కమిషన్ నోటీసులు**



కన్నడ స్టార్ నటుడు యశ్ హీరోగా గీతూ మోహన్‌దాస్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న 'టాక్సిక్' చిత్రం ప్రస్తుతం వివాదంలో చిక్కుకుంది. ఈ సినిమా టీజర్‌ను ఇటీవల చిత్రబృందం విడుదల చేసిన విషయం తెలిసిందే. అయితే ఈ సినిమా టీజర్‌లో అశ్లీలతతో పాటు అభ్యంతరకర సన్నివేశాలు ఎక్కువగా ఉన్నాయంటూ ఆమ్ ఆద్మీ పార్టీ నేతలు కర్ణాటక రాష్ట్ర మహిళా కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. ఆప్ రాష్ట్ర కార్యదర్శి ఉషా మోహన్ ఈ ఫిర్యాదులో పేర్కొంటూ.. టీజర్‌లోని దృశ్యాలు పిల్లల మానసిక ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపేలా ఉన్నాయని, తక్షణమే ఈ టీజర్‌ను సామాజిక మాధ్యమాల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ అంశాన్ని తీవ్రంగా పరిగణించిన మహిళా కమిషన్ వెంటనే రంగంలోకి దిగింది. టీజర్‌లోని అభ్యంతరకర దృశ్యాలను క్షుణ్ణంగా పరిశీలించి, తగిన చర్యలు తీసుకోవాల్సిందిగా సెన్సార్ బోర్డుకు లేఖ రాసింది. అంతేకాకుండా, దీనిపై పూర్తిస్థాయి నివేదికను సమర్పించాలని ఆదేశించింది. 'ఎ ఫెయిరీటేల్ ఫర్ గ్రోనప్స్' అనే ఉపశీర్షికతో రూపొందుతున్న ఈ చిత్ర గ్లింప్స్‌లో ఇంటిమేట్ సన్నివేశాలు ఎక్కువగా ఉండటంతో నెట్టింట పెద్ద ఎత్తున విమర్శలు వస్తున్నాయి. అయితే ఈ విమర్శలపై దర్శకురాలు గీతూ మోహన్‌దాస్ కాస్త ఘాటుగానే స్పందించారు. ఒక మహిళా దర్శకురాలు అయ్యుండి ఇలాంటి సన్నివేశాలను ఎలా చిత్రీకరించారు అంటూ వస్తున్న కామెంట్లను చూసి తాను ఏమాత్రం ఆశ్చర్యపోవడం లేదని, ఆ విమర్శలను తాను చాలా తేలిగ్గా తీసుకుంటున్నానని ఆమె స్పష్టం చేశారు.



# మనశంకరవరప్రసాద్.. తొలిరోజు 84 కోట్లు వసూళ్లు

'పండగకు వస్తున్నాం.. హిట్ కొడుతున్నాం..' అంటూ సంక్రాంతికి ప్రేక్షకుల ముందుకువచ్చి సందడి చేశారు చిరంజీవి. అనిల్ రావిపూడి దర్శకత్వంలో తెరకెక్కిన 'మన శంకరవరప్రసాద్ గారు' జనవరి 12న విడుదలైంది. ప్రీమియర్స్ నుంచే ఈ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌కు హిట్ టాక్ రావడంతో మొదటిరోజు వసూళ్లపై అందరిలోను ఆసక్తి నెలకొంది. తాజాగా ఆ వివరాలను నిర్మాణ సంస్థ అధికారికంగా ప్రకటించింది. ప్రీమియర్స్‌తో కలిపి మొదటి రోజు ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా రూ.84 కోట్లు వసూలుచేసినట్లు వెల్లడిరచింది. 'మన శంకరవరప్రసాద్ గారు' బాక్సాఫీస్‌ను బద్దలు కొట్టేశారంటూ పోస్టర్‌ను పంచుకుంది. చిరంజీవి సరసన నయనతార నటించిన ఈ సినిమాలో వెంకటేశ్ అతిథి పాత్రలో సందడి చేశారు. కథేంటంటే..: శంకరవరప్రసాద్ (చిరంజీవి) నేషనల్ సెక్యూరిటీ ఆఫీసర్. కేంద్రమంత్రి శర్మ (శరత్ సక్సేనా) రక్షణ బాధ్యతల్ని చూస్తుంటాడు. మంత్రి కూడా శంకరవరప్రసాద్‌ని తన కుటుంబసభ్యుడిలా చూస్తుంటాడు. భార్య శశిరేఖ (నయనతార) నుంచి వరప్రసాద్.. విడిపోయిన సంగతి తెలుసుకుని, ఓ బోర్డింగ్ స్కూల్‌లో చదువుతున్న తన పిల్లలతో కలిసి గడిపేలా ఏర్పాట్లు చేస్తాడు మంత్రి. పీఈటీగా ఆ స్కూల్‌లోకి అడుగుపెట్టిన శంకరవరప్రసాద్ తన పిల్లలకు చేరువయ్యాడా? అసలు భార్యతో ఎందుకు విడిపోయాడు? వాళ్ల పెళ్లి ఎలా జరిగింది? ఊహ తెలియని వయసులోనే తండ్రికి దూరమైన పిల్లలకు శంకరవరప్రసాదే తమ తండ్రి అనే విషయం ఎప్పుడు తెలిసింది?కర్ణాటకకు చెందిన మైనింగ్ బిజినెస్‌మ్యాన్ వెంకీ గౌడ (వెంకటేశ్)కీ, శశిరేఖకీ సంబంధం ఏమిటి? విడిపోయిన భార్యాభర్తలు తిరిగి కలుసుకున్నారా, లేదా? తదితర విషయాల్ని తెరపై చూసి తెలుసుకోవాల్సిందే.



NINADAM CINEMA



# ఆనాటి ఘటన గుర్తు చేసుకున్న పార్వతి తిరువోతు

తమిళ నటి ఆ పార్వతి తిరువోతు ఓ సినిమా షూటింగ్ లో తనకు జరిగిన చేదు సంఘటన గురించి చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి. తమిళ్ లో ధనుష్ హీరోగా 2013లో మరియన్ అనే సినిమా వచ్చింది. భరత్ బాలా దర్శకత్వం వహించిన ఈ సినిమా అప్పట్లో సూపర్ హిట్‌గా నిలిచింది. ఈ సినిమా షూటింగ్ గురించి మాట్లాడుతూ ' నేను తమిళంలో 'మరియన్' అనే సినిమాలో నటించాను. షూటింగ్ మొదటి రోజు షూటింగ్ లో హీరో ధనుష్ తో లవ్ సీన్ చేస్తున్నాను ఆ సీన్ లో నన్ను పూర్తిగా నీళ్లలో ముంచేశారు. వాళ్ళు నాపై నీళ్లు పోస్తున్నారు. సీన్ సరిగా రాలేదని మళ్ళీ మళ్ళీ నీళ్లు పోస్తూనే ఉన్నారు. అప్పుడు చాలా ఇబ్బంది పడ్డాను. కానీ నా చుట్టూ ఎవరూ నన్ను జాగ్రత్తగా చూసుకోలేదు. ఒకానొక సమయంలో నేను వాళ్ళ దగ్గరికి తిరిగి వెళ్లి హోటల్ కి వెళ్లి బట్టలు మార్చుకుని వస్తాను కాస్త బ్రేక్ ఇవ్వండి అని చెప్పను. వాళ్ళు కాదు అది సాధ్యం కాదు అని అన్నారు. నాకు ఇంకా ఓపిక నశించి గట్టిగా అరుస్తూ ' నేను పీరియడ్స్ లో ఉన్నాను. నేను వెళ్లాలి అని అరిచాను. వాళ్ళు ఏమనుకుంటారోనని కూడా నేను అసలు ఆలోచించలేదు. అప్పుడు సెట్ లో 50 మంది ఉన్నారు. వాళ్ళలో ముగ్గురు మాత్రమే అమ్మాయిలు. అవేవి పట్టించుకోకుండా నేను వెళ్ళిపోయానన్నారు. బట్టలు మార్చుకుందామన్న అదనంగా డ్రెస్ తెచ్చుకోకపోవడంతో ఇబ్బంది పడ్డానని వివరించారు.



# జపాన్‌లో పుష్ప-2 విడుదల

**జపాన్ చేరుకున్న హీరో అల్లు అర్జున్**

ఇండియన్ బాక్సాఫీస్‌ను షేక్ చేసిన 'పుష్పరాజ్' ఇప్పుడు జపాన్ ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమయ్యాడు. జనవరి 16న జపాన్‌లో 'పుష్ప 2: ది రూల్' భారీ స్థాయిలో విడుదల కానున్న నేపథ్యంలో, ఈ చిత్ర ప్రమోషన్ల కోసం బన్నీ స్వయంగా రంగంలోకి దిగారు. ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ తన కుటుంబంతో కలిసి జపాన్ రాజధాని టోక్యోకు చేరుకున్నారు. సోమవారం హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో భార్య స్నేహా రెడ్డి, పిల్లలు అయాన్, అర్హలతో కలిసి కనిపించిన బన్నీ టోక్యో చేరుకున్నట్లు తెలుస్తుంది. టోక్యోలోని తన హోటల్ గది నుంచి నగర అందాలను చూపిస్తూ అల్లు అర్జున్ సోషల్ మీడియాలో షేర్ చేసిన ఫోటో ప్రస్తుతం వైరల్ అవుతోంది.సినిమా విషయానికి వస్తే.. జపాన్ పంపిణీ సంస్థలు 'గీక్ పిక్చర్స్', 'షోచికూ' సంయుక్తంగా ఈ చిత్రాన్ని అక్కడ విడుదల చేస్తున్నాయి. జపాన్ ప్రేక్షకులకు కనెక్ట్ అయ్యేలా ఈ సినిమాను అక్కడ 'పుష్ప కునిన్' అనే టైటిల్‌తో విడుదల చేస్తున్నారు. సుకుమార్ దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రంలో రష్మిక మందన్న 'జాతర' ఎపిసోడ్ మరియు ఫహాద్ ఫాసిల్ పవర్‌ఫుల్ పర్ఫార్మెన్స్ జపాన్ ఆడియన్స్‌ను కూడా మెప్పిస్తాయని చిత్ర బృందం ధీమా వ్యక్తం చేస్తోంది.

Printed, Published & Owned by B.Srinivas, Printed at Sree Seshasai Enterprises Plot no.98/1, Co-operative Industrial Estate, Gandhi Nagar, Near Balanagar Medchel, Malkajgiri Dist. Hyderabad 500037 (T.S)
Published at Plot S11, 3rd Floor, Ballard Estate Margadarshi Building Tarnaka Secundrabad, Hyderabad 500 007 (T.S), Editor : B.Srinivas, PRGI.REGN.NO. APTEL /2003/11288, CELL : +91 8333068787